VISALAANDHRA Phone No. 76301 ఉదయం ★★★ Regd. No. H/VJ47

విశాలాంధ్ర

705237

సంపుటి 27 సంచిక 175 | విజయవాడ 29—10—1977 శనివారం | 6 పేజీలు 30 పైసలు

విశాలాంధ్ర చందా వివరాలు

	ఏజంట్లుద్వారా	పోస్టుద్వారా
నెల చందా	9–20	9–80
మూడు నెలలు	27–60	29–40
ఆరు నెలలు	55–20	58–80
సంవత్సరం	110–40	117–60

ఈ రేటు అడ్వాన్సుగా చందా చెల్లించినవారికి మాత్రమే వర్తించును.

మూడు దశాబ్దాలుగా దాగిన స్టాంపుల పునః ప్రత్యక్షం

ఫిలడెల్ఫియా, అక్టోబరు 28

యుద్ధకాలంలో గల్లంతయిన ఎనిమిది అపురూపమయిన స్టాంపులు - వాటి విలువ 5 లక్షల డాలర్లు - ఫిలడెల్ఫియా శివార్లలో ఒకటిఅటకలోని పాత పుట్ లాకర్‌లో దొరికాయి. ఒక మాజీ సైనికాధికారి వీటిని మూడు దశాబ్దాలుగా దాచేశాడు, కాని యిపుడు 50 వేల డాలర్ల బహుమతికై పశ్చిమ జర్మనీ ప్రభుత్వానికి అప్పగించనున్నాడు. హవాయి, బ్రిటిష్, గయానా, మారిషస్‌లకు చెందిన ఈ స్టాంపులు జర్మన్ రీచ్ పోస్టు మ్యూజియం లోనివి. యుద్ధకాలంలో ఉప్పు పాతర కింద దాయగా తర్వాత కనిపించలేదు.

తాలూకాలుగా మారనున్న సబ్‌తాలూకాలు

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, అక్టోబరు 28

తాలూకాల స్థాయికి మార్చిన 28 సబ్ తాలూకాలు నవంబర్ ఒకటి ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నుండి అమలులోకి వస్తాయి.

సచివాలయంలో పత్రికా విలేకరులతో ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు మాట్లాడుతూ ఆ ప్రాంతాల్లోని ప్రజలు తాలూకాఫీసులకు సంబంధించిన పనులకు ఇక ఎక్కువ దూరం పోవాల్సిన అవసరం లేదని అన్నారు.

ఈ కొత్త వ్యవస్థవల్ల ప్రభుత్వానికి రు 16 లక్షలు రికరింగ్, రు 40 లక్షలు నాన్ రికరింగ్ వ్యయమవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు.

ఈ పథకం క్రింద శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం, హిరమండలం, రాజాం, కురుపాం, పలాసా, పొందూరు తాలూకాలు ఏర్పడతాయి.

విశాఖపట్టణంజిల్లాలో మాడుగలతాలూకా, తూర్పుగోదావరి జిల్లాలో ఆలమూరు, ముమ్మిడివరం, పిఠాపురం, తుని, ఏల్లవరం, రంపచోడవరంలతో 6 తాలూకాలు ఏర్పడతాయి.

కృష్ణాజిల్లాలో జగ్గయ్యపేట తాలూకా, గుంటూరు జిల్లాలో మాచెర్ల, మంగళగిరి, పొన్నూరు తాలూకాలు, ప్రకాశం జిల్లాలో ఎర్రగొండపాలెం, కర్నూలుజిల్లాలో ఎమ్మిగనూరు, ఆత్మకూరు, బనగానపల్లి తాలూకాలు ఏర్పడతాయి.

కడపజిల్లాలో కమలాపురం, లక్కిరెడ్డిపల్లి, తాలూకాలు. అనంతపురం జిల్లాలో ఉరవకొండ తాలూకా, చిత్తూరు జిల్లాలో బంగారుపాలెం తాలూకా, నిజామాబాద్ జిల్లాలో మద్నూర్ తాలూకా, ఆదిలాబాద్ జిల్లాలో ఖనాపూర్, ఖమ్మంజిల్లాలో మణుగూర్ తాలూకాలుగా ఏర్పడతాయి.

నాగాలాండ్ మాజీ ముఖ్యమంత్రి పోటీలేకుండా ఎన్నిక

కోహిమా, అక్టోబరు 27

నాగాలాండ్ యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంటు అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి శ్రీ విజోల్ కోహిమాజిల్లా దక్షిణ అంగామి నియోజక వర్గంనుండి పోటీ లేకుండా ఎన్నికయ్యారు. ఆయనతో పోటీకి తలపడిన ఒకే ఒక కాంగ్రెసు అభ్యర్థి శ్రీ హోవర్ కిన్ తన నామినేషన్ ఉపసంహరించుకొన్నారు.

ఈ విషయాన్ని నేడు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం ఆ నియోజకవర్గం రిటర్నింగు ఆఫీసర్ ప్రకటించారు.

నాగాలాండ్‌లో నవంబర్ 18న పోలింగు జరుగుతుంది.

40 మంది విద్యార్థి, యువజనుల అరెస్టు

రాష్ట్ర సచివాలయం ముందు పికెటింగ్ సందర్భంగా

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, అక్టోబరు 28

నిరుద్యోగం అధిక ధరలకు వ్యతిరేకంగా అఖిల భారత యువజన సమాఖ్య, అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్‌లు ఇచ్చిన పిలుపు నందుకుని నేడిక్కడ రాష్ట్ర సచివాలయం ముందు పికెటింగ్ చేసిన 40 మంది యువజన, విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచారు.

అఖిల భారత యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ అమరేంద్ర నారాయణసిన్హా, ప్రదేశ్ యువజన సమాఖ్య కార్యదర్శి శ్రీ ఎస్. రామకృష్ణారెడ్డి, కోశాధికారి శ్రీమతి పావని, నగర యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ వెంకటేష్ తదితరులు అరెస్టయినవారిలో వున్నారు.

సచివాలయానికి ఉదయం ఉద్యోగులు హాజరయ్యే సమయంలో జరిగిన ఈ పికెటింగుకు ముందు పోలీసులు జాగ్రత్తగా లాఠీలు ధరించిన పోలీసులను అధికార్ల పర్యవేక్షణకై ఏర్పాటు చేశారు. విజయ వెన్నెమూర్తిని మూసివేశారు.

ప్లే కార్డులు, జెండాలు చేబూనిన విద్యార్థులు, నినాదాలతో సచివాలయం గేటు ముందుకు చేరుకోగానే పోలీసులు అకస్మికంగా అమాంతంగా ఎత్తుకుని పోలీసువ్యాన

(మిగతా 5వ పేజీలో)

శ్రీ చంద్రప్పన్ అరెస్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 28

నిరుద్యోగానికి, అధిక ధరలకు వ్యతిరేకంగా నేడు ఢిల్లీలో పికెటింగ్ చేస్తున్న అఖిలభారత యువజన సమాఖ్య అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులైన శ్రీ సి. కె. చంద్రప్పన్, మరో 200 మంది యువజన, విద్యార్థి కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.

విధులు నిర్వహించ రాదని హైకోర్టు జడ్జికి ఉత్తర్వు

అలహాబాద్, అక్టోబర్ 28

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా శ్రీ సతీష్ చంద్ర పనిచేయకుండా నిషేధిస్తూ హైకోర్టులో ఐదుగురు జడ్జీలపుల్ బెంచ్ నేడు మెజారిటీ తీర్పుతో ఆదేశమిచ్చింది.

పదవికి రాజీనామాచేసిన తర్వాత కూడా ఏ పరిస్థితిలో హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారో తెలుపవలసిందిగా సతీష్ చంద్రకు వారంట్ రిటను జారీ చెయ్యాలని కోరుతూ స్థానిక న్యాయవాది శ్రీ గోపాల మిశ్రా దాఖలుచేసిన రిట్ పిటిషన్‌ను ఈ మేరకు బెంచ్ అనుమతించింది.

మద్రాసుకు కృష్ణా జలాల ఒప్పందం

శ్రీ వెంగళరావు హర్షం

హైదరాబాదు, అక్టోబరు 28

తమిళనాడుకు మంచినీటి సరఫరాకు సంబంధించి కుదిరిన అంతర్రాష్ట్ర ఒప్పందం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ జె. వెంగళరావు హర్షం ప్రకటించారు.

నేడిక్కడ పత్రికలవారితో మాట్లాడుతూ, దీనివల్ల తమిళనాడుకు కృష్ణానది నుండి 12 టి. యం. సి. నీరు లభిస్తుందని, ఇందులో ఆంధ్రప్రదేశ్ వాటా 5 టి. యం. సి. నీరు వుంటుందని ఆయన తెలిపారు.

జూన్ నుండి ప్రారంభమై సెప్టెంబరుతో అంతమయ్యే వరద సీజన్‌లో తమిళనాడు 15 టి. యం. సి. నీరు విడుదల చేసుకోవాల్సిన అవసరముందని ఆయన అన్నారు.

మద్రాసు నగరంలో మంచినీటి సరఫరా మెరుగు పరచడానికి ఈ 15 టి యం. సి. నీరు వినియోగించుకొనవచ్చునని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర కమ్యూనిస్టు సమితి సమావేశం ప్రారంభం

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాదు, అక్టోబరు 28

నాలుగురోజులపాటు జరుగనున్న ప్రదేశ్ కమ్యూనిస్టుసమితి సమావేశం నేటి సాయంత్రం ఇక్కడ ప్రారంభమైంది. శ్రీ [illegible] పూరి సుబ్బయ్య, మూసలి వెంకటసుబ్బయ్య, సురవరం సుధాకరరెడ్డి అధ్యక్ష వర్గంగా వ్యవహరిస్తున్నారు.

జాతీయ సమితి కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు శ్రీ నీలం రాజశేఖరరెడ్డి దేశ రాజకీయ పరిస్థితులపై నివేదిక యిచ్చారు.

రాష్ట్ర రాజకీయ పరిణామాలపై ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ రేపు ఉదయం నివేదిక యిస్తారు. చర్చ ఎల్లుండి ఉదయం వరకు కొనసాగుతుంది.

గత సమావేశం నుండి నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్షతో పాటు భవిష్యత్ కార్యాచరణపై జనవరి 29 వరకు జరుగనున్న దేశవ్యాపిత సత్యాగ్రహ నిర్వహణపై 30, 31 తేదీలలో చర్చలు కొనసాగుతాయి.

పార్టీ జిల్లా, తాలూకా, శాఖా మహాసభల నిర్వహణకు కూడా ఈ సమావేశం కార్యక్రమాన్ని రూపొందిస్తుంది.

చెరకు ఉత్పత్తిదార్లకు ఆశాభంగం కలిగించిన కేంద్ర నిర్ణయం

ప్రదేశ్ రైతుసంఘాధ్యక్షులు శ్రీ వై.వి. కృష్ణారావు విమర్శ

హైదరాబాదు, అక్టోబరు 28

నాలుగేళ్ళనాటి చెరకు ధరనే 1977-78 సీజనుకు కూడా నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వ వ్యవహారపు నిరసనగా రాష్ట్రంలోని చెరకు ఉత్పత్తిదార్లంతా సమైక్యంగా ఆందోళన జరపాలని రాష్ట్ర రైతుసంఘ అధ్యక్షులు శ్రీ వై. వి. కృష్ణారావు నేడిక్కడ పిలుపిచ్చారు.

"77-78 సీజన్‌కు చెరకుధర పై కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ బర్నాలా చేసిన ప్రకటన దేశంలో లక్షలాది చెరకు ఉత్పత్తిదార్లకు ఆశాభంగం కలిగించింది. నాలుగేళ్ళ క్రితం నిర్ణయించిన ధరనే ఆ సీజన్‌లో కూడా చెల్లిస్తారని మంత్రి ప్రకటన తెలుపుతోంది. అంటే 8.5 శాతం చక్కెర దిగుబడి ఆధారంగా క్వింటాల్‌కు రు. 8.5 చెల్లిస్తారు. గత నాలుగేళ్ళలో ఉత్పత్తి వ్యయం పెరిగినందున, ఇతర అత్యవసర సరకుల ధరలు పెరిగిన దృష్ట్యా క్వింటాల్‌కు రు. 15 చెల్లించాలని ఉత్పత్తిదార్లు డిమాండ్ చేస్తున్నారు.

ప్రస్తుత ద్వంద్వ ధరల విధానాలనే కొనసాగించనున్నారు. వినిమయదార్లను, ముఖ్యంగా గ్రామీణ ప్రజానీకాన్ని దోచుకొని మిల్లు యజమానులకు లాభాలిచ్చే ఈ విధానానికి స్వస్తి చెప్పాలని ఉత్పత్తిదార్లు కోరుతున్నారు. మొత్తం ఉత్పత్తిని స్వాధీనం చేసుకుని పటిష్టమైన పంపిణీ వ్యవస్థ ద్వారా చక్కెరను వినిమయదార్లకు అందించాలని, టన్ను చెరకుకు రు. 150 ధర నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నారు. చక్కెరపై విపరీతమైన సుంకం తగ్గించా లంటున్నారు. ఇలాంటి విధానం ఉత్పత్తిదార్లకూ, వినిమయదార్లకూ అనుగుణంగా ఉంటుంది.

కాని జనతా ప్రభుత్వం గత కాంగ్రెసు ప్రభుత్వ అడుగుజాడల్లోనే నడుస్తోంది. మిల్లు యజమానుల ముఠా ఒత్తిడులకు లొంగి పోతోంది.

జనతా ప్రభుత్వం విసిరిన ఈ సవాలును మన రాష్ట్రంలోని చెరకు ఉత్పత్తిదార్లు అందుకుని, న్యాయమైన డిమాండ్లకోసం సమైక్యంగా పోరాడటానికి కోరుతున్నాను.

భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు చెరకు ఉత్పత్తిదార్ల సంఘాలన్నీ వెంటనే సమావేశం కావాలని కోరుతున్నాను.

స్థానికసంస్థల ఎన్నికల్లో రాజకీయపార్టీలు పాల్గొనకుండా నిషేధం: శ్రీ మొరార్జిదేశాయ్ సూచన

న్యూఢిల్లీ, అక్టోబరు 28

పంచాయితీలు, మున్సిపాలిటీల వంటి స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవహారాలనుండి రాజకీయాలను దూరంగా వుంచాలని, తద్వారా గ్రామాల అభివృద్ధికి ఆ సంస్థలు తమకృషిని కేంద్రీకరించేలాచేయాలని ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్ నేడు సూచించారు.

స్థానిక స్వపరిపాలనా, పట్టణాభివృద్ధి కేంద్ర మండలి 17వ సమావేశానికి ఆయన ప్రారంభోత్సవం చేస్తూ పై విధంగా సూచించారు. ఈ సంస్థల వ్యవహారాలలో రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోరాదని శ్రీ దేశాయ్ అన్నారు. ఈ సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు పాల్గొనకుండా నిషేధించాలని ఆయన చెప్పారు.

ఈ సంస్థల ఎన్నికలకు డబ్బు వ్యయం కాకుండా చూడవలసి వుందని: ఎప్పటి కప్పుడు ఎన్నికలను నిర్వహించడం అవసరమని అన్నారు.

ఏదో ఒక సాకుతో వాటిని నిరవధికంగా వాయిదా వేయరాదని అన్నారు.

ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యంలా పని చేయాలంటే గ్రామస్థాయివరకు ప్రభుత్వ విధులను వికేంద్రీకరించటం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఆంధ్ర దక్షిణ కోస్తా దిశగా వాయుగుండం

మద్రాసు, అక్టోబరు 28

బంగాళాఖాతంలో ఆగ్నేయ దిశగా నిన్న ఏర్పడిన వాయుగుండం మరింత తీవ్రమై ఆంధ్ర దక్షిణ కోస్తా దిశగా పయనిస్తున్నదని వాతావరణ పరిశోధనా కార్యాలయం ప్రకటించింది.

విస్తారంగా ఆంధ్ర కోస్తాలో రెండు రోజుల తర్వాత వర్షాలు పడవచ్చును.

త్రిపుర మిశ్రమ మంత్రివర్గంనుండి మార్క్సిస్టుపార్టీ ఉపసంహరణ

అగర్తలా, అక్టోబరు 28

త్రిపురలో శ్రీ రాధికారంజన్‌గుప్తా నాయకత్వాన గల మిశ్రమ మంత్రివర్గానికి తోడ్పాటును ఉపసంహరించుకోవాలని ఆ రాష్ట్ర మార్క్సిస్టు పార్టీ కార్యదర్శివర్గం నేడు నిర్ణయించింది.

ఈ విషయాన్ని పత్రికా గోష్ఠిలో రాష్ట్ర మార్క్సిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ దశరధదేబ్ వెల్లడిచేస్తూ రేపటిలోగా రాజీనామా చేయాలని తమ పార్టీకి చెందిన నలుగురు మంత్రులను ఆదేశించటం జరిగిందన్నారు.

మిశ్రమ మంత్రివర్గంలో హోం మంత్రిగా వుంటున్న మార్క్సిస్టుపార్టీ నాయకులు శ్రీ నృపేన్ చక్రవర్తి నిన్న కలకత్తాలో తమ పార్టీ కేంద్ర నాయకులతో చర్చించి వచ్చారు.

రాజకీయ పార్టీలపై ఆంక్షల కొనసాగింపు పాక్ సైనిక ప్రభుత్వ ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబరు 28

పాకిస్తాన్‌లో రాజకీయ కార్యకలాపాలపై నిషేధాన్ని సడలించబోమని సైనిక ప్రభుత్వము ప్రకటించింది.

నలుగురు సభ్యులుగల సైనిక మండలి నిన్న రావల్పిండిలో సమావేశమై యీ నిర్ణయం చేసింది.

పుకార్లు పుట్టించి ప్రజలలో నిరాశ వ్యాపింపజేసే వ్యక్తులపై సైనిక చర్యను తీసుకుంటామని హెచ్చరించింది.

బంగ్లాలో ఎన్నికలకు జయప్రకాశ్ సూచన

పాట్నా, అక్టోబరు 28

"నిర్బంధ విధానానికి స్వస్తి చెప్పి, మత వాదాలను, మత మౌఢ్యాన్ని రెచ్చగొట్టడాన్ని ఆపుచేసి, ప్రజల ప్రాథమిక స్వేచ్ఛలను పునరుద్ధరించవలసిందిగా శ్రీ జయప్రకాశ్ నారాయణ బంగ్లాదేశ్ అధ్యక్షుడు జియావుర్ రహమాన్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోడానికి వీలుగా స్వేచ్ఛాపూరితంగా ఎన్నికలు జరిపి, న్యాయ పరిపాలనకు వారి స్వంత ప్రజాతంత్ర ప్రభుత్వాన్ని తిరిగి నెలకొల్ప వలసిందిగాను కోరారు.

బంగ్లాదేశ్ పాలకులు చరిత్రనుండి గుణపాఠాలు నేర్చుకుని, తిరిగి ప్రజాస్వామ్యాన్ని తిరిగి నెలకొల్పి, దేనికైతే విముక్తి పోరాటాన్ని జరిపి విజయం సాధించారో, ప్రజలు ఆ స్వాతంత్ర్యాన్ని పునరుద్ధరిస్తారని తాను ఆశిస్తున్నట్లు విశ్వసిస్తున్నట్లు నిన్న విడుదల చేసిన ప్రకటనలో జయప్రకాశ్ నారాయణ్ తెలిపారు.

తాను ఎల్లప్పుడూ స్వాతంత్ర్య, ప్రజాస్వామ్య, సాంఘిక న్యాయపు విలువలకోసం నిలబడ్డాననీ, ఆ విలువలు అణచి వేయబడిన చోటల్లా తన వాణిని వ్యక్తం చేశాననీ, అందుచేత, బంగ్లాదేశ్‌లో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, లౌకిక విధానం పునరుద్ధరణ జరిగే పోరాటాన్ని తాను బలపరచి, తన సానుభూతి వ్యక్తం చేస్తాననీ తెలిపారు. నియంతృత్వం నుండి యిటీవల విముక్తి పొందిన భారత ప్రజలు బంగ్లాదేశ్ ప్రజాస్వామ్య సాధనకై జరిగే పోరాటానికి తమ సహకారం అందచేయగలరని తాను భావిస్తున్నట్లు చెప్పారు.

ఎన్నికల తర్వాత జర్నలిస్టులపై చర్యలకు రికార్డుల తయారీకై ఉత్తర్వు

షా కమిషన్ ముందు మాజీ సమాచార మంత్రి శుక్లా సాక్ష్యం

న్యూఢిల్లీ, అక్టోబర్ 28

పత్రికల ప్రవర్తనా నియమావళిని, అభ్యంతకర సమాచార ప్రచురణ చట్టాన్ని ఉల్లంఘించిన జర్నలిస్టులపై నిఘా వేసి, ఎన్నికల తర్వాత చర్యలు తీసుకోవాలని తాను ఉత్తర్వు చేసినట్లు మాజీ సమాచార ప్రసారశాఖా మంత్రి శ్రీ విద్యాచరణ్ శుక్లా నేడు షా కమిషన్ ముందు సాక్ష్యమిస్తూ ఒప్పుకున్నారు.

లోక్‌సభ ఎన్నికల తర్వాత కూడా 'లాంఛన ప్రాయమైన సెన్సార్‌షిప్'ను కొనసాగించుకోవడంలో ఉద్దేశం పత్రికలు తమ ప్రవర్తనా నియమావళిని, అభ్యంతరకర వార్తల ప్రచురణ నిరోధక చట్టాన్ని ["పోమా"] ఉల్లంఘించ రాదనేదేనని శ్రీ శుక్లా చెప్పారు.

ఈ ఏడాది జనవరి 19 సమావేశం తదనంతరం సమావేశాల మంత్రిత్వ శాఖలో మినిట్స్ న్యాయమూర్తి షా వద్ద ఉన్నాయి. ఈ లాంఛన ప్రాయమైన సెన్సార్ షిప్, పత్రికలపై నిఘా, 'తప్పు' చేసే జర్నలిస్టులను హెచ్చరించటం, సమాచార్‌లో విశ్వాస పాత్రులు కాని వారిపై చర్యలు తలపెట్టడం గురించి శ్రీ షా ప్రశ్నలడిగారు.

ప్రవర్తనా నియమావళి "చరిత్ర"ను శుక్లా వివరించారు. దీన్ని సంపాదకులూ, జర్నలిస్టుల సంఘాలూ స్థూలంగా అంగీకరించాయన్నారు. లోక్ సభ ఎన్నికల ప్రకటన తర్వాత సెన్సార్‌షిప్‌ను దూరంగా ఉంచగా నియమావళికి ఎవ్వరూ అభ్యంతరం తెలపలేదన్నారు.

ప్రశ్న : "లాంఛన ప్రాయమైన సెన్సార్‌షిప్" ఉండాలని, పొరపాటు చేసిన జర్నలిస్టులను నోటిమాటగా హెచ్చరిక యివ్వాలని ప్రధాన పత్రికా సలహాదారును మీరు ఆదేశించడంలో ఉద్దేశమేమిటి ?

శుక్లా: ఆ సమయంలో దేశంలో నిషిద్ధాలైన నియమావళి, 'పోమా' అంశాలను పాటించాలి. వీటిని ప్రధాన పత్రికా సలహాదారు నిఘా వేయాలి. నియమావళినుండి దారి తప్పినా, పోమాను ఉల్లంఘించినా దానిని సంపాదకుడి దృష్టికి తేవాలి.

"లాంఛనప్రాయమైన సెన్సార్ షిప్" అనేది నిర్దిష్టమైన పదం కాదు. దాన్ని జర్నలిస్టులు బాగా అర్థం చేసుకున్నారు.

ప్రశ్న : తప్పు చేసిన జర్నలిస్టులపై రిపోర్టు ఉండాలని, ఎన్నికలు ముగిసిన తర్వాత వారిపై చర్య తీసుకోవాలని నిర్ణయించడంలో అర్థమేమిటి?

శుక్లా : తీవ్రమైన ఉల్లంఘన ఏదైనా జరిగే పక్షంలో ఎన్నికల ప్రచారంలో కాక ఎన్నికల తర్వాత చర్య తీసుకోవచ్చునని ఆదేశమిచ్చాను.

ప్రశ్న: జర్నలిస్టులకు హెచ్చరిక లేమి చేశారన్న విషయంపై ప్రభుత్వం తరపున పత్రికాసలహాదారుగాని మరెవరైయినా రికార్డు తయారు చేయాలని కోరారా?

శుక్లా: అదిప్రత్యేకించి చెప్పాననుకోను. కానీ వారు రికార్డు వుంచాలి.

ప్రశ్న : అసలు రికార్డు తయారుచేసి

(మిగతా 5వ పేజీలో)

"బాబీ" ప్రదర్శనకు తానే ఉత్తర్వు ఇచ్చానని శ్రీ శుక్లా ఒప్పుకోలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 28

గత ఫిబ్రవరి 6వ తేదీన "వక్త"చలన చిత్రంస్థానే "బాబీ"ని టెలివిజన్‌లో ప్రసారం చేయవలసిందిగా తాను ఆదేశాలు యిచ్చినమాట వాస్తవమేనని రేడియో సమాచారశాఖ మాజీమంత్రి శ్రీ వి. సి. శుక్లా నేడు షా కమిషన్ ముందు అంగీకరించారు.

రాజధానిలో ప్రతిపక్షాల ఆధ్వర్యాన బ్రహ్మాండమయిన బహిరంగసభ జరిగిన రోజున "వక్త"కు బదులుగా 'బాబీ'ని టెలి

(మిగతా 5వ పేజీలో)

కిషోర్‌పాటలను నేనే నిషేధించాను

న్యూఢిల్లీ, అక్టోబరు 28

ఎమర్జెన్సీలో చలనచిత్ర నటుడు, గాయకుడు కిషోర్‌కుమార్ పాటలు రేడియోలో ప్రసారం కాకుండా నిషేధం విధించిన బాధ్యత పూర్తిగా తనదేనని సమాచారశాఖ మాజీ మంత్రి శ్రీ విద్యాచరణ్‌శుక్లా నేడు అంగీకరించారు.

ఈ చర్య బానిసకాలం నాటిదిగా కనిపిస్తున్నదని ఎమర్జెన్సీ అత్యాచారాలను విచారిస్తున్న న్యాయమూర్తి శ్రీషా అన్నారు.

"ఈ అంశం విచారకరమైనదేనని ఒప్పుకుంటూ" యీ చర్య తీసుకున్న పూర్తి బాధ్యత నాపై నేవున్నది. ఇందుకు ఏ అధికారిని నిందించ నవసరం లేదు." అని శ్రీ శుక్లా అన్నారు.

కిషోర్‌కుమార్‌పై చర్య శిక్షవిధింపు చర్యగా పేర్కొంటూ అత్యవసర పరిస్థితి కాలంలోకూడ యీ దేశంలో బానిసత్వం లేదని తెలుసునా అని సమాచార మంత్రిత్వ శాఖా కార్యదర్శి శ్రీ బర్నీని న్యాయమూర్తి శ్రీషా ప్రశ్నించారు.

ఈ చర్యనైతికంగా సరైనది కాదని శ్రీ బర్నీ అంగీకరించారు.

తర్వాత శ్రీ శుక్లా సాక్ష్యమిస్తున్నప్పుడు ఒక కళాకారుడికి, మొత్తంమీద సమాజంలోని ఒక భాగానికి ఎంత నష్టం చేశారో గుర్తించారా అని న్యాయమూర్తి ప్రశ్నించారు.

"ప్రజలను వత్తిడి చేసేందుకు సిద్ధంగా వున్న ప్రభుత్వం వున్నది. అధికార [illegible] అనుసరించనట్లయితే చట్టం అమలుపరచడానికి భిన్నంగా వ్యవహరించే ప్రభుత్వం వున్నది. ఇది బానిసత్వం మినహా మరొకటికాదు" అని శ్రీ షా వ్యాఖ్యానించారు.

ఇది తప్పుడుచర్య అని శ్రీ శుక్లా అంగీకరిస్తూ అందువల్లనే కిషోర్‌కుమార్‌పై తీసుకున్న అన్ని చర్యలను ఆ తర్వాత రద్దు చేయటం జరిగిందన్నారు.

ఈ చర్య వెనుక చట్టం తోడ్పాటులేదు. చలనచిత్రకళాకారులకు, రేడియో, టెలివిజన్ వంటి ప్రచార సాధనాల మధ్య సహకారం యిచ్చి పుచ్చుకునే ధోరణిలో వుండాలి. పెద్ద మనుషుల ఒప్పందం క్రింద యీ సహకారం కొనసాగుతున్నది అని శ్రీ శుక్లా తెలిపారు.

ప్రాథమికసహకారసంఘాల రుణాలపై వడ్డీ తగ్గింపు

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాదు, అక్టోబరు 28

వ్యవసాయాభివృద్ధి సహకార ప్రాథమిక సంఘాల ద్వారా రుణాలు పొందే వ్యవసాయ దారులకు 1.25 శాతం వడ్డీరేటు తగ్గింపు లభిస్తుంది.

నవంబరు 1వ తేదీనుండి అమలులో వుండే ఈ తగ్గింపు వడ్డీరేటు వల్ల స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకుకు నికర లాభంలో రు. 50 లక్షల మేరకు తగ్గిపోతుందని మేనేజింగ్ డైరెక్టర్ శ్రీయన్.కె. మురళీధరరావు వెల్లడించారు.

శ్రీ మురళీధరరావు పత్రికా గోష్టిలో మాట్లాడుతూ, వ్యవసాయ రుణాలపై సెంట్రల్ బ్యాంకుల నుండి వసూలు చేస్తున్న 8.25 శాతం వడ్డీనుండి 0.75 శాతం తాము తగ్గిస్తున్నామని, దీనివల్ల సెంట్రల్ బ్యాంకులు మరో 0.5 శాతం తగ్గించవచ్చని వివరించారు.

వ్యవసాయ దారునిపై వడ్డీల దొంతరలు

రిజర్వు బ్యాంకునుండి 7 శాతంవడ్డీపై స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకురుణంతీసుకుని, సెంట్రల్ బ్యాంకులకు ప్రస్తుతం 9 శాతం వడ్డీమీద రుణం ఇస్తున్నది. ఈ మొత్తాన్ని ప్రాథమిక సంఘాలు 11.75 శాతానికి పైన తీసుకుని వ్యవసాయ వినిమయదారునికి 13.25 శాతానికి అప్పు ఇస్తుంటాయి.

నవంబరు 1 నుండి పై మినహాయింపుల వల్ల వ్యవసాయదారునికి 12.25 శాతం మాత్రమే వుంటుందని ఆయన వివరించారు.

129 మంది సిబ్బందితో రు. 1.5 కోట్ల లాభం

కేవలం 129 మంది సిబ్బందితో ఈ ఏడాది స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకుకు రు. 1.5 కోట్ల నికరు లాభం వస్తుందని ఆయన తెలిపారు.

వ్యవసాయదారులకు మాత్రమే "[illegible]" నిస్తున్న ఈ బ్యాంకు తన కార్యకలాపాలు "సహకారరంగం పరిధిలోవుంటూనే" గ్రామీణ పరిశ్రమలకు, చేనేతరంగానికి, మత్స్య పారిశ్రామికాభివృద్ధికి, అవసరమయ్యే యంత్రాల కొనుగోలుకు అవసరమైన రుణాలను తనిఖీ పద్ధతిపై ఇవ్వాలని కొత్త బ్రాంచీలను తెరవాలని "వివాహం, విద్య, పెన్షన్ వంటి పథకాల" ద్వారా "డిపాజిట్"ల కూర్పు మొదలైన కార్యక్రమాల ద్వారా ఈ వడ్డీరేటు తగ్గింపువల్ల వచ్చే లోటును పూడ్చుకోవచ్చని శ్రీ మురళీధరరావు తెలిపారు.

ఈ విధంగా బ్యాంకు కార్యకలాపాల విస్తరణ జరుగుతున్నందున బ్యాంకు పేరును "ఆంధ్రప్రదేశ్ స్టేట్ అగ్రికల్చర్-ఇండస్ట్రియల్ ఫైనాన్సు బ్యాంకు"గా మార్చాలని తాను ప్రయత్నిస్తున్నా నన్నారు.

ఇందులో భాగంగా 8వ తేదీ విజయవాడ లోను, 15వ తేదీ అమలాపురంలోను, 20వ తేదీ ప్రాంతంలో విశాఖ, శ్రీకాకుళం జిల్లాలో పర్యటించి పలువురు ప్రముఖులను కలిసి చర్చిస్తామని ఆయన తెలిపారు.

రెండు ప్రాంతీయ కార్యాలయాలు

డిసెంబరు నెలలో విశాఖపట్నం, కాకినాడలలో రెండు ప్రాంతీయ కార్యాలయాలను నెలకొల్పుతున్నామని శ్రీ రావు తెలిపారు.

రానున్న సంవత్సరాంతంలో వ్యవసాయ రుణాలతో సమానంగా రు. 100 కోట్లు పరిశ్రమలకు రుణాలు ఇవ్వవచ్చన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

గ్రామీణ నిరుద్యోగ సమస్య నివారణకు స్వయం ఉపాధికల్పన అవకాశాల సృష్టికి ఇతర సంస్థల సహకారంతో సంప్రదించనున్నామని ఆయన తెలిపారు.

దీపావళి తరువాత షా కమిషన్ ఎదుట శ్రీమతి గాంధి హాజరు?

న్యూఢిల్లీ, అక్టోబరు 28

నవంబరు 10వ తేదీ దీపావళి పండుగ తర్వాత షా కమిషన్ ముందు హాజరు కావలసిందిగా మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధిని కోరవచ్చునని తెలుస్తున్నది.

నవంబరు 7, 8 తేదీలలో కమిషన్ ముందు హాజరుకావలసిందిగా కొంతకాలం క్రితం శ్రీమతిగాంధిని కోరడం జరిగింది. అయితే ఆ తేదీలలో రాజధానిలో వుండనని, అందుచేత వేరేతేదీలను నిర్ణయించాలని శ్రీమతి గాంధి కమిషన్‌ను కోరారు.

నూతన తేదీలపై ఒకటి రెండురోజులలో కమిషన్ నిర్ణయం తీసుకోవచ్చునని తెలుస్తున్నది. నవంబరు మొదటి వారం తరువాత కొద్దిరోజులపాటు విచారణను వాయిదా వేయాలని కమిషన్ భావిస్తున్నది.

గోధుమల రవాణా ప్రారంభం

బొంబాయి, అక్టోబరు 28

సోవియట్ నుండి భారత దేశం అప్పుగా తీసుకొన్న గోధుమలు తిరిగి పంపడం ప్రారంభమయ్యింది.

నేడు బొంబాయి రేవునుండి మొదటి సారిగా "వి. శెలివనోవ్స్కీ" నౌకలో 13 వేలటన్నుల గోధుమలు పంపబడ్డాయి.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

సంచార పుస్తక ప్రదర్శన

విశాఖ – శ్రీకాకుళం జిల్లాల కార్యక్రమం

2-11-77 పాయకరావుపేట
3-11-77 నక్కపల్లి, రాయవరం
4-11-77 యలమంచిలి, మాకవారపాలెం
5-11-77 నర్సీపట్నం
6-11-77 కొయ్యూరు, కృష్ణదేవిపేట
7-11-77 పెద్దవలస
8-11-77 చింతపల్లి, సీలేరు
9-11-77 డొంకరాయి, మోతుగూడెం
10-11-77 మాడుగుల, చోడవరం
11-11-77 అనకాపల్లి
12-11-77 విశాఖపట్నం
13-11-77 గోపాలపట్నం, సింహాచలం
14-11-77 కొత్తవలస, శృంగవరపుకోట
15-11-77 విజయనగరం
16-11-77 గజపతినగరం
17-11-77 శ్రీకాకుళం
18-11-77 శ్రీహర్షం, కళింగపట్నం
19-11-77 కోటబొమ్మాళి
20-11-77 నర్సన్నపేట
21-11-77 టెక్కలి
22-11-77 కాశీబుగ్గ
23-11-77 పలాస
24-11-77 మందస
25-11-77 బారువ
26-11-77 సోంపేట
27-11-77 ఇచ్ఛాపురం
28-11-77 ఆముదాలవలస
29-11-77 హిరమండలం, పిరసట్టం
30-11-77 పాలకొండ
1-12-77 పార్వతీపురం ఏరియా
2-12-77 బొబ్బిలి
3-12-77 రామచంద్రపురం, సాలూరు
4-12-77 రాజాం, గిరిడిడి
5-12-77 చీపురుపల్లి
6-12-77 శ్రీరామ్‌నగర్, నెల్లిమర్ల
7-12-77 భోగాపురం
8-12-77 తగరపువలస
9-12-77 భీమునిపట్నం

పై ప్రాంతాలలో పార్టీ కార్యకర్తలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని మన సాహిత్యం ఎక్కువగా విడుదల చేయటానికి కృషి చేయగోర్తాము.

విశాలాంధ్ర

1977 అక్టోబరు 29 శనివారం

మందుల పరిశ్రమలో ప్రభుత్వరంగ పాత్ర

మందుల పరిశ్రమలో ప్రభుత్వరంగానికి నాయకత్వ పాత్ర యిస్తామని పెట్రోలియం రసాయనాలమంత్రిత్వశాఖ పార్లమెంటరీ సలహా సంప్రదింపుల కమిటీ సమావేశంలో ప్రసంగిస్తూ కేంద్ర మంత్రి శ్రీ బహుగుణ మొన్న అన్నారు నానాటికీ పెరుగుతున్న ప్రజల అవసరాలను తీర్చేనిమిత్తం హేతుబద్ధమైన ధరలకు అధికంగా మందులు పంపిణీఅయ్యేలా చూడాలని ప్రభుత్వం భావిస్తున్నదని ఆయన అన్నారు.

30 సంవత్సరాలు పరిపాలన వెలగబెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం యిలాగేచెప్పింది అయితే చేసిందిమాత్రం శూన్యం అదే జరిగితే అత్యధిక సంఖ్యాక ప్రజలు రోగాలతో రొప్పులతో తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడదు కనీసం ఉపశమనానికైనా మందులు దొరకక నానా అవస్థలు పడక పోయేవారు మందుల పరిశ్రమలలో పాతుకు పోయిన బహుళజాతి కార్పొరేషన్ల స్వదేశీ ప్రయివేటు రంగం యజమానుల వత్తిళ్ళకు లొంగి ప్రభుత్వ రంగాన్ని యీ విషయంలో ఏ మాత్రం విస్తరించక పోయినందువల్లనే యీ విపత్కర పరిస్థితులు ఏర్పడుతున్నాయి

ఈ బహుళజాతి కంపెనీలు స్వదేశీ ప్రయివేటు పరిశ్రమాధిపతులు కేవలంస్వలాభార్జన అన్న దుష్టబుద్ధితో సామాన్య మానవులు లేదా ఆర్థికంగా వెనుకబడినవారు బలహీనవర్గాలు అధికంగా ఉపయోగించే మందులను, ఔషధాలను తయారు చేయడంలేదు, ఏదో పట్టణ ప్రాంతాలలోనివారు, సంపన్నుల ఆయురారోగ్యాలను దృష్టిలో పెట్టుకొని అధిక ధరలు పలికే మందులను, ఔషధాలను తయారు చేస్తున్నారేగాని అంతరాల దొంతరలున్న యీ పెట్టుబడిదారీ సమాజంలో అట్టడుగున పడివున్న వారి సంక్షేమం తమకేమీ పట్టదన్న పద్ధతులల్లో వ్యవహరిస్తున్నారు.

ఆధునికమయిన మందులలో కేవలం 25 శాతం కూడా గ్రామీణ ప్రాంతం వారికి దక్కడంలేదు. అటు ఉత్పత్తిలోనూ ఇటు పంపిణీలోనూ పల్లెవాసులు ఘోరమైన వివక్షతకు గురిచేయబడుతున్నారు. భారత దేశంలో సగటునసంవత్సరానికి ఒక్కొక్కరికి ఆరురూపాయల విలువగల ఆధునిక మందులు మాత్రమే లభిస్తున్నాయి. ప్రతి సంవత్సరం 400 కోట్ల రూపాయల ఆధునిక మందులు ఉత్పత్తి అవుతున్నాయి కానీ యివి సమాజంలోని బలహీనవర్గాలకు, గ్రామీణ ప్రాంతాలకు చేరడంలేదు ఉత్పత్తి మరీ తక్కువగావుండి, అయినఉత్పత్తిలో ఏమాత్రం యీ క్రింది వర్గాలకు చేరడం లేదంటే మన "సంక్షేమరాజ్యం" సంగతి స్పష్టంగా బోధపడగలదు

ప్రభుత్వ రంగంలోవున్న ఐ. డి. పి. యల్ హిందుస్తాన్ అంటీబైటిక్స్ లిమిటెడ్ వంటి రెండు ప్రధాన ఫ్యాక్టరీలు యాంటీబైటిక్స్ సింథటిక్ మందులు ఔషదాలవంటి అధికంగా ఉపయోగించబడే అత్యవసర మందులను ఉత్పత్తి చేస్తూనా మొత్తం ఉత్పత్తి జరిగే మందుల్లో యివి చాలా స్వల్పంగా వుంటున్నాయి.

ఈ బాధాకరమైన పరిస్థితిని నివారించాలన్న ఉద్దేశంతోనే 1975 ఏప్రిల్‌లో సమర్పించిన తన నివేదికలో హాథీ కమిటీ అనేక సిఫార్సులు చేసింది

బహుళజాతి కార్పొరేషన్ల దోపిడీని నివారించడానికి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తెలిపింది. పద్ధతి ప్రకారం ప్రపంచ ప్రజల రోగాలు, రొప్పుల మీద లాభాలు తీసి కోట్లు కూడబెట్టే యీ బహుళజాతి కార్పొరేషన్లు భారత దేశంలో వుండడం మనకు ఏమాత్రం "ఆరోగ్యం కాదని" స్పష్టీకరించింది. అత్యవసర మందులను అధికంగా ఉత్పత్తిచేసి పంపిణీ చేయడానికి అధికతర ప్రాముఖ్యతను యివ్వాలని తెలిపింది. జాతీయ మందుల విధానాన్ని రూపొందించడంలో విదేశీ, స్వదేశీ కంపెనీలు ఎలా శిఖండుల్లా అడ్డుపడుతున్నాయో తెలిపింది అలాగే మందుల కల్తీ దొంగ వ్యాపారం వగైరా దుర్మార్గాలకు అడ్డు లేకుండా పోతున్నది అందువల్ల మందుల పరిశ్రమలో బహుళజాతి కంపెనీల స్వాధీనంతోపాటు సమగ్రమైన చర్యలు తీసుకొన్ననాడే దేశ ప్రయోజనం నెరవేరగలదు

అనేక పరిశ్రమలలో బహుళజాతి కార్పొరేషనకు ద్వారాలు తెరచి, సాదర సత్కారాలతో ఆహ్వానించే జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం హాథీ కమిటీ సిఫార్సుల అమలుకు పూనుకొంటుందా ? విదేశీ దోపిడీని అరికడుతుందా ? వేచి చూడాలిమరి.

సింహంతో విందు

బొంబాయి అక్టోబరు 28

మీ సింహంతో విందు ఆరగిస్తారా ? లేక పెద్దపులిని, ఏనుగును, నీటి గుర్రాన్ని ఖడ్గమృగాన్ని, చింపాంజీని లేదా అనేక జంతువులు, పాములు, పక్షులు వీటిలో దేన్నైనా ఎంపిక చేసుకుంటారా?

ఈ ఆలోచన మీకు కష్టంఅనిపిస్తే, "జంతువుల భోజన పద్ధతులను" చూడటం మీకు యిష్టం లేదని చెప్పడం మంచిది

మీరు చెయ్యవలసిందల్లా భోజనంబిల్లు చెల్లిస్తేచాలు.

వీరమాత జిజాబాయ్ జూలాజికల్ గార్డెన్స్‌లో జంతువులకు తిండి పెట్టడంలో సహాయపడటం ద్వారా, జంతువులపట్ల ప్రేమను పెంపొందింప చేసేందుకే, బొంబాయి మున్సిపల్ కమిషనర్ శ్రీ బి. జి. దేశ్‌ముఖ్ 'సింహాన్ని ఎందుకు తీసుకువెళ్ళే' పాలిసెట్టు ప్రారంభించారు

రు 40/- లతో మీరు సింహాన్ని, పెద్ద పులికి రు 50/ లు, ఏనుగుకు రు. 60/ లు, నీటిగుర్రానికి రు 35/ లు ఖడ్గమృగానికి రు 45/- లు, చింపాంజీకి రు. 10/ లు మాత్రమే చెల్లించి, వాటికి తిండి ఏర్పాటు చెయ్యవచ్చును.

మీరు ఇష్టపడితే రు 65 లు చెల్లించి చుక్కలతో కూడిన 25 లేళ్ళ మందకు తిండి ఏర్పాటు చేయవచ్చును.

పై జంతువులలో ఏదో ఒక జంతువుకు సంవత్సరంలో ఒకసారి తిండి పెట్టేందుకు మీరు సహాయ పడితే, పెంపుడు తండ్రిగా పిలిపించుకుని గౌరవం మీకు లభిస్తుంది. మీకు ఆ జంతువువద్దో జూ అధికారుల ప్రశంసాపత్రాలు బహూకరింపబడతాయి.

ఇటువంటి పథకాలు అమెరికాలో విజయవంతంగా నిర్వహింపబడుతున్నాయని జిజాబాయ్ జూ జాకిర్ పార్క్ సూపరింటెండెంట్ శ్రీ జె సి గర్గేప్ తెలియజేశారు.

భటిండాలో కమ్యూనిస్టుపార్టీ 11 వ మహాసభ - మార్చి 31-ఏప్రిల్ 7

జలంధర్, అక్టోబర్ 28

భారత కమ్యూనిస్టుపార్టీ 11 వ మహాసభ మార్చి 31 నుండి ఏప్రిల్ 7 వరకూ భటిండా (పంజాబ్) లో జరగనున్నది

పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు 23 వ తేదీన ఇక్కడివిలేకరుల గోష్ఠిలో ఈ విషయం తెలిపారు మహాసభ సన్నాహాలకై ఆయన పంజాబ్ అంతటా పర్యటిస్తున్నారు

మన శ్రామిక ప్రజానీకం ఎదుర్కొంటున్న తక్షణ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస జనతా పార్టీలు విఫలమయ్యాయి ఈ రెంటిలో ఏ పార్టీ మన దేశాన్ని ముందుకు తీసుకుపోలేదు" అని శ్రీరాజేశ్వరరావు విలేకరులతో అన్నారు అమెరికా తరహా రెండు పార్టీల వ్యవస్థ కోసం అభివృద్ధి నిరోధకులు సాగిస్తున్నప్రచారాన్ని ఆయన నిరసించారు

విచ్ఛిన్నకరమయిన పెట్టుబడిదారీ పాలన సాగించటమే ఈ ప్రచార లక్ష్యమని చెప్పారు

విభిన్న భాషలు, సంస్కృతులు, విభిన్న స్థాయి ఉన్న అభివృద్ధిగల భారతదేశంలో ఆ రకం వ్యవస్థ పని చేయదు కనుక ప్రత్యామ్నాయం అన్ని వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల విస్తృత సంఘటన. అదే మన ప్రజ లెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించగలదు. ఆదేశాన్ని ముందుకు తీసుకపోగలదుఅని,శ్రీరాజేశ్వరరావు స్పష్టం చేశారు ఇలాంటి సంఘటనలను నిర్మించడంలోనూ, వారి ఎన్నికల హామీలను అమలు చేయడంలోనూ కేరళ ఐక్య సంఘటన ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ వామపక్ష సంఘటన ప్రభుత్వం కీలక పాత్ర వహించగలవని వివరించారు

విభేదాలెక్కడ

ఈ సమస్యపై కమ్యూనిస్టుపార్టీ మార్క్సిస్టుపార్టీల మధ్య విభేదమెక్కడ అని విలేకరులు ప్రశ్నించగా జనతాపార్టీతో సహకారం కొనసాగిస్తామని మార్క్సిస్టు పార్టీ పట్టు పడుతోందని, అదే సమయంలో కేరళ ఐక్య సంఘటన ప్రభుత్వాన్ని కమ్యూనిస్టుపార్టీ విచ్ఛిన్నం చేయాలని కోరుతోందని ఆయన సమాధానమిచ్చారు.

జనతా భిన్నత్వం

జనతా విధానాల గురించి ఇలాచెప్పారు :

ఆర్థిక విధానాలపై జనతాపార్టీలో తీవ్ర విభేదాలున్నాయి గత 30 ఏళ్ళుగా దేశం సాధించిన విజయాలను చంద్రశేఖర్, జగ్జీవన్‌రామ్, బహుగుణ వంటి నాయకులు అంగీకరిస్తున్నారు. ఎలాంటి అభివృద్ధి జరగలేదని చరణ్‌సింగ్ వంటివారు అంటున్నారు. నెహ్రూను తూలనాడుతున్నారు ఇంతవరకూ ఒక ఆర్థిక విధానం ప్రకటించడంలో జనతా పార్టీ విఫలమయింది. అయితే కొంత మంది మంత్రులు మాత్రం ఇప్పటికే బహుళజాతి కంపెనీలను భుజాన వేసుకున్నారు

కాంగ్రెస్ కల్లోలం

కాంగ్రెస్‌లో తీవ్రమవుతున్నపోరాటం గురించి విలేకరులు ప్రశ్నించగా ,

శ్రీమతి గాంధీ తన పాలన చివరికాలంలో అనుసరించిన విధానాలు ఎంతో హాని కలిగించాయి. అవి కాంగ్రెసుకే కీడు చేశాయి ఆమె ఇంకా అవే విధానాలను పట్టుకువేళ్ళాడుతోంది ఇది దేశానికీ ఆమె పార్టీకి కూడా మరింత నష్టం తెచ్చిపెడుతుంది అన్నారు ఆమె మళ్ళీ అధికారంలోకొస్తుందా ? అని ప్రశ్నించగా అలాంటి విధానాలు గల ఆమెకు ప్రజలు ఓట్లు వేసి అధికారం కట్టబెడతారను కోనన్నారు

కాంగ్రెసు నిర్మాణ వ్యవహారాలకు సంబంధించి తర్కంలోకి దిగేందుకు శ్రీ రాజేశ్వరరావు నిరాకరించారు కాంగ్రెసువాదులు ఏమి చేయాలన్న విషయమై సలహాలిచ్చే ధోరణికి దిగబోనని చెప్పారు. కాంగ్రెసు అంతరంగిక వ్యవహారాలలో కమ్యూనిస్టు పార్టీ జోక్యం చేసుకోబోదన్నారు ఇందిరా గాంధీ గానీ, మరెవ్వరైనా తప్పుడు విధానాలు అనుసరిస్తుంటే విమర్శలను కొనసాగిస్తుందన్నారు

"ప్రజాతంత్రవాది అంటే మీ నిర్వచన మేమిటి?" అని విలేకరులు ప్రశ్నించగా "సామ్రాజ్యవాద వ్యతిరేక, గుత్తపెట్టుబడిదారీ వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక వైఖరి తీసుకునేవారిని" ప్రజాతంత్రవాదులంటామని వివరించారు.

ఐక్యతకు కృషి

వివిధ ప్రజాసంఘాల సమిష్టి ప్రజాకార్యాచరణకై సంప్రదింపులు సాగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఇటీవలనే రెండు రైతు సంఘాల నాయకులూ సమావేశమై చర్చించారు. రానున్నరోజుల్లో వీరు మళ్లీ సమావేశమవుతారు. ఎ. ఐ. టి. యు. సి., సి. ఐ. టి. యు., ఐ. ఎన్. టి. యు. సి. చివరికి జనతాఅనుకూల ట్రేడ్‌యూనియన్లు కూడా సమిష్టి కార్యాచరణ సాగించాయన్నారు. అలాగే జనతా విద్యార్థి సంఘంతో సహా వివిధ విద్యార్థి సంఘాలు సమైక్యంగా అనేకచోట్ల పోరాడాయని చెప్పారు,

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన అభివృద్ధిచెందగలదని ఆశిస్తున్నారా అని ప్రశ్నించగా ఆయన ఎంతో ఉత్సాహంగా అవు నన్నారు.

1500 మంది ప్రతినిధులు

శ్రీ రాజేశ్వరరావు పత్రికల వారి కిచ్చిన లిఖిత పూర్వక ప్రకటన ఇలా వుంది :

పార్టీ 11 వ మహాసభను పంజాబ్‌లో జరపాలని పంజాబ్ శాఖ చిరకాలంగా అందిస్తున్న ఆహ్వానాన్ని పార్టీ జాతీయ సమితి అంగీకరించింది

మహాసభకు 5 లక్షల 46 వేల 732 మంది సభ్యుల ప్రాతినిధ్యం వహించే 1500 మంది ప్రతినిధులూ ప్రత్యామ్నాయ ప్రతినిధులూ హాజరవుతారు అంటే గత సంవత్సరం కంటే 8 వేల సభ్యత్వం పెరిగింది విజయవాడలో జరిగిన పదవ మహాసభ (355 526 కంటె ఇది 40 శాతంపెరుగుదల, పంజాబ్‌శాఖ సభ్యత్వం గత ఏడాది 18వేలుండగా ఈ సంవత్సరం 21 650కి పెరిగింది. మూడేళ్ళ క్రితం ఆ సభ్యత్వం 13వేలుండేది

నాగాలాండ్, మిజోరం, అరుణాచల ప్రదేశ్‌లనుండి తప్ప మిగతాఅన్నిరాష్ట్రాల నుండి పార్టీశాఖలు మహా సభకు ప్రతినిధులను ఎన్నుకుంటాయి పైప్రదేశ ప్రాంతాలలో మాత్రం పార్టీశాఖలు లేవు. సోషలిస్టు దేశాలతో సహా అనేక దేశాల కమ్యూనిస్టుపార్టీల నుండి సోదర ప్రతినిధులు ఎప్పటిలాగే హాజరవుతారు.

లక్ష్య నిర్వచనం

గత మూడేళ్ళ పరిణామాలు, పార్టీ రాజకీయ పంథా కార్యకలాపాలు, సాధించిన విజయాలూ, చేసిన పొరపాట్లను మహాసభ సమీక్షిస్తుంది, పార్టీనిర్మాణందానిబలిమిని కూడా సమీక్షించి దాన్ని మెరుగుపరచి, సంఘటితం చేసే చర్యలను నిర్ణయిస్తుంది. భవిష్యత్ కార్యాచరణనూ, ముఖ్యంగా సమిష్టి రాజకీయవేదిక ప్రాతిపదికగా అన్ని వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను నిర్మించడమెలా? ఈ సంఘటనను జాతీ జీవనంలో నిర్మాణాత్మక శక్తిగా చేయడమెలా? అన్న అంశాలను రూపొందిస్తుంది.

మన ప్రజలకున్న ప్రజాతంత్రహక్కులు కీలక ప్రయోజనాల రక్షణకై సాగే కార్యాచరణ జరపటిని, ముందుండి సాగించటం పైనా. ఈ లక్ష్యంకై ప్రజాతంత్ర జన శ్రేణుల విస్తృత ఐక్యతను కార్యాచరణలో సాధించటంపైన మాపార్టీ ప్రస్తుతం కేంద్రీకరిస్తోంది, గతకొద్దివారాల్లోనే బ్రహ్మాండమైన ప్రదర్శనలు, బహిరంగ సభలు, మహాసభలు జరిగాయి. ముఖ్యంగా అధిక ధరలకు వ్యతిరేకంగా, హరిజనుల గ్రామీణ పేదల హక్కుల రక్షణకు, బోనస్ తదితర రక్షణ డిమాండ్లపై కార్మిక వర్గం సమ్మె కార్యాచరణలు సాగాయి,

సజీవంగా,సమరశీలంగా

పాట్నాలో మున్నెన్నడూ లేనంతగా 5 లక్షల మంది ప్రదర్శన జరిపారు, కలకత్తాలో 50 వేల మంది ప్రదర్శన చేశారు, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలలో పెద్దఎత్తున ప్రజాకార్యాచరణలు జరిగాయి. వీటిలో గణనీయమైన విజయాలు సాధించాం. "ఇక కమ్యూనిస్టు పార్టీ పనిఅయిపోయింది" అనే దుష్ప్రచారం తుత్తునియలయింది. కమ్యూనిస్టుపార్టీ ఇక క్షణంలో క్షీణిస్తుంది" అనే ప్రచారం బద్దలయింది ప్రజలు చూస్తూనే ఉన్నారు, కమ్యూనిస్టుపార్టీసజీవంగా, సమరశీలంగా ఎప్పటిలాగే పోరాటం సాగిస్తూనే వుంది

ఇప్పుడు ముందుకు పోవటం అవసరం కమ్యూనిస్టులు మార్క్సిస్టులు, నక్సలైట్లు ఇతర వామ పక్ష పార్టీలు కాంగ్రెసులోని ప్రజాతంత్ర వాదులు, జనతాలోని ప్రజాతంత్ర వాదులు, ఇతర ప్రజాతంత్ర ప్రాంతీయ పార్టీలు, ఒక కొత్త రాజకీయ సఖ్యతనేర్పాటు చేసినపుడు వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం ఆవిర్భవిస్తుంది రెండు పార్టీల వ్యవస్థ ప్రచారకుల ఎత్తుగడలు పటాపంచలవుతాయి

భారతదేశంలో పెట్టుబడిదారీ విధానానికి మళ్ళీ జీవం పోసి ప్రాణప్రతిష్ఠ చేయడానికి ఈరెండుపార్టీల వ్యవస్థ వినియోగిస్తున్నారు భారత్‌లో పేదరికం నిరుద్యోగం, నిరక్షరాస్యత, అసమానతలు తొలగించి అధునాతన పరిశ్రమలు,వ్యవసాయంగలదేశంగా రూపొందించాలంటే సోషలిజమే మార్గమని మా విశ్వాసం

ఐక్య కమ్యూనిస్టు ఉద్యమ కీలకపాత్ర

పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాను అనుసరించే జనతాపార్టీగానీ, కాంగ్రెసు పార్టీగానీ, మన దేశానికొక పంథాను, దిశను కల్పించలేవని అనుభవం నిరూపించింది. ఐక్య కమ్యూనిస్టు ఉద్యమం కీలక పాత్ర వహించే విస్తృత వామపక్ష ప్రజాతంత్ర సమైక్య సంఘటన మాత్రమే అలాని చేయగలదు, కేరళ ఐక్య సంఘటన ప్రభుత్వము, బెంగాల్ వామపక్ష సంఘటన ప్రభుత్వము తమ ఎన్నికల హామీల అమలుకు సాధ్యమయినంత చేస్తే ప్రజల విశ్వాసం పెంపొందుతుంది, ఈ ప్రభుత్వాలలో ప్రాతినిధ్యం గలవారితో సహా సకల ప్రజాతంత్ర శక్తుల సహకారం పొందితే ఈ విషయంలో తోడ్పడగలవు.

పై లక్ష్యాల సాధనకు శక్తివంతమైన ఉద్యమం నిర్మించే సమస్యలపై మా పార్టీ 11 వ మహాసభ కేంద్రీకరిస్తుంది. దీని వలన మన రాజకీయ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని రక్షించి, సంఘటితం చేసి ప్రజా స్వామ్యాన్ని కాపాడి, మరింత విస్తరించి సోషలిజానికి పురోగమించేందుకు బాటలు వేయవచ్చు.

పంజాబ్ ప్రజలకు పిలుపు

దేశ సేవలోనూ పీడితుల సముద్ధరణలోనూ ఉజ్వల సాంప్రదాయాలు గల సాహసోపేతమైన, దేశభక్తియుత పంజాబ్ ప్రజానీకానికి ఇదే నా విజ్ఞప్తి. దేశ సరిహద్దుల రక్షణకై అంతులేని త్యాగాలు చేసి, తరతరాలుగా ప్రగతిశీల లక్ష్యాల కోసం పోరాడిన మీరు కమ్యూనిస్టుపార్టీ 11 వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతున్నాను.

లేఖలు

ఇళ్ళస్థలాల పేరుతో దేవస్థానం కౌలుదార్ల గెంటివేత సమర్థనీయం కాదు!

మహాశయా!

తూర్పుగోదావరిజిల్లా రాజోలుతాలూకాలో యిళ్ళ స్థలాల మంజూరుకై పలు గ్రామాలలో దేవస్థానాలకు చెందిన భూములు సేకరించుతున్నట్లు తెలుస్తున్నది ఈ భూములు చాలావరకు మాగాణికి చెందిన పల్లపు భూములు.

మెరక భూములు (కొబ్బరితోటలు, తదితరాలు) మంజూరుచేసే భూస్వాములకు యిబ్బంది, సేకరణకు అధిక వ్యయం అవుతుందనే ఉద్దేశంతో దేవుని భూములు స్వాధీనం చేసుకొంటున్నట్లు బోధపడుతున్నది.

ఈ పద్ధతివల్ల సంవత్సరాల తరబడి దేవాదాయ భూములు కౌలు చేస్తున్న సాగుదార్ల జీవనాధారం పోతుంది. ప్రభుత్వం ఆదాయం పోతుంది. పైగా వాటిలో మంచినీటి సౌకర్యంకూడా సాధ్యంకాదు.

ఒకప్రక్క ప్రభుత్వందేవస్థానం భూములపై వాటి సాగుదార్లయిన కౌలుదార్లకు యాజమాన్యపుహక్కులు కలిగిస్తామని చెబుతున్న తరుణంలో ఈచర్య తమకు మరింత అన్యాయం చేయటమేగాక, ప్రభుత్వ విధానానికే విరుద్ధమని కౌలురైతులు అభిప్రాయపడుతున్నారు.

ఉదాహరణకు అంతర్వేదిపాలెంకుచెందిన 60 ఎకరాల 54 సెంట్లభూమిని నివేశనస్థలాలకై ప్రభుత్వం తీసుకోనున్నట్లు తెలిసి సాగుదార్లయిన కౌలురైతులు తమ జీవనాధారం పోతుందని భయపడుతూ, సుమారు నూరు సంవత్సరాలనుండి సేద్యంచేస్తూ దేవస్థానానికి ఏ విధమైన బకాయిలు లేకుండా శిస్తులు చెల్లించుచున్న తమకు న్యాయం కలిగించాలని కోరుతూ ముఖ్యమంత్రికి, జిల్లా కలెక్టరుకు డి.ఆర్.ఓ. కు, తదితరులకు మహజర్లు పంపుకున్నారు.

కనుక ఇళ్ళస్థలాల పేరుతో పేద సాగుదార్లను, యితర పేదలకు మధ్య తగవులు, కలతలు రెచ్చగొట్టేందుకే ప్రభుత్వం తలపెట్టిన ఈ చర్య తోడ్పడుతోంది. భూస్వాముల భూములను, మెరక భూములను ఇది వరకు పేదలు దరఖాస్తు చేసిన భూములను వదిలి అధికార్లు అవలంబిస్తున్న ఈ పద్ధతి యిళ్ళస్థలాల సమస్యను పరిష్కరించడం ఎలా వున్నా పేద వర్గాల్లో అనైక్యతకే దారితీస్తుంది.

మరో విషయమేమంటే గ్రామమంతటికీ ఒకచోట లేదా రెండు మూడుచోట్ల యిళ్ళస్థలాలు మంజూరు చేయాలనే పేరుతో చేస్తున్న ఈ పని యిబ్బందులు, అసౌకర్యం కలిగించేందుకే దోహదం చేస్తుంది.

8 లేక 10 కిలోమీటర్ల పొడవుగల అంతర్వేది పాలెం లాంటి గ్రామాలలో ప్రస్తుతం వారుంటున్న ప్రాంతాలనుండి, మరొక ప్రాంతానికి తరలించబడి నివాసం సాగించటం వారి వృత్తికి అనుగుణంగా లేక బాధపడవలసి వస్తుంది, ఇంత క్రితం పనిచేస్తున్న పొలాల రైతులతో వున్న అనుబంధం, అవకాశాలు, స్థితిగతులకు యిబ్బంది రావచ్చు.

ప్రభుత్వ యీసాధక బాధకాలన్నింటినీ పరిష్కరించాల్సి వుంది, ఏది ఏమైనా పేద సాగుదార్లను భూముల నుండి వెళ్ళగొట్టి వారికి జీవనాధారం లేకుండా చేసే చర్య ఏ పేరుతో చేసినా సమర్థనీయం కాదు,

ఇట్లు
ఓగూరి విజయకుమార్
రాజోలు

గ్రామీణ వైద్యశాలల దుస్థితి

మహాశయా !

ప్రకాశం జిల్లాలో పంచాయతీ సమితుల యాజమాన్యంలో 64 గ్రామీణ వైద్యశాలలు వున్నవి. ఇందులో 17 డిస్పెన్సరీలలో డాక్టర్లు లేరు. కొన్ని డిస్పెన్సరీలలో సంవత్సరం నుండి డాక్టరు లేరు.

ప్రతి డిస్పెన్సరీ దాదాపు 20 వేలమంది ప్రజలకు వైద్య సౌకర్యాలను కల్పించవలసి వుంది అయితే ఈ డిస్పెన్సరీలకు సంవత్సరానికి రు. 2 వేల విలువగల మందులు మాత్రమే సరఫరా చేయబడతాయి. సిబ్బంది సక్రమంగా నియమించరు. ఉదాహరణకు పెదపవనిడిస్పెన్సరీలో 1976 జూలైలో పదవి విరమణచేసిన మెటర్నిటి అసిస్టెంట్ స్థానంలో ఇంతవరకు ఎవరిని నియమించ లేదు.

ఈ డిస్పెన్సరీలలో పనిచేసే డాక్టర్లకు నెలకు రు 200 లు, మెటర్నిటి అసిస్టెంటుకు రు. 120 లు ఇవ్వటం జరుగుతోంది. వీరి క్రింద పనిచేసే వర్కర్లకు మాత్రం రు. 202.50 పైసలు ఇవ్వటం జరుగుతున్నది

పట్టభద్రులైన వైద్యులు గ్రామీణ ప్రాంతాలకు పోవటం లేదని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నది. సరైన వేతనాలు, మందులు ఇచ్చినచో పల్లెలకు వెళ్ళేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా వున్నారు.

ప్రతి డిస్పెన్సరీని గ్రామీణ వైద్య, ఆరోగ్య కేంద్రంగా మార్చి సంవత్సరానికి 10 వేల విలువ గల మందులు, డాక్టర్లకు సరైన వేతనాలు ఇచ్చి గ్రామీణ ప్రజలకు వైద్య సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఇట్లు
జి. నరసింగరావు
పెదపవని

15 వేల టన్నుల వరిపంట దెబ్బతినే ప్రమాదం : తిమ్మాపురం ఫిర్కా గ్రామాల్లో తెగుళ్ళు

తిమ్మాపురం, అక్టోబర్ 26

కాకినాడ తాలూకా తిమ్మాపురం ఫిర్కా గ్రామాలలో కంకి నలిగే తెగులు, దోమ తెగులు కారణంగా 15వేల టన్నుల వరి పంట దెబ్బతినే ప్రమాదమే ఏర్పడింది.

ఈ గ్రామంలో సుమారు 12వేల ఎకరాల మాగాణివుంది. ఇవికాల్వచివరిభూములు కావటం వలన ఆగస్టు నెలలో నాట్లు పడ్డాయి ఇందులో యీ సంవత్సరం 2/3 వంతులు పొట్ట వరి పంటలు, ముఖ్యంగా పట్టుణ సన్నపంట వేశారు. ఈ నెల 15నుండి పూర్తి ప్రారంభమైన దశలో 15 రోజులుగా వర్షాలు లేక, పై తెగుళ్ళు సోకాయి

ఎకరానికి రు 800 పెట్టుబడిపెట్టి పంటం కోసం రైతాంగం ఎదురు చూస్తున్న సమయంలో రోగ నిరోధక మందువేయాల్సి వచ్చింది

అయితే ఏ మందు దేనికి వాడాలో తెలియని నిస్సహాయ స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

కనుక ప్రభుత్వ వ్యవసాయ అధికారులు తక్షణం తగిన చర్య తీసుకొని సుమారు 15 వేల టన్నుల పంటను కాపాడాల్సింది గాను అందుకు అవసరమైన క్రిమిసంహారక మందులను సబ్సిడీ ధరకు సప్లయి చేయాల్సిందిగాను రైతు సంఘాధ్యక్షులు శ్రీఅల్లూరి వెంకటరామరాజు ఒక ప్రకటనలో కోరారు

వరరామచంద్రపురం బ్లాకు అంతటా దుర్భిక్ష పరిస్థితి

భద్రాచలం, అక్టోబరు 26

భద్రాచలం తాలూకా వర రామచంద్రపురం బ్లాకులో దాదాపు అన్ని గ్రామాల్లో పంటలు ఎండిపోయి, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వరి, సామున్ని కొండపోన్న, పెద కొండపోన్న పంటలు పూర్తిగాపోయాయి. ఏ గ్రామంలోనూ పనులులేక పస్తులుండే పరిస్థితి ఏర్పడింది.

కనుక వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని, పనులు కల్పించాలని భద్రాచలం వ్యవసాయ కార్మికసంఘ అధ్యక్షులు శ్రీ కారం తమ్మయ్య ఒక ప్రకటనలో కోరారు.

మైలవరం సమితిని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

మైలవరం, అక్టోబరు 27

విజయవాడ తాలూకా మైలవరం సమితి అంతా మెట్టప్రాంతమైయుండి, యీసంవత్సరం వర్షాభావంవల్ల మెట్టపైరు పునాస పంట పూర్తిగా దెబ్బతిన్నది.

చెరువుల క్రింద అసలునాట్లుపడలేదు,నాట్లు వేసిన పొలాలుకూడా, తర్వాత వర్షాలు లేక పూర్తిగా ఎండిపోయాయి

అప్పులుచేసి పెట్టిన పెట్టుబడులుమొత్తం రాకుండా పోయి సన్నకారు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయకార్మికులు పనులులేక పస్తులుంటున్నారు.

కనుక ఈ సమితి కరువు ప్రాంతంగా ప్రకటించి, తక్షణమే సహాయక చర్యలు చేపట్టాల్సిందిగా తాలూకా కమ్యూనిస్టు పక్షం శ్రీ షేక్ అబ్దుల్ వహాబ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు,

శాశ్వత కరువు నివారణకై సాగర్ నీరు త్వరగా వచ్చేట్లు చూడాలని, పంటలుపోయినందున, పూర్తిగా శిస్తు రెమిషన్ యిప్పించాలని, అన్నిరకాల అప్పులవసూళ్లను వాయిదా గడువు పొడిగించి, సన్నకారు రైతులను ఎస్.ఎఫ్.డి.ఏ ద్వారా సబ్సిడీ, కొత్త అప్పులు మంజూరు చేయాలని, వ్యవసాయ కార్మికులకు పనులు కల్పించేందుకై నూజివీడు, గంపలగూడెం, రోడ్డు పనిని త్వరగా ప్రారంభించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బూర్గంపహాడ్, అక్టోబరు 28

బూర్గంపహాడ్ తాలూకా శ్రీధర గ్రామ వ్యవసాయకార్మికులకు శాసనమండలి సభ్యులు శ్రీ తొలకూరి వెంకటప్పయ్య ప్రారంభోత్సవం చేశారు.

విజయనగరంలో ముగ్గురుమున్సిపల్ ఉద్యోగుల తొలగింపు

విజయనగరం, అక్టోబరు 28

విజయనగరం మున్సిపల్‌టౌన్ ప్లానింగ్ శాఖలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులను రాష్ట్ర మున్సిపల్ శాఖలో టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఉత్తర్వుమేరకు మున్సిపల్ కమీషనర్ శ్రీ వి. వి. రాఘవరావు తాత్కాలికంగా తొలగించారు

తొలగింపబడిన వారిలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీ పాల్, ఓవర్సీస్ టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ త్రివిక్రమరావు వున్నారు.

తొలగింపుకుగలకారణాలు తెలియరాలేదు. పరిపాలనా అవకతవకలు ఈ తొలగింపుకు కారణమని భావించ బడుతూంది.

జగ్గయ్యపేట లైబ్రరీలో మహిళా,బాలల విభాగాలు

జగ్గయ్యపేట, అక్టోబరు 28

కృష్ణాజిల్లా, జగ్గయ్యపేటలోని గ్రేడ్ 1 లైబ్రరీలో బాలల, మహిళల విభాగాలను శాసనసభ్యురాలు శ్రీమతి వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించిన జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ శ్రీ కె. వి. సుబ్బారావు ప్రసంగిస్తూ వచ్చే విద్యా సంవత్సరం నుండి లైబ్రరీలలో విద్యార్థులపుస్తకాలనువుంచటం జరుగుతుందని అన్నారు. ఈ పథకాన్ని ప్రస్తుతానికి గ్రేడ్ 1 గ్రంథాలయాలకు పరిమితం చేయటం జరుగుతుందన్నారు.

సభలో శ్రీ గోనుగుండ్ల నాగేశ్వరరావు, శ్రీ వి. విశ్వేశ్వరయ్య, శ్రీ యం. వి. కృష్ణారావు, శ్రీ టి దేవరాజులు శ్రీ వేములపల్లి చంద్రశేఖరరావు ప్రసంగించారు.

గ్రంథాలయాధికారి శ్రీ షేక్ ఖాసిం వందన సమర్పణ చేశారు.

వర్ధమాన దేశాలకు బహుళజాతి కార్పొరేషన్ల ప్రమాదం

– శ్రీ వావిలాల విమర్శ

ఏలూరు, అక్టోబరు 25

మనం పళ్ళు తోముకునే బ్రష్‌నుంచి మహిళల ఫేస్ పౌడరుతో సహా నిత్యావసర వస్తువుల, భారీ యంత్రాల వరకు పరిశీలనగా చూస్తే బహుళజాతి కార్పొరేషన్ల వలయంలో మనమంతా ఎలాఇరుక్కున్నామో ప్రతి ఒక్కరికీ బోధపడుతుందని మాజీ శాసన సభ్యులు శాంతి ఇస్కస్ ఉద్యమ నాయకులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య ఈనెల 23న ఇక్కడి జిల్లా గ్రంథాలయ సంస్థలో జరిగిన బహిరంగసభలో ప్రసంగిస్తూ హెచ్చరించారు

బహుళజాతి కార్పొరేషన్లు, న్యూట్రాన్ బాంబు మానవాళి మనుగడకుతెచ్చిపెడుతున్న ప్రమాదాన్ని బహిర్గతం చేయడానికి జిల్లా ఇస్కస్ శాంతిసంఘం, ఇండో–జి. డి ఆర్. మైత్రీ సంఘాలు ఈ బహిరంగసభను ఏర్పాటు చేశాయి జిల్లా శాంతి.సంఘీభావ సంఘ అధ్యక్షులు శ్రీ ఏ. పరదేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు.

మొదటి ప్రపంచయుద్ధం నాటినుంచి రెండో ప్రపంచయుద్ధం వరకూ టాటా–బిర్లా–సింఘానియా. మహేంద్రా అండ్ మహేంద్రా వ్యాపారసంస్థలు క్రమక్రమంగ బలపడుతూ స్వాతంత్ర్యానంతర భారతదేశ జీవితంలో బాగా పుంజుకుని ప్రభుత్వానుగ్రహం సంపాదించి ఈనాడు బహుళజాతి కార్పొరేషన్లతో కలిసి మనల్నినిత్యమూ దోచివేస్తూ వున్నవని శ్రీ వావిలాల వివరించారు.

బహుళజాతి కార్పొరేషన్లనగా రాకాసి వ్యాపార సంస్థలన్నారు. ప్రాణరక్షణమందు మొదలు సామాన్య మందుకు ఈ సంస్థలు నిర్ణయించిన ధరలు చూసి అతి ధనిక దేశమైన అమెరికా ప్రభుత్వాధినేతలే కొనలేక ప్రపంచ వ్యాపార సంస్థలను పోటీగారమ్మని ఆహ్వానించారని, మానవుని ప్రాణం పట్ల వారికెంత తేలికభావన ముందో గ్రహించాలని శ్రీ పరదేశ్వరరావు అన్నారు.

న్యూట్రాన్ బాంబును తయారు చేస్తున్నామని చెప్పే అమెరికా దర్పాన్ని ఆయన గర్హించారు.

జిల్లా ఇస్కస్ కార్యదర్శి శ్రీ సి. హెచ్. వి. సోమయాజులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదిస్తూ కొలచల సీతారామయ్య మృతికి సంతాపం తెలిపింది న్యూట్రాన్ బాంబు రూపకల్పన ప్రపంచ శాంతికి భంగమని గర్హించింది.

కుటుంబ సంక్షేమంపై బ్యాలెట్ ప్రదర్శన

ప్రముఖ కూచిపూడి నృత్యకారుడు శ్రీ కోరాడ నరసింహారావు ఈ నెల 13 14 తేదీలలో సామర్లకోట, అనపర్తిలలో కుటుంబసంక్షేమంపై బ్యాలెట్‌లను ప్రదర్శించారు.

దాదాపు 5 వేల మంది ప్రజలు ఈ ప్రదర్శనలను తిలకించి ఇటువంటి ఉన్నతమైన పట్ల హర్షం ప్రకటించారు.

పాల సేకరణధర తగ్గింపు ఉత్పత్తిదార్లకు హానికరం

విశాఖజిల్లా మహాసభలో రైతు నాయకుల విమర్శ

అనకాపల్లి, అక్టోబరు 28

విశాఖజిల్లా పాల ఉత్పత్తిదార్ల మహాసభ ఈ నెల 24 న అనకాపల్లిలో శాసన సభ్యులు శ్రీ పోతిన సన్యాసిరావు అధ్యక్షతన జరిగింది.

మహాసభకు వివిధ తాలూకాల నుండి 250 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

విశాఖ మోడరన్ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధర ఒకేసారి లీటర్‌కు 30 పైసలు తగ్గించటం పాల ఉత్పత్తిదారులకు గొడ్డలిపెట్టుగా తయారైందని శ్రీ సన్యాసి రావు విమర్శించారు. పాల కొనుగోలుదార్లకు ధరను తగ్గించకుండా ఉత్పత్తిదార్లకు చెల్లించే ధరను తగ్గించటాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు.

రైతుసంఘ నాయకులు శ్రీ కె గోవిందరావు ప్రసంగిస్తూ, గ్రామీణ పరిశ్రమగా ఇటీవల కాలంలో అభివృద్ధి చెందుతున్న పాడి పరిశ్రమను దీనిపై ఆధారపడివున్న వేలాది పాల ఉత్పత్తిదార్లను దెబ్బ తీయడం భావ్యం కాదని హెచ్చరించారు.

జిల్లా సంఘ గౌరవ అధ్యక్షులుగా శ్రీ పోతిన సన్యాసిరావును, అధ్యక్షులుగా శ్రీ కె గోవిందరావును, కార్యదర్శిగా శ్రీ కరణం రామారావును, కోశాధికారిగా, శ్రీ దాడిపల్లి సుబ్బరాజును, మరో 20 మందితో కమిటీని మహాసభ ఎన్నుకుంది

జిల్లా సంఘం తరపున ఈనెల 25న జిల్లా కలెక్టర్, మోడరన్ డెయిరీ జనరల్ మేనేజర్‌వద్దకు ఒక ప్రతినిధి వర్గం రాయబారం వెళ్ళింది

ఉత్పత్తిదారుల కోర్కెలను సానుభూతితో పరిశీలించగలమని వారు హామీ ఇచ్చారు.

శాంతి, సంఘీభావ సంఘం, స్నేహ సంఘాల నిర్ణయం

ఏలూరు, అక్టోబరు 25

భారత సోవియట్ సాంస్కృతికసంఘం, శాంతి సంఘీభావ సంఘం. ఇండో–జి. డి. ఆర్ మిత్రమండలి జిల్లా కార్యవర్గాల సంయుక్త సమావేశం యిటీవల జరిగింది.

అక్టోబరు విప్లవ దినోత్సవాన్ని, ఇస్కస్ రజతోత్సవాన్ని జిల్లాలో పలుచోట్ల పెద్ద యెత్తున జరపాలని సమావేశం నిర్ణయించింది. న్యూట్రాన్ బాంబు ప్రమాదాన్ని గూర్చి ప్రచారం సాగించాలని నిర్ణయించింది. కొలచల సీతారామయ్య మృతికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది.

25 ఏళ్ళ క్రితం-నేడు

విశాలాంధ్ర

బుధవారం, అక్టో 29, 1952

సామ్రాజ్యవాదులతో రాజీకి జనరల్ నజీబ్ సన్నాహం

లండన్, అక్టోబరు 27

ఈజిప్టులో జనరల్ నజీబ్ జరిపిన తిరుగుబాటు సామ్రాజ్య వాదులతో రాజీ పడటానికి మార్గాన్ని సుగమం చేసిందని, బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ ఉపాధ్యక్షుడు పామీదత్తు "డైలీ వర్కర్"లో ఒక ప్రధాన వ్యాసం వ్రాస్తూ వివరించాడు.

"డైలీ వర్కర్" బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన నడుస్తున్న దిన పత్రిక.

ఉత్తర కొరియనులచే సమితి సేనల విధ్వంసం

టోకియో, అక్టోబరు 27

కొరియా పశ్చిమ రంగంలో "కాంకి లోయ"పై ఉత్తరాది సేనలు కురిపించిన అగ్నివర్షానికి తట్టుకోలేక మిత్ర రాజ్య సమితి సేనలు దానిని వదిలివేసి వెనుకకు పోయినాయని అమెరికన్ సైన్యకార్యాలయం ప్రకటించింది.

సాయంకాలం మిత్రరాజ్య సమితి తీవ్ర రక్షణ దళాలు కొండలోయపై తరంగాల మాదిరి విరుచుకు పడిపోయినాయి. ఉత్తరాది సేనలు వారిని లోయలోనికి రానిచ్చి, భయంకరమయిన అగ్నివర్షం కురిపించారు ఎన్నో వందల మందిని నష్టపోయిన మిత్ర రాజ్య సేనలు "కాంకి లోయ"ను వదిలి పోయారు.

వ్యవసాయ కార్మిక హక్కుల రక్షణకై మూకుమ్మడి నిరాహార దీక్షలు

ఏలూరు తాలూకా హరిజన, బలహీన వర్గాల సదస్సు హెచ్చరిక: 1500 మందితో ప్రదర్శన; భూస్వాముల దాడుల ఖండన

(విశాలాంధ్ర విలేకరి)

ఏలూరు అక్టోబరు 27

వ్యవసాయ కార్మికుల హక్కులను కాలరాస్తే తాలూకా వ్యాపితంగా పేద ప్రజానీకాన్ని సమీకరించి ప్రభుత్వకార్యాలయాల్ని చుట్టు ముట్టి మూకుమ్మడి నిరాహార దీక్షలు సాగించి, హక్కుల్ని రక్షించు కోవలసి వస్తుందని ఇక్కడ జరిగిన ఏలూరు తాలూకా హరిజన, గిరిజన బలహీన వర్గాల సదస్సు ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అందుకు సన్నాహాలు కూడా చేయాలని నిర్ణయించింది.

ఏలూరు తాలూకా కొప్పాక గ్రామ హరిజన వ్యవసాయ కార్మికులు జమీందారు అక్రమ బినామీ అమ్మకాలకు వ్యతిరేకంగా మూడు దశాబ్దాలు కోర్టుల చుట్టూ తిరిగి 80 ఎకరాల బీడు భూములను తమకు మంజూరు చేయవలసిందిగా ప్రభుత్వాన్ని అర్థించి చివరకు ఆక్రమించి వ్యవసాయం ప్రారంభించగా ఆ భూమినే గోసంరక్షణ సమితికి మంజూరు చేయటం న్యాయంకాదని యీ సదస్సు ఒక తీర్మానంలో విజ్ఞప్తి చేసింది.

వివిధ ప్రాంతాలలో భూస్వామ్య శక్తులు అగ్రకుల అహంకారులు జనతా ప్రభుత్వ అండతో జరుపుతున్న అత్యాచారాలను దాడులను సదస్సు తీవ్రంగా ఖండిస్తూ వీటిని అరికట్టేందుకు ఒక ప్రత్యేక శాఖను కూడా ఏర్పాటు చేయాలని కోరింది.

34 గ్రామాలకు చెందిన 1000 స్త్రీ పురుష ప్రతినిధులతో సదస్సు జరిగింది.

సదస్సుకు జిల్లా వ్యవసాయ కార్మిక నాయకులు శ్రీ వి. వి. సారధి అధ్యక్షత వహిస్తూ హరిజన, బలహీన వర్గాలపై ఈ జిల్లాలో జరుగుతున్న దౌర్జన్యాలను పేర్కొని, ప్రతి ఒక్కరూ ప్రతిఘటించడానికి సిద్ధంగా వుండాలన్నారు.

శాసన మండలి సభ్యులు, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ కొండ్రు సుబ్బారావు సదస్సును ప్రారంభిస్తూ దేశం మొత్తంమీద జనతా ప్రభుత్వం అధికారంలోకి రాగానే హరిజనులపైన, బలహీన వర్గాలపైనా జరుగుతూ వున్న దురంతాలను వ్యవసాయకార్మిక సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజానీకానికి అండగా వుండి, ప్రతిచోటా, కష్టకాలంలో వారిని ఎలా ఆదుకుంటూ వుందో వివరించారు.

జిల్లా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ ఇందుకూరి సుబ్బరాజు సందేశమిస్తూ జనతా ప్రభుత్వం గద్దె ఎక్కిన అనతి కాలంలోనే భూస్వామ్యవర్గాలు, పెత్తందారీ శక్తులు విజృంభించిన తీరుని సదస్సుల దృష్టికి తెచ్చారు.

మరింత గడ్డుకాలం రానున్నదని, భూ సంస్కరణలకోసం, మిగులు భూముల కోసం కూలిరేట్లకోసం, అధిక ధరలను అరికట్టడంకోసం ఐక్యంగా పోరాడాలనిఅందరూ ప్రజాసంఘాల్లో సమీకృతులు కావాలని హెచ్చరించారు

రాష్ట్ర రైతుసంఘ ఉపాధ్యక్షులు శ్రీ సంకు అప్పారావు ప్రసంగిస్తూ పేద ప్రజా శక్తి అపారమనీ, ఆ పేద ప్రజల పక్షాన నిలిచేదికమ్యూనిస్టుపార్టీయేనని చరిత్ర రుజువుచేసిందన్నారు

పట్టణ కార్మిక నాయకులు శ్రీయుతులు పూడి అప్పలస్వామి, శ్రీ కుంచే అప్పారావు తమ సందేశాలనిస్తూ కార్మికవర్గం వ్యవసాయ కార్మికులకు అండగా వున్నదన్నారు.

తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీ టి. వెంకటేశ్వరరావు తీర్మానాలను ప్రతిపాదించి సదస్సులకు వివరించారు.

సదస్సు అనంతరం ఊరేగింపుగాబయలుదేరి తమ కోర్కెలను పాటలను [illegible], నినదిస్తు ప్రధాన వీధులను చుట్టి వచ్చారు.

శ్రీయుతులు టి వి ఆర్. ఎ. ఎ. నైనను, ఈడ్పుగంటి వెంకటరామయ్య, అడ్డగర్ల రాఘవయ్య, పూడి అప్పలస్వామి, కుంచే అప్పారావు, యువజన నాయకులు దుర్గారావు, హనీఫ్, మహిళా నాయకులు ఎ సరోజిని, కె లక్ష్మమ్మ, పి. రత్నమ్మ ఊరేగింపు ముందు భాగంలో వుండి నాయకత్వం వహించారు

వ్యవసాయ కార్మిక హరిజనుడయిన ముంగర సూర్యనారాయణపై దౌర్జన్యం జరిపి గాయపరిచిన మూర్తిరాజు [illegible] విరమిస్తూ వారిపై చర్యకు సదస్సు డిమాండ్ చేసింది

పేదలకొరందరికీ భూములు, ఇళ్ళ స్థలాలు ధారాళంగా మంజూరు చేయాలి. నిర్మాణ ఖర్చులకుగాను రు 500 ఆర్థిక సహాయం చేయాలని కోరింది.

న్యాయంపల్లి, దాటపర్రు, పోణంగి, కలపర్రు గ్రామాలలో అర్జించిన భూములను వెనువెంటనే మంజూరు చేయాలని సదస్సు విజ్ఞప్తి చేసింది.

మిగులు భూములను సత్వరం పంపిణీ చేయడానికై చర్యలు తీసుకుంటూ భూసంస్కరణల కార్యక్రమాన్ని త్వరితం చేయాలని ఈ సదస్సు తీర్మానించింది.

శ్రీ రేబాలకు తెనుగు దర్బార్ సన్మానం

కళాకారులను, కళోద్ధారకులను, కళాపోషకులను పట్టణ ప్రజలకు చిరకాలంగా పరిచయంచేస్తూ అభినందనలనందుకుంటున్న తెనుగు దర్బారు ఈసారి వై. యం. హెచ్. ఎ కళామందిరంలో శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డిని మంగళవాయిద్యాలతో స్వాగతంచెప్పి నూతన వస్త్రాలు బహూకరించి ఘనంగా సన్మానించింది.

శ్రీయుతులు బి. వి. రమణమూర్తి వేరెళ్ళ లక్ష్మణరావు, కె. సుబ్బారావులు శ్రీ రేబాల కళాభిరుచిని, పోషకత్వాన్ని ఆహూతులకు పరిచయం చేశారు.

సభాధ్యక్షులు నటశేఖర శ్రీ వై. తిరుమూర్తి తెనుగుదర్బారును దాని సంధాత శ్రీ వేరెళ్ళ లక్ష్మణరావు కృషిని అభినందించారు

అనంతరం శ్రీ పిసపాటి కృష్ణరాయ బార నాటకం ప్రదర్శించారు.

సోషలిస్టు శక్తుల ఐక్యతకై శ్రీ రఘునాథరెడ్డి విజ్ఞప్తి

దేశ ప్రజల సమస్యలను కాంగ్రెసుపార్టీ గాని దాని అడుగు జాడలలో ప్రయాణం చేసే జనతాపార్టీ గాని పరిష్కరించలేదని చరిత్ర ఋజువు చేస్తూనే వుందని, అవి అవలంబిస్తున్న పెట్టుబడిదారి పంథావల్ల ధరలు, నిరుద్యోగం విపరీతంగా పెరిగి ప్రజానీకాన్ని వేధిస్తున్నాయని, పెట్టుబడిదారీయేతర పంథాయే దేశానికి శరణ్యమని మాజీ కేంద్ర మంత్రి శ్రీ కె. వి రఘునాధ రెడ్డి జిల్లా ఇస్కస్ భారత్ సేవక్ సమాజ్ హాలులో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగిస్తూ స్పష్టం చేశారు.

ఇస్కస్ నాయకులు శ్రీయుతులు డాక్టర్ వి. [illegible]రావు, పి. హెచ్. వి. సోమయాజులు, భారత్ సేవక్ సమాజ్ నాయకులు శ్రీయుతులు నూతలపాటి శ్రీహరిరావు, పచ్చిపులుసు సత్యనారాయణ స్వాగతం పలికారు.

శ్రీ రెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ సోషలిజమే ప్రజల సమస్యలను పరిష్కరించగలదన్నారు. ఈనాడు దేశంలో అమలు జరుగుతూవున్న మిశ్రమ ఆర్థిక విధానంవల్ల ప్రయోజనం లేదన్నారు. కాంగ్రెసుగాని, జనతాగాని ప్రజల విశ్వాసాన్ని పొందలేకపోయారన్నారు. సోషలిజాన్నికోరేవ్యక్తులు, శక్తులు ఒకే వేదికపైకి రావాలన్నారు

శ్రీ పరాత్పరరావు సమావేశానికి అధ్యక్షత వహించారు.

హరిజన గృహనిర్మాణాల పరిశీలన

హరిజనుల ఉపయోగార్థం నిర్మించబడిన గృహాలు నివాసయోగ్యాలుగా లేవని, దాని అధ్వాన్నపు పరిస్థితిలో వున్నవన్న ఫిర్యాదులను శాసనమండలి ఏర్పాటు చేసిన కమిటీ శ్రీ ఎ. చక్రపాణి నాయకత్వాన కొన్ని ప్రాంతాల గృహాలను పరిశీలన చేసింది ఇంతవరకూ గృహనిర్మాణం పూర్తి చేయని ప్రాంతాల్లో కాంట్రాక్టర్లకు అడ్వాన్సు చేసిన మొత్తాలను తిరిగి వెంటనే రాబట్టాలని నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పింది.

ఈ పరిస్థితికి కారణాలను, కొన్ని గృహాల్లో హరిజనులు ప్రవేశించక పోవటాన్ని తరచి తరచి ఉద్యోగస్థులను ప్రశ్నించింది. వర్గాల ప్రాతిపదిక మీద జరిగిన కేటాయింపులను విధిగా అమలువర్చాలని చెప్పింది.

శ్రీ టి జియ్యర్‌దాసు, కె. రోశయ్య, యమ్, కె మాణిక్యాలరావు వై. వి కృష్ణారావు, యల్. యస్ రాజు, మీర్ అక్బరాలి వి. వెంకట్రామరెడ్డి ఈ కమిటీ సభ్యులుగా వున్నారు.

2669 గృహాలు మంజూరు కాగా 2484 పూర్తిచేయబడినవని 2460 గృహప్రవేశాలు జరిగినవని జిల్లా కలెక్టరు శ్రీ కె రాందాసు కమిటీ దృష్టికి తెచ్చారు. మిగతా వాటి నిర్మాణం వివిధ దశల్లో వుందన్నారు.

లైఫ్ ఇన్సూరెన్సు వారి నిధుల సహాయంతో నిర్మించిన 4490 గృహాలకు కొన్నిటికి నిర్మాణ లోపా లున్నవి మంచినీటి సరఫరా సౌకర్యం లేదు. విద్యుత్ దీపాల సౌకర్యం గాని రోడ్డు సౌకర్యం గాని లేక పోవడంవల్లహరిజనులు వాటినివాడటంలేదు వీటికై 46 11 లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు కాని ఉపయోగపడటంలేదు. ఈ లోపాలను సవరించటానికి తగు సిఫార్సులు చేయు నిమిత్తమే ఈ కమిటీ తన సంచారాన్ని ప్రారంభించింది.

షెడ్యూలు కులాల వారిపై అత్యాచారాలు

మండపేటసభ ఖండన

కాకినాడ అక్టోబరు 26

తూర్పుగోదావరి జిల్లాలోని పలు గ్రామాలలో షెడ్యూలు కులాలవారిపై జరుగుతున్న అత్యాచారాలను ఆలమూరు తాలూకా షెడ్యూలు కులాలసంఘం ఆధ్వర్యాన మండపేటలో జరిగిన సభ ఖండించింది.

సభకు జిల్లాసంఘ అధ్యక్షులు శ్రీ కె శేషాద్రి అధ్యక్షత వహించారు శ్రీయుతులు పి ప్రసాదరావు, ఆనందరావు, స్వామి ని హెచ్ అప్పారావు టి నరసింహమూర్తి దుర్గయ్య, గండి చంద్రరావు, సుబ్బారావు, సూరయ్య ప్రభృతులు ప్రసంగించారు.

రామచంద్రపురం తాలూకా మాచవరంలో వీరయ్య అను హరిజనుడిని అగ్రకులాలవారు తీవ్రంగా కొట్టి బండికి కట్టి లాగించి పశువుకన్నా హీనంగా హింసించిన దుష్కృత్యము సభ ఖండించింది. ఈ ఘాతుకానికి పాల్పడిన నేరస్తులను శిక్షించాలని, షెడ్యూలు కులాలవారిపై అత్యాచారాలు జరుగకుండా రక్షణ కల్పించాలని సభ కోరింది.

సభా ప్రారంభానికి ముందుగా షెడ్యూలు కులాలవారిపై అత్యాచారాలను నిలుపు చేయాలని కోరుతూ 3 వేల మందితో ప్రదర్శన జరిగింది

పోస్టల్ ఉద్యోగులు ధర్నా

పోస్టల్ శాఖలో ఎక్‌స్ట్రా డిపార్టుమెంటల్ ఉద్యోగుల అలవెన్సులను కనీసమైన రు. 45 లకు పెంపు చేయాలని కోరుతూ కాకినాడ హెడ్ పోస్టాఫీసు ముందు ధర్నా జరిపారు

సెలవు, వైద్యం, గ్రాట్యూటీ, పెన్షన్ తదితరసౌకర్యాలను కూడా కల్పించాలని వారు కోరారు.

కులాంతర వివాహం

ఈ నెల 21 వ తేదీ రాత్రి ఇక్కడ కులాంతర వివాహం జరిగింది.

హరిజన యువకుడు డాక్టర్ హరిహర రావు యం. బి. బి. యస్, కమ్మయువతి సంపత్‌లకు ఈ వివాహం జరిగింది.

ఈ వివాహానికి వధూవరుల తల్లిదండ్రులతో పాటుగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

చెరుకుపల్లిలో పశువుల ఆస్పత్రికి నూతన భవనం

రేపల్లె అక్టోబరు 28

గుంటూరుజిల్లా రేపల్లె తాలూకా చెరుకుపల్లిలో ప్రభుత్వ పశువైద్యశాల నూతన భవనానికి రాష్ట్ర పశు సంవర్థకశాఖ డైరెక్టర్ శ్రీ నారారెడ్డి ప్రారంభోత్సవం చేశారు,

ఈ భవన నిర్మాణానికి గ్రామ ప్రజలు 30 వేలు విరాళం యిచ్చారు.

ఏలూరు పంచాయితీకోర్టు ఎన్నికలు

శ్రీయుతులు కిలపర్తి సూర్యప్రకాశరావు మహమ్మద్ అఫ్జల్, దింటకుర్తి లక్ష్మీ నరసింహారావు, దాసరి రంగారావు. కరణం అప్పారావు, గోసుగుంట రాములు, ఇజ్జాడ అదియ్య, ఏలూరు పట్టణం పంచాయితీకోర్టు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

సుమారు మూడు దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీ సభ్యులే ప్రధానంగా ఈ కోర్టును నిర్వహించారు

వర్తక సంఘాల అభ్యర్థన ననుసరించి ఈసారి రాజకీయ పార్టీలు ఈ ఎన్నికలో ప్రమేయం పెట్టుకోలేదు.

తాలూకా తహసీల్దారు శ్రీ ప్రసాదరావు ఎన్నికలను నిర్వహించారు.

మార్టేరు రైతు దినోత్సవం

రైతు తన ఉపాధి రంగంలో రాణించాలంటే శాస్త్రజ్ఞానం, వ్యాపార దక్షత, మంచి వ్యవసాయ జ్ఞానం కలిగిన సర్వజ్ఞుడు కావాలని జిల్లా కలెక్టరు శ్రీ కె రాందాసు మార్టేరు రైతు దినోత్సవ సందర్భంలో చెప్పారు 40 లేక 45 బస్తాల ధాన్యాన్ని ఎకరాలో ఇక్కడా అక్కడా పండించినంత మాత్రాన తాను తృప్తిపడనని, జిల్లాలో రైతులు అశేష సంఖ్యలో [illegible] టన్నులకొద్దీ పండించాలని, అవసరమైన సదుపాయాలిచ్చి తోడ్పడగలనని వాగ్దానం చేశారు.

జాయింట్ డైరెక్టర్ శ్రీ వై విశ్వనాథం ప్రసంగిస్తూ పరిశోధనా కేంద్రం నిర్వహించిన పనిని శ్లాఘించారు రైతు సమస్యలను అర్థం చేసుకుంటూ ఆధునిక వ్యవసాయజ్ఞానం అందిస్తూ అధిక దిగుబడిని యిచ్చే వంగడాలను సరఫరా చేస్తామని చెప్పారు.

సాంఘిక విప్లవంద్వారా దేశంలో మార్పులు

హేతువాదుల సభలో పలువురి విజ్ఞప్తి

ఏలూరు అక్టోబరు 25

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కుల, మతతత్వాలు మరింత పెచ్చు పెరిగాయని వాటిని నిర్మూలించాలని గట్టిగా ప్రబోధించవలసినవారే తమ స్వార్థాలకై వాటిని నిరంతరం ప్రోత్సహిస్తూ పెద్ద నాయకులుగా చలామణీ అవుతున్నారని భావవిప్లవంద్వారా సాంఘిక విప్లవాన్ని పూర్తి చేస్తే సమాజంలో మార్పు కలిగి కుల, మత మూఢ విశ్వాసాలను సమూలంగా పెకలించగలమని, అందుకు హేతువాదం అవసరమని శ్రీ రావి వెంకటాద్రి అన్నారు.

హేతువాద అధ్యయన శిక్షణ తరగతుల ముగింపు సందర్భంలో జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటైన బహిరంగసభలో ఆయన ఉపన్యసించారు

సభాధ్యక్షులు శ్రీ పి. హెచ్ వి. సోమయాజులు ప్రసంగిస్తూమానవుని మరొక మానవుడు దోచుకోరాదని, అణగద్రొక్కరాదని హేతువాదులంతా దీనిని ఎదుర్కోవాలని అన్నారు.

శ్రీ ఈశ్వర్ ప్రభు ప్రసంగిస్తూ హేతుబుద్ధి మానవుని సహజ లక్షణమని, దానిని పెంపొందించుకుని మూఢ నమ్మకాలను పారద్రోలాలన్నారు.

ఎ. ఆర్. ఆర్. కాలేజి చరిత్ర విభాగపు అధిపతి శ్రీ గోడా సత్యనారాయణ తరగతులకు హాజరైన విద్యార్థులను శ్లాఘించారు

హేతువాద సంఘ కార్యదర్శి శ్రీ పి. అప్పారావు కార్యక్రమాన్ని జయప్రదం చేసిన వారందరికీ అభివందనలు తెలియచేశారు.

ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు పెంపు

ముఖ్యమంత్రికి మెమోరాండం

గన్నవరం, అక్టోబరు 27

ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును తిరిగి 58 సంవత్సరాలకు పెంపు చేయవలసిందిగా కోరుతూ ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచారకమండలి ప్రధాన కార్యదర్శి శ్రీ కె వెంకటేశ్వరరావు రాష్ట్ర ముఖ్యమంత్రికి మెమొరాండం సమర్పించారు.

కేంద్ర ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 సంవత్సరాలు. ఇతర రాష్ట్రాలలో కూడా ఇదే అమలు జరుపబడుతూంది. మన రాష్ట్రంలో పదవీ విరమణ వయస్సును తగ్గించడం సమంజసం కాదు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవమైన నవంబరు ఒకటో తేదీలోపుగా పదవీ విరమణ వయస్సును పెంపుచేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి అని ఆ మెమొరాండంలో కోరారు.

రేపల్లె ఆర్. టి. సి. డిపో యంప్లాయీస్ యూనియన్ మహాసభ

రేపల్లె, అక్టోబరు 26

ఆర్ టి సి. ఎంప్లాయీస్ యూనియన్ రేపల్లె డిపో 7 వ మహాసభ ఇటీవల ఇక్కడ జరిగింది. మహాసభకు గుంటూరు బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీ బాబాస్ ఖాన్ అధ్యక్షత వహించారు.

తొలుత యూనియన్ నిర్మాత శ్రీ వి. సీతారామయ్య యూనియన్ పతాకాన్ని ఎగురవేశారు.

తాలూకా పౌర హక్కుల సంఘ అధ్యక్షులు శ్రీ యం, శ్రీరాములు, తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ మేకా రామకోటేశ్వరరావు. ఇంకా శ్రీ ఆనందరావు, శ్రీ కొంతారావు, శ్రీ యస్. గని, శ్రీ యం వెంకటేశ్వరరావు సందేశాలిచ్చారు.

పొన్నూరు డిపో యూనియన్ కార్యదర్శి శ్రీ వి, సత్యనారాయణ, గుంటూరు 2 డిపో యూనియన్ కార్యదర్శి శ్రీ వాడపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు శ్రీ కె. జోసెఫ్ కూడా సందేశాలిచ్చారు.

జిల్లా బ్రాంచ్ యూనియన్ కార్యదర్శి శ్రీ ఇస్మాయిల్ ప్రసంగిస్తూ ఇటీవల కాలంలో యూనియన్ సాధించిన విజయాలను వివరించారు. అపరిష్కృత సమస్యలను కార్మికులు ఐక్యంగా వుండి సాధించుకోవాలని ఉద్బోధించారు.

డిపో యూనియన్ కార్యదర్శి శ్రీయన్. వెంకటేశ్వర్లు కార్యదర్శి నివేదికను, కోశాధికారి శ్రీ నాగేశ్వరరావు జమా ఖర్చుల నివేదికను ప్రవేశపెట్టారు. చర్చ అనంతరం రెండు నివేదికలను మహాసభఆమోదించింది

డిపో యూనియన్ కార్యదర్శిగా శ్రీ యన్. వెంకటేశ్వర్లు సహాయ కార్యదర్శిగా శ్రీ మహమ్మద్‌సయ్యద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీ యస్. హనుమంతరావు, కోశాధికారిగా శ్రీ యస్. నాగేశ్వరరావును మహాసభ ఎన్నుకుంది.

దివి తాలూకా ప్రజా నాట్యమండలి మహాసభ

నడకుదురు, అక్టోబరు 27

కృష్ణాజిల్లా దివితాలూకా ప్రజా నాట్య మండలి మహాసభ యీ నెల 18 న నడకుదురులో జరిగింది.

జిల్లా ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి శ్రీ డి. వి. ఎస్ ఆర్. వి. సుబ్బారావు ప్రజానాట్యమండలి కర్తవ్యం, భవిష్యత్ కార్యక్రమం వివరించారు. తాలూకా ప్రజానాట్యమండలి కార్యదర్శి శ్రీ పరుచూరి చెన్న కేశవరావు కార్యక్రమాల నివేదిక నిచ్చారు.

అనంతరం శ్రీ పరుచూరి చెన్న కేశవ రావు అధ్యక్షులుగా, శ్రీ మతి ఘంటసాల రుక్మిణి ఉపాధ్యక్షులుగా, శ్రీ హనుమానుల జగన్మోహనరావు కార్యదర్శిగా, శ్రీ దోనెపూడి రాధాకృష్ణయ్య సహాయ కార్యదర్శిగా, మరో 9 మంది కార్యవర్గ సభ్యులుగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు

రాత్రికి జరిగిన బహిరంగసభకు శ్రీ చెన్న కేశవరావు అధ్యక్షత వహించారు శ్రీ డి వి ఎస్ ఆర్ వి సుబ్బారావు ప్రసంగించారు, శ్రీ జగన్మోహనరావు స్వాగతం చెప్పారు శ్రీ రాధాకృష్ణయ్య వందన సమర్పణ చేశారు.

బెంగుళూరు, మద్రాసులకన్నా హెచ్చుగా రాష్ట్రంలో హోటల్ రేటు

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, అక్టోబర్ 28

చక్కెరమినహాయించి పప్పులు, నూనెలు బియ్యం మిగిలిన దక్షిణాది రాష్ట్రాలకన్నా పెద్ద ఎత్తున నిల్వలున్న ఆంధ్రప్రదేశ్ హోటళ్ళలో తినుబండారాల రేట్లు బెంగుళూరు, మద్రాసులకన్నా అధికం

కంట్రోలు ధరకు అవసరమైన అన్ని సరుకులు సప్లై చేస్తామని హామీ యిస్తున్నప్పటికీ హోటల్ యజమానులు తిరస్కార వైఖరి అవలంబిస్తున్నట్లు మంత్రి శ్రీ కె. రామిరెడ్డి విమర్శించారు.

దక్షిణాది రాష్ట్రాలలో హోటల్ రేట్లు

రేట్లు (పైసలలో)	హైదరాబాద్	బెంగుళూరు	మద్రాసు
ఇడ్లీ	45 నుండి 65	32 నుండి 45	25
వడ	45-60	15-30	25
ఉప్మా	40-60	30-55	35
మసాలాదోసె	75-115	50-65	—
పూరి	50-65	50-65	35
కాఫీ	40 50	30-45	35
టీ	30-40	30 45	25
పేటభోజనం	215	150-155	104

ఈ రేట్లు కర్నాటక, తమిళనాడు మొత్తంలో అమలులో వున్నాయి. హైదరాబాద్ రేట్లు మాత్రం పేర్కొన్న నాటికన్నా కొన్ని అధికంగా వసూలు చేస్తున్న హోటళ్లు కూడా వున్నాయి.

కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలో హోటల్ రేట్ల నిర్ణయాలపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. ప్రభుత్వం నిర్ణయించిన రీతిలోనే తినుబండారాల ధరలు కొనసాగుతాయి.

ప్రభుత్వం ప్రతిపాదించిన సూచనలను జంట నగరాల హోటల్ యజమానులు అంగీకరించని పక్షంలో అవసరమైన చర్యలు చేపట్టడానికి కృతనిశ్చయంతో వున్నామని మంత్రి ప్రకటించారు.

చట్టం అవసరం లేకుండా సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించాలనే దృష్టితో యిప్పటివరకూ వేచిచూశామని చెప్పారు.

ప్రభుత్వంతో 1976 మేలో కుదుర్చుకొన్న "పెద్దమనుషుల ఒప్పందం" నాటి రేట్లు

	1 వ తరగతి	2 వ తరగతి
ఇడ్లీ : 100 గ్రాములు-సాంబారు, చట్నీ	30	40
వడ : 50 గ్రాముల చట్నీ, సాంబారు	35	40
ఉప్మా : 50 గ్రాముల చట్నీ	40	45
సాదాదోసె: 40 గ్రాముల చట్నీ, సాంబారు లేదా కూర	45	50
పూరి (2) 40 గ్రాముల కూర	45	50
కాఫీ	35	45
టీ	30	35
ప్లేటు భోజనం	190	190

రు. 3 లక్షల రాబడి లోపుగల హోటల్‌ను మొదటి తరగతిగా రు. 3 లక్షలకు పైబడి వున్న హోటల్‌ను రెండవ తరగతిగా విభజించారు. స్టార్ హోటళ్ళు (విలాస వంతమైనవి) ప్రభుత్వం నిర్ణయించిన ఈరేట్ల పరిధిలోకి

ఇద్దరుస్మాల్ సేవింగ్స్ అధికారుల అరెస్టు

నాగపూర్, అక్టోబరు 27

దమన్‌గాన్ రెస్టు హౌస్‌లో ఒక అటెండరును హత్యచేసిననేరంపై స్మాల్ సేవింగ్స్ శాఖకు చెందిన ఇద్దరు అధికారులను అరెస్టు చేయడం జరిగింది

శాసన సభలో జనతా పార్టీ సభ్యులు శ్రీ హెచ్. ఎస్ త్రివేది శ్రీమతి కమలా రామన్ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానంపై హోంశాఖ స్టేట్ మంత్రి శ్రీ ఆర్. పి. వార్వే ఒక ప్రకటన చేస్తూ పై విషయాన్ని తెలిపారు.

ఈ అధికారులు శ్రీ మాణిక్ వరదక్కర్, శ్రీ రమేష్ వర్మా రిఅను లైంగిక ఆనందానికై ఒక 'కొజ్జావాణ్ణి' తీసుకొని రమ్మని అటెండరును కోరగా, అందుకు అతను నిరాకరించడంతో వారు అతన్ని బూట్లతోనూ చెప్పులతోనూ, పిడికిళ్ళతోను తీవ్రంగా కొట్టగా, అటెండరు తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు మంత్రి వివరించారు.

భారత శిక్షాస్మృతి క్రింద కేసు రిజిష్టర్ చేయబడి, దర్యాప్తు జరుగుతున్నదని ఆయన తెల్పారు.

ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందగానే ఇద్దరు కానిస్టేబుళ్ళు హుటాహుటిగా అక్కడకు వెళ్ళగా, అధికారులు రెస్టుహౌస్ గది తలుపులు తెరవడానికి నిరాకరించారని తెల్పారు.

అంతట ఒక కానిస్టేబుల్ అక్కడ వుండి, మరొక కానిస్టేబుల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఈ విషయాన్ని పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌కు తెలియచేయడం జరిగిందని చెప్పారు.

సబ్ ఇన్‌స్పెక్టర్ వెంటనే రెస్టుహౌస్‌కు వెళ్ళి, తలుపులు తీయకపోతే తీవ్రమైన చర్యలు తీసుకోవలసివస్తుందని హెచ్చరించగా వారు తలుపులు తీయగా, ఆ అటెండరు [illegible] వంటిమీద బట్టలు లేకుండా మృతి చెంది వుండటాన్ని కనుగొన్నారు.

మంత్రి ప్రకటన అనంతరం డిప్యూటీ స్పీకర్ వాయిదా తీర్మానానికి అనుమతినిరాకరిస్తూ ఈ ఘటనపై దర్యాప్తు జాగ్రత్తగా జరిగేటట్లు చూడాలని కోరారు.

నల్ల జండాల ప్రదర్శనకు డి. యం. కె. నిర్ణయం

మూపనార్ ఆశ్చర్యం

మద్రాసు, అక్టోబరు 27

తమిళనాడులో శ్రీమతి ఇందిరా గాంధి పర్యటించనున్నప్పుడు నల్ల జండాల ప్రదర్శన జరపాలని డి యం, కె నిర్ణయించడం పట్ల తమిళనాడు కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు శ్రీ కరుపయ్య మూపనార్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

1976 జనవరిలో డి. ఎం, కె. మంత్రి వర్గాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం రద్దు చేసినందుకు డి, యం, కె. వాస్తవంగా ఆగ్రహాన్ని వ్యక్తం చేయదలచుకుంటే, ఆ తరువాత మూడు సార్లు శ్రీమతి గాంధి తమిళనాడులో పర్యటించినప్పుడు ఆ పని చేయవలసి వుండెనని ఆయన అన్నారు.

ఇంతకాలంగడిచాక ఇప్పుడు డి ఎం కె, ప్రదర్శనలు నిర్వహించాలను కొనడం జనతా ప్రభుత్వాన్ని సంతోష పెట్టడానికి మాత్రమేనని శ్రీ మూపనార్ అన్నారు.

లడక్‌లోని హిమాలయశిఖరాల అధిరోహణ నిషేధం

శ్రీనగర్, అక్టోబర్ 27

లడక్‌లోని హిమాలయ పర్వతాల అంచు శిఖరాలు నన్ కున్‌లను విదేశీ పర్వతారోహకులు అధిరోహించడాన్ని కేంద్ర ప్రభుత్వం నిషేధించడానికి నిర్ణయించింది.

ఇందుకు కారణాలు తెలియనప్పటికీ, ఈ శిఖరాలు కీలక ప్రాంతాల్లో వుండడంచేత దేశ భద్రత దృష్ట్యా ఈ చర్య తీసుకొన్నట్లు భావించబడుతూంది.

భారత పర్వతారోహకుల ఫౌండేషన్ ఈ రెండు శిఖరాల్లో ఒకదానిని జపాన్ బృందం అధిరోహించుటకు ఇంతకుముందు ఇచ్చిన అనుమతిని రద్దుచేయడం జరిగి, మరొక శిఖరాన్ని ఎంపిక చేసుకోమని కోరడం వల్ల ఈ విషయం వెల్లడైంది.

ఎమర్జెన్సీ కాలంలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంమధ్య కనుమరుగైన తేడా

షా కమిషన్ ముందు పబ్లిసిటీ డైరెక్టర్ వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 28

ఎమర్జెన్సీ ప్రకటించినప్పటి నుండే ప్రభుత్వానికీ పార్టీకి మధ్య తేడా లేకపోయి నట్లేనని, తనకూ, సహచరులకూ అర్థమయిందని కేంద్ర సమాచార ప్రసారశాఖ ఫీల్డు పబ్లిసిటీ డైరెక్టర్ డా. ఎ. ఆర్ బాజీ షా కమిషన్‌కు చెప్పారు.

ప్రధాన మంత్రికే గాక కాంగ్రెస్ అధ్యక్షుడికి కూడా ప్రముఖంగా ప్రచార మివ్వాలని మాకు చెప్పారు. ఈ తరహా పనితీరు గురించి విభాగంలో కొందరు గొణిగారు నేను కూడా అసమ్మతిని తెలిపినందుకు ప్రధాన అధికారసమాచార పదవినుండి చిన్న పదవికితోసివేశారు' అని డాక్టర్ బాజీ నిన్నటి సాక్ష్యంలో పేర్కొన్నారు.

"ఫిబ్రవరిలో రెండు డాక్యుమెంటరీ చిత్రాలు "రూట్స్" పరేలా రోడ్, విడుదల చేశారు. వ్యాపార వ్యాపారేతర సర్క్యూట్‌లలో వీటిని విడుదల చేయాలన్నారు. వీటిలో ప్రభుత్వ కార్యకలాపాలను గురించి గానీ ప్రభుత్వంలోని వ్యక్తుల గురించి గానీ ఏమీ లేదని, వివాదాస్పదమైన ప్రభుత్వేతర వ్యక్తులగురించి ప్రశంస ఉంది. (ఈవ్యక్తులకు తుర్క్‌మాన్ గేట్ ఘటనతో సంబంధం ఉంది.) కనుక ఎలాంటి సర్క్యూట్‌లో ప్రచారానికి పనికిరావని కార్యదర్శికి నేను చెప్పగా ఉపసంహరించారు.

ఢిల్లీలో ప్రతిపక్షాలసభ జరుగుతున్నపుడు టెలివిజన్ 'వక్త్' చిత్రానికి బదులు 'బాబీ' ప్రదర్శించడం గురించి ఇద్దరు అధికార్లు నా వద్ద ఆందోళన వెలిబుచ్చారు. ఈ నిర్ణయం మంత్రిత్వ స్థాయిలో తీసుకున్నది. గనుక మీ ఇద్దరికీ నష్టమేమీ లేదని చెప్పాను అని డాక్టర్ బాజీ అన్నారు.

ఎన్నికల సభలలో శ్రీమతి గాంధి ఫోటోలను ఎ ఐ సి సి కి పంపేందుకు ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోను వాడాలని తాను సూచించలేదని మాజీప్రధాని సమాచార సలహాదారు శ్రీ శారదా ప్రసాద్ చెప్పారు.

కాంగ్రెసుకు శ్రీ జగ్‌జీవన్‌రామ్ రాజీనామా చేసినపుడు దానిని "ఫిరాయింపు" అనాలని సమాచార మంత్రి వ్యంగ్యంగా చెప్పినట్లు సమాచార శాఖ మాజీ అడిషనల్ సెక్రటరీ శ్రీ కె. యస్. ప్రసాద్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో శ్రీమతి విజయలక్ష్మీ పండిట్ ప్రకటనను తాను ముందుగా పరిశీలించి పంపిన మాట వాస్తవమే నన్నారు.

రాయపూర్ నుండి లోకసభకు జరిగిన ఎన్నికలలో సమాచార మంత్రి శ్రీ శుక్లాపై పోటీ చేసిన శ్రీ పురుషోత్తమ కౌశిక్‌పై దాడి జరిగినపుడు ఆ వార్తను తొలగించాల్సిందిగా మంత్రి శుక్లా ఆదేశ మిచ్చారనీ, దానిని తాను తనిఖీ చేసినమాట నిజమే గాని ఎలాంటి ఉత్తర్వులు యివ్వలేదని చెప్పారు.

కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికను వివిధ భాషలలోకి తర్జుమా చేసేందుకు ఆకాశవాణి, డి. ఎ. వి. పి, సిబ్బందిని వాడారన్న ఆరోపణపై విచారణ అవసరమని వ్యక్తిగతంగా తాను భావించలేదన్నారు. వారితో అనువాదాలు చేయించిఉంటే అది నీతిబాహ్యమైన చర్య అన్నారు.

ఫిబ్రవరిలో సమాచార మంత్రిని కలుసు కోవడానికి వెళ్ళినప్పుడు కొన్ని పోస్టర్లను డి ఎ. వి. పి వారు డిజైన్ చేశారన్న భావమే తనకు కల్గలేదన్నారు.

సాగర్ ఆయకట్టుదార్లపై అశాస్త్రీయమైన అభివృద్ధి పన్ను రద్దుకై సంఘటిత పోరాటానికి సంసిద్ధంకండి!

నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణమునకు అయిన ఖర్చులను రాబట్టు కొనటానికి గాను సాగర్ ఆయకట్టుదారులపై 1386 వ ఫసలి లేక 1976 వ సంవత్సరం నుండి అభివృద్ధి పన్ను వసూలుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు నిర్ణయించి వసూళ్ళ నిమిత్తము రెవిన్యూ డిపార్టుమెంటు వారికి వుత్తర్వు లిచ్చారు. మన ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు యిచ్చిన అప్పు తీర్చడానికి ప్రపంచ బ్యాంకుయాజమాన్యంతో కుదుర్చుకున్న ఒప్పందంలో అభివృద్ధి పన్ను విధించుట ద్వారా రుణాన్ని తీర్చుటకుగా మహామీ యిచ్చారు

1976 వ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ ప్రాజెక్టుల (స్పెషల్ ల్యాండు టాక్సు) ఆక్టు ప్రకారము ప్రతి గ్రామము లోను నాగార్జున సాగర్ లేక మైనరు యిరిగేషను వర్కుల క్రింద [సాగరు ప్రాంతము లోని చెరువులు] సాగు చేయబడు మాగాణి మెట్ట భూములపై, ప్రభుత్వము వారు ఈ క్రింద కనబరచిన విధంగా స్పెషల్ ల్యాండ్ టాక్సు వసూలు చేయబడవలెనని వుత్తర్వులు యిచ్చియున్నారు.

అభివృద్ధి పన్ను – రేట్ల వివరములు

[illegible]	మెట్ట ఆయకట్టులో చేర్చబడిన భూములు యకరం 1 కి	మాగాణి ఆయకట్టులో చేర్చబడిన భూములు యకరం 1 కి.
	రు — పై	రు — పై.
1. రు. 1 00 లోపు	170 00	250 00
2 రు. 1.00పైన 1 50లోపు	200 00	300 00
3 రు 1.50పైన 2 00లోపు	230 00	350 00
4 రు. 2 00పైన 2 50లోపు	260 00	400 00
5 రు 2 50పైన 3 00లోపు	300-00	450 00
6 రు 3 00పైన	330 00	500 00

సాగర్ ప్రాంత చెరువుల క్రింద రిజిష్టరు మాగాణి భూములలో ఒకపంట పండించు భూములకు యకరం 1 కి రు. 100 00 రెండు పంటలు పండించుభూములకు ఎకరం 1 కి రు 150 00 లు అభివృద్ధి పన్ను వసూళ్ళకు నిర్ణయించారు.

అభివృద్ధి పన్ను మొత్తమును పది సంవత్సరములలో వసూలు చేయటానికి ప్రభుత్వము వారు నిర్ణయించారు అంటే సంవత్సరము 1 కి యకరం 1 కి ఆరుతడి భూములకు రు 17 లు మొదలుకొని రు 33 లు మాగాణి యకరం 1 కి రు 25 నుండి రు 50 వరకు చెల్లించవలసి యున్నది

సాగరు ఆయకట్టు దారులు శిస్తులు, సెస్సులు, నీటి తిరువాలు అన్నీ కలిసి యకరం 1 కి రు 60 లు చెల్లించుకొనుచున్నారు, ఇక నుండి రు 77 ల నుండి రు 93 ల వరకు చెల్లించుకొనవలసి యున్నది 1386 1387 ఫసలీలకు ఈ సంవత్సరము వసూలు చేయబడు అభివృద్ధిపన్ను ఆరుతడి భూములకు యకరం 1 కి రు 34లు నుండి రు 66లు వరకున్నూ మాగాణీ భూమియకరానికి, రు 50 00లు నుండి రు 100లు వరకు వసూలు చేయబడును

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణము ప్రభుత్వమువారి [illegible] ఇంజనీరింగు డిపార్టుమెంటు వారి అంతగొండి తనము, కాంట్రాక్టరుల మోసము ఫలితంగా ఎస్టిమేటు విలువ దానికి అదనంగా వందల కోట్లు రూపాయలు వెచ్చించవలసి వచ్చినది సేద్యపు నీరు అందించు కాలముగూడా సంవత్సరాలు తరబడి పెంచబడినది

వీటన్నింటిని తట్టుకొని రైతాంగము సాగుబడికి పూనుకుంటే ఎదురయిన చిక్కులు లెక్కకు మించినవి నిర్ణయించిన లోకలైజేషను కాలువల నిర్మాణము సరిలేనందున ఆరుతడి క్రింద ప్రకటించిన భూములు పూర్తిగా మెట్టపైరులు పండించ సాధ్యముగాని రైతాంగము మాగాణి సేద్యము చేసినందుకు విధించిన పెనాల్టీలు, ఆరుతడి భూములలో వరినాట్లు వేయవలెనని డిపార్టుమెంటు వారు నిరోధించినందున మెట్టపంటలు పండించను సాధ్యపడక పాడుపడిన భూములు నీరు అందని కాలువ చివరి భూములు నాట్లు పడక పాడుబడినవి. గుంటూరు జిల్లాలో డెబ్బది వేల ఎకరాలున్నట్లుగా అంచనాలు తెలుపుచున్నవి

సాగర్ ఆయకట్టు రైతాంగము ఆతరుణలో వచ్చిన సేద్యపు చిక్కులను తొలగించటానికిగాను రీ లోకలైజేషను చేయుమని సంవత్సరముల తరబడినుండి ప్రభుత్వమును కోరుచున్నారు. కాలువల చివరభూములకు నీరు అందించటానికి అవసరమైనచోట్ల కాలువలను మార్చమని (ఎలైన్‌మెంటు) కాలువల చివర అవసరమగు మేరకు జలాశయములను నిర్మించి సేద్యపు నీరు అందించమని రైతులు చేయుచున్న ఆందోళనలను విన లేని ప్రభుత్వము వారు ప్రపంచ బ్యాంకు అప్పు తీర్చగల స్తోమతుకు ఈ విధమైన

శ్రీ వాసిరెడ్డి మల్లిఖార్జునరావు

[ప్రధాన కార్యదర్శి, గుంటూరు జిల్లా రైతు సంఘం]

హామీ నిచ్చి, నాగార్జునసాగరు ఆయకట్టు దారుల గొంతు నులిమారు.

గత సంవత్సరము గాలి వాన తాకిడి నుండి కోలుకోలేని రైతాంగముపై అభివృద్ధి పన్ను విధించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారి వ్యాపారదృష్టిని నిశితముగా విమర్శించక తప్పని పరిస్థితులను ప్రభుత్వమువారే సృష్టించారు ఈ అభివృద్ధి పన్నును వసూలుచేయడి పది సంవత్సరములు రైతాంగము చెల్లించిన తదుపరి అప్పుడు పన్ను రద్దవునని గ్యారంటీ యేమిటి? ఉదాహరణకు డ్రైనేజి సెస్సు మొదట నిర్ణయించిన సంవత్సరములు నిండిన తదుపరి కూడా వసూలుచేయుచున్న ప్రభుత్వ విధానమును చూస్తున్న రైతాంగము ప్రభుత్వమిచ్చిన వుత్తర్వులో పది వాయిదాల వసూళ్ళతో ఆగుతుందని నమ్మజాలరు

నాగార్జున సాగరు ఆయకట్టు దారులపై అశాస్త్రీయంగా విధించిన అభివృద్ధి పన్నును రద్దు పరిపించుకోవటానికిగాను, సాగరు ఆయకట్టుదారులు సమరశీల పోరాటాలకు సిద్ధపడవల్సిందిగా కోరుచున్నాను.

రు. 2 లక్షల గంజాయి స్వాధీనం

విజయనగరం, అక్టోబర్ 28

విశాఖపట్నం జిల్లా పాడేరు గ్రామంవద్ద రు 2 లక్షల విలువ చేసే 5100 కిలోల, 180 బస్తాల గంజాయిని తీసుకెళ్తున్న రెండు లారీలను ఇటీవల పోలీసులు స్వాధీనపరచుకొన్నారు

ఇన్‌స్పెక్టర్ శ్రీ వై. నాగభూషణం, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ బి ఎస్. ఎన్. మూర్తిరాజు ఈ దాడికి నాయకత్వం వహించారు

ఈ సందర్భంగా అరెస్టు చేసిన 8 మంది వ్యక్తులను జ్యుడిషియల్ కస్టడీకి పంపారు.

ఈ లారీల వేబిల్లులో అరకు ఏజన్సీ ప్రాంతంనుండి హైద్రాబాద్‌కు 180 బస్తాల అమోనియా సల్ఫేటు తీసుకొని వెళుతున్నట్లుగా వ్రాయబడి వుంది

పాడేరు గ్రామం విజయనగరం రివెన్యూ డివిజన్‌కు చెందింది గనుక, ఆ లారీలను విజయనగరం సబ్‌కలెక్టరుకుస్వాధీనపరిచారు.

పాస్‌పోర్టు దరఖాస్తులపై సంతకాలలో రికార్డు

హైద్రాబాదు అక్టోబర్ 28

పాస్‌పోర్టులకై పంపే దరఖాస్తులపై సంతకాలు చేయడంలో పార్లమెంటుసభ్యులు శ్రీ యం యం హషీం రికార్డు స్థాపించారు.

ఆయన ఇంతవరకు 80/5 దరఖాస్తులపై సంతకాలు చేశారు.

రు. 10,000/- విలువైన బహుమతులు గెలవండి (ఉచిత ఎంట్రీ)

రు 10,000/, టెలివిజన్, స్కూటర్, ట్రాన్సిస్టర్, అందమైనచీరలు, వాచి, కెమేరా మొదలగు బహుమతులుగెలవండి ఇది కేవలం పాప్యులారిటీకోసం.

ప్రశ్న : ఈ ఖాళీ గడులు 9 (తొమ్మిది) నుండి 17 (పదునేడు) వరకు అంకెలు ఉపయోగించి ఏటుకూడినా మొత్తం 39 ముప్పది తొమ్మిది వచ్చునట్లు పూర్తి చేయాలి

ముగింపు తేదీ : 20-11-77

సమాధానం మీ సమాధానం కాగితంపై ఇంగ్లీషు లేక హిందీలో వ్రాసి పూర్తి చిరునామా పిన్ కోడ్ నెంబరుతో పంపాలి ఒక కుటుంబంనుండి ఒక సమాధానం అంగీకరించబడును. ఒక్కొక్క పోటీదారు నియమ నిబంధనల ప్రకారం బహుమతులు పొందుతారు ప్రమోటర్ల నిర్ణయమే చివరిది కట్టుబడ్డమైనది డిస్ప్యూట్‌లు సంస్థలోనే తేల్చబడును మొదట చేరిన ఎంట్రీకి రు. 100/- లు అదనం ఉచిత ఫలితాలకు అడగండి.

The Advertisement Manager,
BRISTOL SALES
2699, Churiwalan, Delhi-6

చక్కెర ద్వంద్వ ధరల విధానం కొనసాగింపు

కేంద్రప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబరు 27

1977–78 సంవత్సరానికి సంబంధించి ప్రస్తుత పంచదార ద్వంద్వ ధరల విధానాన్ని కొనసాగించాలని, అలాగే లెవీ పంచదార ధరలో కూడా మార్పు లేకుండా కొనసాగించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది.

ప్రస్తుత సీజన్‌లో [illegible] చెరకు కనీస ధర క్వింటాల్ రు. 8–50 వుండాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. 8.5 శాతం దిగుబడి ఆధారంగా యిది నిర్ణయించబడింది. గత సంవత్సరంలో యిదేవిధంగా నిర్ణయించారు. చెరకు ఉత్పత్తిదారులకు గత సంవత్సరం చెల్లించిన ధరనే చెల్లిస్తారు.

నెలకు మనిషికి 450 గ్రాముల కన్నా తక్కువ కేటాయించిన రాష్ట్రాలలో అదనపు ప్రాతిపదికపై లెవీపంచదారపంపిణీ చేయాలని కేటాయింపు ఈ స్థాయికి పెంపు చేయడానికి కృషి చేయాలని కూడా మంత్రివర్గం నిర్ణయించింది. లెవీ పంచదార పంపిణీ విషయంలో పట్టణ గ్రామీణ జనాభా ఒకే ప్రాతిపదికపై చూడాలని రాష్ట్రాలకు సూచన లివ్వడం జరుగుతోంది.

కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ యస్. యస్. బర్నాలా పత్రికల వారితో మాట్లాడుతూ, ఈ సంవత్సరానికి సంబంధించిన చక్కెర విధానాన్ని చెరకు ఉత్పత్తిదారుల, వినియోగదారుల, పంచదార మిల్లుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు

లెవీ పంచదార, స్వేచ్ఛా మార్కెట్ పంచదార దామాషా 65:35 నిష్పత్తిలో కొనసాగుతుందని ఆయన తెలిపారు.

ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, 1977–78 లో పంచదార ఉత్పత్తి 52 లక్షల టన్నుల వుంటుందని భావిస్తున్నట్లు శ్రీ బర్నాలా పేర్కొన్నారు.

ప్రస్తుత విధానం వల్ల గ్రామీణప్రాంతాలకు ఎక్కువ పంచదార చేరుతుందని, ఫలితంగా పంచదార వినియోగం పెరిగే అవకాశ మున్నదన్నారు.

ఎగుమతి అవకాశాల గురించి ప్రశ్నించగా, ఎగుమతికి ప్రస్తుతం 7 లక్షల టన్నుల కోటావుందని, సాధ్యమైనంత త్వరలో ఎగుమతి చేయడానికి ప్రయత్నిస్తామని ఆయన తెలిపారు.

మిల్లులకు మరిన్ని వసతి సౌకర్యాలు

పెద్దయెత్తున పంచదార నిల్వలు వున్న దృష్ట్యా మరిన్ని వసతి సౌకర్యాలు కల్పించాలని పంచదార మిలులు చేస్తున్నడిమాండ్ ను పరిశీలించడం జరుగుతుందని ప్రస్తుతము మిల్లులవద్ద పంచదార అత్యవసర నిల్వలు 16 లక్షల టన్నుల పైగా వున్నాయని శ్రీ బర్నాలా తెలిపారు.

వచ్చే ఐదేళ్లలో 50శాతం బ్లాకుల్లో పూర్తి ఉపాధికల్పన

మంత్రి శ్రీ బర్నాలా వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 27

వచ్చే 5 సంవత్సరాలలో దేశంలోని దాదాపు 50 శాతం అభివృద్ధి బ్లాకులలో పూర్తి ఉపాధి కల్పించాలని ప్రతిపాదించడం జరిగిందని కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ యస్ యస్ బర్నాలా నేడిక్కడ తెలిపారు.

చిన్న స్థాయి ప్రణాళిక ద్వారా యీ లక్ష్యాన్ని సాధించదలచుకున్నట్లు ఆయన చెప్పారు. వ్యవసాయం, నీటిపారుదల తదితర అనుబంధ కార్యకలాపాల అభివృద్ధి ద్వారా ప్రభుత్వం ఉపాధి కల్పన పథకం ప్రస్తుతం రూపొందిస్తున్నదని ఆయన అన్నారు.

“ఉపాధి అవకాశాల కల్పనకు వ్యూహం” అన్న అంశంపై, సదస్సును ప్రారంభోత్సవం చేస్తూ, 1978 – 79 లో దాదాపు 300 బ్లాకులలో పూర్తి ఉపాధి కల్పించాలని లక్ష్యం పెట్టడం జరిగిందని ఇందుకోసం చేయాల్సింది చాలా వుందని బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల సంఖ్యను గుర్తించిన అనంతరం కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుందని శ్రీ బర్నాలా తెలిపారు.

10 సంవత్సరాలలో నిరుద్యోగాన్ని నిర్మూలించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ, అభివృద్ధి ప్రణాళికలో ఇంతకు ముందు ప్రాధాన్యతలను పునర్వ్యవస్థీకరించి వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత యివ్వటం జరిగిందని ఆయన అన్నారు.

సమగ్ర గ్రామీణాభివృద్ధి నూతన కార్యక్రమం సందర్భంగా గత అనుభవాలను దృష్టికి తీసుకొనడం జరిగిందని గ్రామీణ ప్రాంతాలలో దారిద్ర్యం, నిరుద్యోగం సమస్యలు తాత్కాలిక కార్యక్రమాల ద్వారా పరిష్కారం కాబోవన్న విషయాన్ని గత అనుభవాలు తెలిపాయని ఆయన తెలిపారు.

మద్రాసుకు కృష్ణా జలాలపై ఒప్పందం

న్యూఢిల్లీ, అక్టోబరు 27

మద్రాసు నగరానికి మంచినీటి అవసరాలు తీర్చే నిమిత్తం కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి నేడిక్కడ ఒక ఒప్పందం కుదిరింది.

శ్రీశైలం రిజర్వాయర్ నుండి ఉత్తర పెన్నారుకు కాలువలు త్రవ్వి అక్కడినుండి ప్రస్తుతం నిర్మిస్తున్న సోమశిల రిజర్వాయర్ ద్వారా నీరు మళ్ళించాలని ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలు అంగీకరించాయి.

కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ యస్. యస్. బర్నాలా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పై ఒప్పందం కుదిరింది కృష్ణా జలాలను మద్రాసు నగరానికి తీసుకువెళ్ళే సమస్య 1976 ఫిబ్రవరి నుండి అపరిష్కృతంగా వుండిపోయింది. ఈ ఒప్పందంతో అది పరిష్కరించబడింది.

ఈ సమావేశంలో తమిళనాడు మహారాష్ట్ర, కర్నాటక ముఖ్యమంత్రులు శ్రీయుతులు యం. జి. రామచంద్రన్, వసంత రావు పాటిల్, దేవరాజ్ అర్స్‌లు. ఆంధ్ర ప్రదేశ్ మధ్యతరహా నీటిపారుదలశాఖమంత్రి శ్రీ కృష్ణమూర్తి నాయుడు పాల్గొన్నారు

పై మార్గంలో నీరును సాగునీరుకు ఉపయోగించుకో కూడదని ఆ రాష్ట్రాలు అంగీకరించాయి

శ్రీమతి గాంధీ పర్యటన సందర్భంగా నల్ల జెండాల ప్రదర్శన

డి. యం. కె. నిర్ణయం

మద్రాసు అక్టోబరు 27

1976 జనవరిలో డియంకె ప్రభుత్వాన్ని “రాజ్యాంగ విరుద్ధంగాను, ప్రజాతంత్ర విరుద్ధంగాను” రద్దు పరచినందుకు నిరసనగా అక్టోబరు 29 30 తేదీలలో తమిళనాడులో శ్రీమతి ఇందిరాగాంధీ పర్యటన సందర్భంగా డి.యం.కె. పార్టీ నల్లజెండాల ప్రదర్శనలు జరపాలని నిర్ణయించింది.

డి యం కె. కేంద్ర కార్యవర్గం నేడిక్కడ సమావేశమై పై నిర్ణయం చేసింది.

మీసా, తదుపరి కేసుల క్రింద వేలాది డి.యం.కె. కార్యకర్తల అరెస్టుకు శ్రీమతి గాంధీ కూడా బాధ్యురాలని, తమ పార్టీ పక్షంపై విచారణ కమిషన్‌ను, నియమించిందని ఆ పార్టీ అధ్యక్షుడు శ్రీ యం కరుణానిధి సమావేశం అనంతరం పత్రికల వారితో చెప్పారు.

మొరార్జీ ప్రకటనపై శ్రీమతి గాంధీ వివరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 27

కాంగ్రెసు, సిండికేట్ కాంగ్రెసులు చీలవలసి రావటంపై ప్రధానమంత్రి శ్రీ మొరార్జీదేశాయ్‌తో జరిపిన చర్చలపై మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ వివరణ యిస్తూ ఆ విషయాన్ని [illegible] ఒకప్రత్యేక సందర్భంలో తాను చెప్పానని అన్నారు.

“రెండు పార్టీలు విలీనమవటంపై కొంతమంది సిండికేట్ వాదులు మాట్లాడటం ప్రారంభించారు ఇందుకు నేను అడ్డంకి వున్నాననే అభిప్రాయాన్ని కల్పించటం జరిగింది. ఈ సందర్భంగానే శ్రీ దేశాయ్‌ని కలుసుకున్నప్పుడు అడ్డుగా వుండననే వ్యాఖ్య చేశాను” అని శ్రీమతి గాంధి అన్నారు.

ఆస్ట్రేలియాలో సార్వత్రిక ఎన్నికలు

కాన్‌బెర్రా, అక్టోబరు 27

ఆస్ట్రేలియాలో సార్వత్రిక ఎన్నికలు డిసెంబరు 10 వ తేదీన జరుగుతాయని ప్రధానమంత్రి ఫ్రేజర్ నేడు ప్రకటించారు.

గత ఐదు సంవత్సరాల కాలంలో ఆస్ట్రేలియాలో సార్వత్రిక ఎన్నికలు జరగటం ఇది నాలుగవసారి కాగలదు.

సుఖ రోగులకు శుభవార్త

న్యూఢిల్లీ, అక్టోబరు 27

సుఖ రోగాలతో బాధపడే వారు ప్రధాని మొరార్జీ మాదిరిగా తమ మూత్రాన్ని సేవిస్తే మంచి జరుగుతుందా? మొదటికే మోసం వస్తుందా?

ఈ చిక్కు ప్రశ్న నేటి ఉదయం మొరార్జీ పత్రికా గోష్టిలో కలకలాన్ని సృష్టించింది.

తీవ్రమైన ఈ ప్రశ్నను ఒక విలేకరి అవహేళన ధోరణిలో చూస్తున్నాడని ప్రధాని వ్యాఖ్యానించారు తాను చెప్పేదేదో చెప్పనివ్వాలని ఆ విలేకరి పట్టు బట్టారు. మిగతా విలేకరులంతా అతనిని [illegible] సమయంవృథాచేయకూడదని చెప్పారు.

ఇంతలో మొరార్జీ జోక్యం చేసుకుని ఆ విలేకరిని ప్రశ్న వేసేందుకు అను మతించాలని సమాధానం చెప్పే శక్తి తనకున్నదని అన్నాడు.

ఆ విలేకరి లేచి తాను హాస్యానికి ఈ ప్రశ్న వేయడం లేదనీ, సుఖ రోగులు స్వీయ మూత్రపానంచేస్తే చాలా ప్రమాదం జరగవచ్చుననీ చెప్పారు.

తనను పొరపాటుగా ఉటంకించడం జరిగిందని మొరార్జీ అన్నారు. టి బి. రోగుల విషయంలో స్వీయ మూత్ర పానం మంచిదని మాత్రమే తాను చెప్పానన్నారు. మీకు అంత ఆసక్తిగా ఉన్న పక్షంలో సుఖ రోగులకు కూడా ఇది బాగా పని చేస్తుందని చెప్పగలను. అయితే దీనిపై విశ్వాసం ఉండాలి అన్నారు.

తాజా అఫిడవిట్ దాఖలుకై శ్రీమతి గాంధీకి ఆదేశం

అలహాబాద్ హైకోర్టుచే

అలహాబాద్ అక్టోబరు 27

కోర్టు ధిక్కారణపై పెట్టిన కేసుకు సంబంధించి శ్రీమతి గాంధీ దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ సరిగాలేదని తాజా అఫిడవిట్‌పై ప్రతి పేజీలో సంతకం, పబ్లిక్ నోటరీ (కోర్టు అధికారి) ముద్రవేసి తిరిగి కోర్టుకు సమర్పించాలని అలహాబాద్ హైకోర్టు నేడు శ్రీమతి గాంధీని ఆదేశించింది.

ఈ కేసు విచారణకు వచ్చే ముందుగానే తాజా అఫిడవిట్‌ను దాఖలు చెయ్యాలని హైకోర్టు ఆదేశించింది.

జస్టిస్ పి. యస్. పి. సింగ్ జస్టిస్ బి. ఎన్. సాప్రులు ఆదేశాలిస్తూ అక్టోబరు 24 న శ్రీమతి ఇందిరాగాంధి న్యూఢిల్లీలో పబ్లిక్ నోటరీతో అఫిడవిట్‌ను దాఖలు చేశారు. దానిపై చివరిపేజీలో మాత్రమే ఆమె సంతకం వుంది.

అఫిడవిట్లకు సంబంధించి ప్రతి పేజీలో సంతకాలు, పబ్లిక్ నోటరీ ముద్ర వుండాలని జడ్జీలు చెప్పారు.

రాజమండ్రిలో టెలెక్స్ ఎక్స్చేంజ్

రాజమండ్రి అక్టోబరు 27

రాజమండ్రిలో గత సాయంత్రం టెలెక్స్ ఎక్స్చేంజ్‌కు స్థానిక తెలుగు దినపత్రిక “సమాచారం” సంపాదకులు శ్రీ టి యస్ ఆర్. ఆంజనేయులు ప్రారంభోత్సవం చేశారు.

ఈ ఎక్స్చేంజ్ 9 వర్కింగ్ కనెక్షన్లతో ప్రారంభమైంది.

శ్రీ బ్రహ్మానందరెడ్డిని తొలగించే రిక్విజిషనిస్టుల యత్నం విరమణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 27

కాంగ్రెసుపార్టీ అధ్యక్షులు శ్రీ బ్రహ్మానందరెడ్డిని తొలగించేందుకు శ్రీమతి ఇందిరా గాంధీ అనుయాయులు ప్రారంభించిన రిక్విజిషన్‌యత్నాన్ని ప్రస్తుతానికి విరమించుకున్నట్లు నేటిరాత్రి తెలియ వచ్చింది.

శ్రీమతి గాంధియే యీ రోజు సాయంత్రము హడావుడిగా ఏర్పాటుచేసిన పత్రికా గోష్టిలో మాట్లాడుతూ రిక్విజిషన్ యత్నాలతో తనకేమి సంబంధం లేదని తెలియ చేశారు.

రిక్విజిషన్ యత్నాన్ని ప్రారంభించిన వారి వుద్దేశ్యం ప్రజాతంత్ర పద్ధతిలో అభిప్రాయాలను వ్యక్తీకరించటమేనని అన్నారు

అంతకుముందు శ్రీ బ్రహ్మానందరెడ్డి మరో పత్రికా గోష్టిలో మాట్లాడుతూ రిక్విజిషన్ యత్నాన్ని ఉపసంహరించుకోవటమో లేకవదిలివేయటమో జరుగుతుందని శ్రీ చవాన్‌కు శ్రీమతి గాంధి తెలియచేశారని అన్నారు. శ్రీమతి గాంధిని కలుసుకుని వచ్చిన శ్రీ చవాన్ యీ విషయాన్ని తనతో చెప్పారని ఆయనన్నారు.

కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ బ్రహ్మానందరెడ్డిని తొలగించి ఆ స్థానంలో శ్రీమతి గాంధిని కూర్చోబెట్టేందుకు ఆమె అనుయాయులు ఎ. ఐ. సి. సి. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేందుకు రిక్విజిషన్ నోటీసుపై సంతకాలు సేకరించిన విషయం పాఠకులకు విదితమే.

పత్రికాగోష్టిలో శ్రీమతి గాంధి విడుదల చేసిన ప్రకటనలో ఇలా పేర్కొన్నారు.

రిక్విజిషన్ యత్నాన్ని ప్రారంభించిన వారికి ఇంకా అనేకమందికి యితరుల భావాలను దెబ్బ తీయాలనే ఉద్దేశం లేశ మాత్రమైన లేదని నాకు తెలుసును. అంతేకాక కాంగ్రెసు అధ్యక్ష పదవికి సంబంధించిన ఆశలు లేక బెదిరింపులు లేక సవాళ్లు చేయాలనే వుద్దేశ్యం కూడ వారికి లేదు. వారి ఉద్దేశమేమిటంటే ప్రజాతంత్ర పద్ధతిలో తమ అభిప్రాయను వ్యక్తంచేయాలని మాత్రమే.

చీలికగురించి మాట్లాడటమంటే అదికావాలని చేస్తున్న విష ప్రచారం మాత్రమే. నేను ఎల్లప్పుడు ఐక్యత కొరకే నిలబడినదానను. ఇకముందుకూడా అలాగేచేస్తాను. ఈనాడు కాంగ్రెసులో అందరు సవాళ్లను ఎదుర్కొంటున్నారు అనేక సంవత్సరాల పాటు కాంగ్రెసు కట్టుబడివున్న మౌలిక విలువలపై ఈనాడు దాడి జరుగుతున్నది.

ఐక్యతకు నిర్మాణ పరమైన ఏర్పాట్లు

న్యూఢిల్లీ అక్టోబరు 27

కాంగ్రెసులో ఐక్యతకు నిర్మాణపరమైన చర్యలు తీసుకునేముందు రిక్విజిషన్ యత్నాన్ని లాంఛనప్రాయంగా విరమించుకోవటం కొరకు కాంగ్రెసు అధిష్టానవర్గం ఎదురు చూస్తున్నది.

కాంగ్రెసు పాలన క్రింద వున్న రాష్ట్రాలలో జరుగనున్న శాసనసభ ఎన్నికలను, జనతాపార్టీ దాడిని ఎదుర్కొనేందుకు పార్టీ ఐక్యంగా వుండాలని భావించటం జరిగింది.

శ్రీమతి ఇందిరాగాంధిని కాంగ్రెసు అధ్యక్షురాలుగా చేయాలనే ముమ్మరయత్నాల ఫలితంగా ఏర్పడిన విభేదాల పరిష్కారానికి తొలి చర్యగా శ్రీమతి గాంధియే ఒక ప్రకటన చేస్తూ అధ్యక్ష పదవిని సంపాదించటం లేక బ్రహ్మానందరెడ్డిని అవమానించటం తన అనుచరుల అభిమతం కాదని పేర్కొన్నారు.

తనతో చర్చల సందర్భంగా కాంగ్రెసు, సిండికేట్ కాంగ్రెసుల విలీన సమస్యను శ్రీమతి గాంధీ ప్రస్తావించారని ప్రధానమంత్రి శ్రీ మొరార్జీ దేశాయ్ వెల్లడి చేసిన “బాంబు”వంటి వార్త యీ రోజు మధ్యాహ్నం ప్రారంభమైన “శాంతి” చర్చలపై గణనీయమైన ప్రభావాన్ని కలుగ చేసిందని పార్టీ వర్గాలు తెలిపాయి.

విజయవంతమైనపుదుచ్చేరిబంద్ : ప్రజాజీవనం పూర్తిగా స్తంభన

జౌళికార్మికుల సమన్వయ సంఘం పిలుపు మేరకు

పుదుచ్చేరి అక్టోబరు 27

బోనస్‌తో సహా జౌళి కార్మికుల కోర్కెలను బలపరుస్తూ వివిధ జౌళి కార్మికుల ట్రేడ్ యూనియన్ల సమన్వయ కమిటీ పిలుపు మేరకు పుదుచ్చేరి పట్టణంలో ఒక రోజు బంద్ జరపడంతో ప్రజా జీవితం పూర్తిగా స్తంభించి పోయింది.

పట్టణంలోని వివిధ వాణిజ్య సంస్థలు, హోటళ్లు, షాపులు పూర్తిగా మూసివేయబడ్డాయి. బస్సులు, టాక్సీలు, ఆటో రిక్షాలు పూర్తిగా నిలిపివేయబడ్డాయి. పట్టణంలో వర్షాలు కురుస్తున్నందువల్ల, కళాశాల విద్యార్థుల తక్కువగా హాజరవు తున్నందున, పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు.

బ్యాంకులను తెరిచివుంచారు కాని, డబ్బు లావాదేవీలు పూర్తిగానిలిచిపోయాయి. బంద్ శాంతియుతంగా జరిగింది. ఇతరులకు అభ్యంతరం కలగచేసేందుకు ప్రయత్నించినందున 62 మంది వ్యక్తులను కస్టడీలోకి తీసుకున్నారు.

బంద్ శాంతియుతంగా జరిగినట్లు పోలీసులు తెలియచేశారు.

పుదుచ్చేరి – మద్రాసు ఎక్స్‌ప్రెస్ స్టేషన్ విడిచిపెట్టి వెళ్ళకుండా నిరోధించేందుకై ప్రయత్నించినట్లు ఆరోపించారు ఈ సందర్భంగా 30 మందిని కస్టడీలోకి తీసుకున్నారు.

విద్యుదీకరణకు కృష్ణా జిల్లాలో 25గ్రామాలఎంపిక

మచిలీపట్నం, అక్టోబరు 27

1977 – 78 సంవత్సరంలో రాష్ట్రంలో ప్రత్యేక గ్రామీణ విద్యుద్దీకరణ కార్యక్రమం క్రింద రాష్ట్ర విద్యుత్‌బోర్డు కృష్ణాజిల్లాలో 25 గ్రామాలను ఎంపిక చేసింది.

రాష్ట్రంలోని 630 గ్రామాలలో 555 గ్రామాలను మొదటి దశలో విద్యుదీకరించడం జరుగుతుందని అధికార పత్రికా ప్రకటన తెలిపింది.

కర్నాటకలో 7గురు ముఖ్యమంత్రులు ?

బెంగుళూరు, అక్టోబరు 27

కర్నాటకను ప్రస్తుతం 7 గురు ముఖ్యమంత్రులు పరిపాలిస్తున్నారని కె. పి. సి. సి. ప్రధాన కార్యదర్శి, శ్రీ అర్స్ మంత్రివర్గంలో మాజీ స్టేట్ మంత్రి అయిన శ్రీ హెచ్. యన్. నంజెగౌడ ఆరోపించారు.

ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ్ అర్స్ నెలకు 4 వేలకు పైగా పైళ్లు పరిశీలించాల్సి వుందని, రాజధానిలో వారం రోజులుకూడా వుండనందున ఆయన వాటిని పరిశీలించడం జరగదని ఆయన అన్నారు.

ముఖ్యమంత్రి కార్యదర్శి శ్రీ జె సి లిన్, రాజకీయ కార్యదర్శి శ్రీ కె హెచ్. శ్రీనివాస, హోం ఆఫీసు స్పెషల్ ఆఫీసర్ శ్రీ సచ్చిదానందస్వామి, ఆన్ డ్యూటీ స్పెషల్ ఆఫీసరు శ్రీ మొయినుద్దీన్, ప్రయివేట్ కార్యదర్శి శ్రీ గోపాలరావు, స్టెనో గ్రాఫర్ శ్రీ రాజా వీరే వాస్తవంగా ఆర్డర్లు పాస్ చేస్తారని, వాటిపై ముఖ్యమంత్రి సంతకాలు చేయడం మామూలైందని ఆయన ఆరోపించారు.

మామతో సహా నలుగురిని హత్యచేసిన అల్లుడు

బెల్గాం, అక్టోబరు 27

తన వెంట తన భార్యను పంపని నేరానికి మామతో సహా నలుగురిని బలిగొన్న అల్లుని కథ ఒకటి యిక్కడికి తెలియ వచ్చింది.

ఇక్కడినుండి 65 కిలోమీటర్లదూరంలో గల [illegible] గ్రామంలో కూతురును భర్త వెంటపంపడానికి తండ్రి తిరస్కరించిన ఫలితంగా నలుగురి హత్యకు దారితీసింది.

మామ అయిన శ్రీ గోవిందప్ప తన కూతురును అల్లుడు హనమంతప్ప వెంట పంపడానికి నిరాకరించాడని, రెచ్చిపోయిన హనుమంతప్ప ఆరోజురాత్రి మామ ఇంటికి వచ్చి గాఢ నిద్రలోవున్న మామను, అత్తను, భార్యను, బావమరిదిని హత్యచేసి, పారిపోయాడని పోలీసులు తెలిపారు.

శ్రీమతిగాంధీపై రివిజన్‌పిటిషన్‌విచారణ వాయిదాకు ఢిల్లీ హైకోర్టు తిరస్కృతి

న్యూఢిల్లీ అక్టోబరు 27

మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని అక్టోబరు 4 న విడుదలచేస్తూ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు యిచ్చిన ఉత్తరువుపై దాఖలు చేసిన రివిజన్ పిటిషన్ పైవిచారణ వాయిదా వెయ్యవలసిందిగా కోరుతూ దాఖలుచేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు నేడు కొట్టివేసింది.

పిటిషనరు తరఫు న్యాయవాది శ్రీ గిరీష్ చంద్రా సుమారు 30 నిమిషాలసేపు చేసిన వాదనను విన్న తర్వాత, న్యాయమూర్తి శ్రీ వి. డి. మిశ్రా పిటిషన్‌ను నేడు కొట్టివేశారు. న్యాయమూర్తి మిశ్రా అక్టోబరు 7 న ప్రభుత్వ రివిజన్ పిటిషన్‌పై నోటీసు జారీ చేశారు.

శ్రీమతి ఇందిరా గాంధీని భారత ప్రభుత్వం అరెస్టు చెయ్యకుండా నిరోధించవలసిందిగాను, ఆ విధంగా ఆమెకు స్వేచ్ఛ కల్పించి, రాయబరేలి నియోజక వర్గం నుండి కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ రాజ్‌నారాయణ ఎన్నికను సవాలుచేస్తూ డాక్టర్ జైన్ దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై కేసు నిర్వహణకు అవకాశం యివ్వవలసిందిగాను, పిటిషనర్ డాక్టర్ పి. నల్లతంబిజైన్ తన పిటిషన్‌లో కోరినారు. శ్రీమతి గాంధీతో జైన్, శ్రీ రాజ్‌నారాయణ, మరో ఎనిమిది మంది ఆనియోజక వర్గంనుండి మార్చిలోక్‌సభ ఎన్నికలలో పోటీ చేశారు.

న్యాయమూర్తి మిశ్రా తన ఉత్తర్వులో ఎట్టి కారణాలు తెలియ చేయకపోయినా, ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చెయ్యటానికి గల ప్రాతిపాదికను ప్రశ్నించారు.

ఢిల్లీ, అలహాబాదులలో దాఖలు చేసిన పిటిషన్లలోని అంశాలు ఒకే విధమైనవని, ఢిల్లీ హైకోర్టు యిచ్చే ఏ నిర్ణయమైన, తన కేసుపై ప్రభావం కలుగచేస్తుందని పిటిషనరు తరఫు న్యాయవాది తెలియజేశారు.

1954 లో సుప్రీంకోర్టు ఒక కేసులో తీర్పు యిచ్చిందనీ, ఒకే ఒక కేసుపై రెండు తరహాలుగా కార్యకలాపాలు వుండవచ్చనని, రెండు కోర్టులు పరస్పర విరుద్ధ నిర్ణయాలు ప్రకటించవచ్చునని న్యాయమూర్తి చెప్పారు.

ఒక కోర్టు చేసిన నిర్ణయానికి మరొక కోర్టు కట్టుబడి వుండవలసిన అవసరం లేకుండా విరోధిస్తుందని సుప్రీంకోర్టు అభిప్రాయంగా తెలిపారు.

ఒక కోర్టు అనుసరించిన పద్ధతులను ఒక సాక్షి విశ్వసించి నప్పటికీ, మరొక కోర్టు అనుసరించిన పద్ధతులను కూడా అతడు విశ్వసించాలనడం అర్థం లేదని న్యాయమూర్తి మిశ్రా తెలిపారు.

న్యాయమూర్తులు మోటారు వాహనం ప్రమాదానికి సంబంధించిన ఒకతీర్పునిచ్చిన కేసును ఉదాహరణగా చెప్పి, ఆ ఘటనపై డ్రైవరుపై పోలీసులు క్రిమినల్ కేసు, ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు నష్ట పరిహారం కోసం సివిల్ కేసు పెడతారనీ, ఆ కేసులో డ్రైవరుకు శిక్ష విధించినా, నష్ట పరిహారం యిచ్చేందుకు ఆ శిక్ష బలమైన కారణం కానక్కరలేదనీ, సివిల్ కేసు విచారణలో కోర్టు స్వంత సాక్ష్యాన్ని పరిశీలించవలసి వుంటుందని చెప్పారు.

కేవలం ఊహాపోహలవల్ల అలహాబాదు ఎన్నికల పిటిషన్‌లో కోర్టు కార్యకలాపాలు పిటిషనరుకు ప్రయోజనకారిగా వుండవని, అయినప్పటికీ, అలహాబాదు, ఢిల్లీ కేసులు ప్రాథమిక దశలో వున్నాయని అన్నారు.

శ్రీమతి గాంధీకి వ్యతిరేకంగా దాఖలు చేసిన తొలి సమాచార పత్రాలలోని వాస్తవ అంశాలు వేనిపైనా ఆధారపడి తీర్పుచెప్పేది లేదనీ, చట్టానికి సంబంధించిన అంశాలపైనే ఆధారపడతానని చెప్పారు

ఏమైనప్పటికి ఢిల్లీలో విచారణయింకా ప్రారంభం కాలేదనీ, హైకోర్టుఎదుటవున్న రివిజన్ పిటిషన్ కోర్టు వ్యవహారాలలో అదొక పద్ధతి మాత్రమేననీ న్యాయమూర్తి తెలియ జేశారు.

షా కమిషన్‌కు శ్రీమతి గాంధీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 27

నవంబర్ 7, 8 తేదీలు మినహా మరో యితర తేదీలలో విచారణకు హాజరయ్యేందుకు అవకాశం కల్పించవలసిందిగా మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ అత్యాచారాలను విచారిస్తున్న షా కమిషన్ ను కోరారు.

నవంబరు 7, 8 తేదీలలో విచారణకు హాజరు కావాలని శ్రీమతి ఇందిరా గాంధీని షా కమిషన్ కోరింది.

ఇట్యాలలో రాజయ్య ఇంటిపై దాడి

కాగజ్‌నగర్, అక్టోబరు 28

ఆదిలాబాద్ జిల్లా ఇట్యాలగ్రామంలో ఈ నెల 19 వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో అగ్రవర్ణాలకు చెందిన కొందరు రౌడీలను వెంట పెట్టుకొని బలహీన వర్గాలకుచెందిన సందెల రాజయ్య ఇంటిపై దాడి చేశారు.

రాజయ్యకు బలమైన గాయాలు తగిలాయి. అతని పరిస్థితి ప్రమాదకరంగా వుంది.

సందెల సత్తెయ్యకు, సందెల చంద్రమ్మకు తలలపై గొడ్డలి దెబ్బలు తగిలి స్పృహతప్పి పడిపోయారు.

తీవ్రంగా గాయపడిన ఆ ముగ్గురిని కాగజ్‌నగరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకుపోగా, ప్రమాదకర పరిస్థితిలో వున్న రాజయ్యను ఆసిఫాబాద్ ఆస్పత్రికి పంపారు. మిగిలిన యిద్దరినీకూడా ఆస్పత్రిలో వుంచారు. సందెల చంద్రమ్మ 15 రోజుల క్రితమే కవలపిల్లలు పుట్టి చనిపోగా పురిటి దుఃఖంలో వున్న పచ్చిబాలింత.

ఈ ఘటనపై గ్రామ్యప్రజలు తీవ్రనిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు పూర్వంకూడా యీ పెత్తందార్లు అనేకమందిపై దాడులు చేశారు.

ఇంతవరకు ఎవరినీ పోలీసులు అరెస్టు చేయలేదు.

తక్షణమే పోలీసు అధికార్లు జోక్యం చేసుకొని యీ దారుణమైన దాడికి కారకులైన వారిని అరెస్టు చేయాల్సిందిగా కమ్యూనిస్టుపార్టీ, యువజనసంఘం కోరుతున్నాయి.

చిత్తూరు జిల్లాలో భారీ వర్షాలు

తిరుపతి, అక్టోబరు 27

చిత్తూరు జిల్లాలో గత 11 రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షము పడుతూనేవున్నవి. తిరుపతి పట్టణంలో నిరంతర వర్షమువలన మామూలు పనులన్నింటికి అంతరాయం కలిగినది. ప్రతి నిత్యం కూలి [illegible] వేలాది మంది పేదలు దాదాపు పస్తు లుంటున్నారు. మట్టి గోడలతో ఉన్న చాల పూరిండ్లు [illegible]నగర్, అశోక నగర్, పల్లెవీధులలో కూలిపోయాయి.

పట్టణములో 5000 పైగా పాడి పశువులున్నాయి. వర్షము, చలిగాలివలన దూడలు జాస్తిగా చనిపోతున్నాయి. ప్రతి నిత్యం చుట్టూ పల్లెలనుంచి వస్తున్న ఎండు గడ్డి రానందున గతములో 25 పైసలు అమ్మిన పశుగ్రాసం కట్ట ప్రస్తుతం 90 పైసలు అమ్ముతున్నది. అదీ దొరకటం కూడా దుర్లభముగా వున్నది పశువులకు వేస్తున్న తవుడు మూట రూ 7 నుంచి రూ 15 లకు పెరిగింది, వర్షపు మేఘాలు దట్టముగా వుండి యింకా వర్షిస్తున్నందున పశువులు ఎక్కువ సంఖ్యలో చనిపోయేట్లున్నాయి. పట్టణమున పలు షాపులలో దొంగతనాలు ప్రారంభమైనాయి.

ప్రభుత్వం పశుగ్రాసాన్ని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని పశువుల యజమానులు కోరుతున్నారు. (వి వి.)

వరంగల్‌లోయువజనవిద్యార్థులపై లాఠీఛార్జి ; 40 మంది అరెస్టు

వరంగల్, అక్టోబరు 27

వరంగల్‌లో కలెక్టర్ ఆఫీసుముందు నేడు శాంతియుతంగా పికెటింగ్ చేస్తున్న యువజన, విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు శ్రీ రామనర్సింహారావుతో బాటు 40 మందిని కస్టడీలోకి తీసుకున్నారు.

అంతకుముందు, యువజన, విద్యార్థుల [illegible], పేదార్థులు చేరుటాని వసతిగృహాలు స్థాపించాలని, నిరుద్యోగం నిర్మూలించాలని, కాజువలతో వెంటనే మానేరు ప్రాజెక్టు పూర్తి చేయాలని తదితర నినాదాలు చేస్తూ ప్రదర్శన జరిపారు.

పికెటింగ్‌కు రాష్ట్ర విద్యార్థి సమాఖ్య కార్యదర్శి శ్రీ రామనర్సింహారావు, జిల్లా యువజన సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ టి. వెంకట్రాములు, శ్రీ బి. భవాన్ జిల్లా విద్యార్థి నాయకుడు శ్రీ వీరాస్వామి, జిల్లా యువజన సమాఖ్య సంయుక్త కార్యదర్శి శ్రీ లక్ష్మీనారాయణ పట్టణ యువజన నాయకుడు శ్రీ శివపతి తదితరులు నాయకత్వం వహించారు.

పికెటింగు 2 గంటల వరకు కొనసాగించారు. అనంతరం వారిని పోలీసులు అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచారు.

సూళ్ళూరుపేట సమితిలో ఎద్దుల పంపిణీ

సూళ్ళూరుపేట, అక్టోబరు 27

సూళ్ళూరుపేట సమితిలోని రామనూరు, తనయాలి, పెటూన్‌పాళెం, కె జాగేలు, మొదుగుల పాళెం, పెమందూకు గ్రామాల సంయుక్త సహకార సంఘాలకు 86 వేల రూపాయల విలువగల ఎద్దులను పంపిణీ చేసినట్లు బి డి వో శ్రీ మస్తాన్‌రెడ్డి తెలియ చేశారు.

వీటితో పాటుగా విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల కొనుగోలుకు బి యం యస్ ఋణాలను కూడా పంపిణీ చేయటం జరిగిందని ఆయన తెలియ చేశారు.

అద్దంకి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ సలహా కమిటీ

అద్దంకి, అక్టోబరు 27

అద్దంకి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహానికి అద్దంకి తహశీల్దారు శ్రీ ఎస్. ఎ ఖాదర్ అధ్యక్షులుగా తాలూకా ఎడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేయబడింది.

ఆ కమిటీ సభ్యులుగా హాస్టలు వార్డెన్ శ్రీ చక్రవర్తి, విద్యార్థి శ్రీ కె. రామారావు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ కె. దేవసహాయం, హరిజన సభ్యులు శ్రీ కొప్పుల అయ్యన్న, అద్దంకి సర్పంచ్ శ్రీ బొడపాటి పెద్ద హనుమయ్య, టి. పి ఆర్ ఓ, మెడికల్ ఆఫీసరు, మనకట్టపల్లి యానాది సంఘం అధ్యక్షులు శ్రీ దొంతి సుబ్బారావు వున్నారు.

చిత్రలేఖనం పోటీలు

వెల్లటూరు, అక్టోబరు 28

గుంటూరు జిల్లా, రేపల్లె తాలూకా వెల్లటూరులో నవరంగ్ చిత్ర కళానికేతన్ ఆధ్వర్యాన నవంబరు 6 వ తేదీ నుండి 9 వ తేదీ వరకు స్థానిక ఉన్నత పాఠశాలలో స్పాట్ చిత్ర లేఖనం పోటీలు జరుగుతాయి.

ఈ పోటీలలో 6 సంవత్సరాల నుండి 16 సంవత్సరాలలోపు వయసుగల బాలబాలికలు పాల్గొన వచ్చు.

వివరాలు కావలసిన వారు పై సంస్థ కార్యదర్శిని సంప్రదించ వచ్చు.

కాంగ్రెసులో ‘వ్యక్తిపూజకు’ ఆస్కారంలేదు: కర్నాటక శాసనమండలి ఉపాధ్యక్షుని ప్రకటన

బెంగుళూరు, అక్టోబరు 27

కాంగ్రెసుపార్టీలో వ్యక్తి పూజకు ఆస్కారం లేదని, అందువల్ల శ్రీమతి ఇందిరాగాంధీ పార్టీ అత్యున్నత (సుప్రీం) నాయకురాలిగా అంగీకరించటం సాధ్యం కాదని కర్నాటక శాసన మండలి ఉపాధ్యక్షులు, ఎ ఐ సి సి. సభ్యులైన శ్రీ ఆర్. బి జాగిర్దార్ ప్రకటించారు.

శ్రీమతి ఇందిరాగాంధీ పట్ల కాంగ్రెసు వాదులందరికి గౌరవం వున్నదని పత్రికేయులతో మాట్లాడుతూ చెప్పారు. అలాగే పార్టీ అధ్యక్షునిగా శ్రీ బ్రహ్మానందరెడ్డిని తొలగించేందుకు రాజీనామా చేయించి ఆమెను పార్టీ అధ్యక్షురాలుగా చేయాలనే “అధిక ఉత్సాహంగల పూజారుల” ప్రయత్నానికి తాను వ్యతిరేకమని శ్రీ జాగిర్దార్ స్పష్టం చేశారు.

కీలక సమయంలో పార్టీ అధ్యక్ష పదవి చేపట్టిన శ్రీ బ్రహ్మానందరెడ్డి శక్తివంతంగా పని చేస్తున్నారని కర్నాటక పి. సి. సి. కార్యవర్గ సభ్యులైన శ్రీ జాగిర్దార్ పేర్కొన్నారు. ఆయన నాయకత్వం ఫలితంగా నెమ్మదిగానే అయినప్పటికి నికరంగా పాత స్థాయికి చేరుకుంటున్నది అని ఆయన చెప్పారు. ప్రదేశ్ కాంగ్రెసు కమిటీలో ఐక్యతను తీసుకురావటంలో కూడా ఆయన విజయవంతం అయ్యారని తెలిపారు.

ఉత్తరాదిలో మరోసారి కాంగ్రెసుకు బలం చేకూర్చి, దక్షిణాదిన పటిష్టపరచటం చేసేందుకుగాను శ్రీ రెడ్డి వెంట శ్రీ డి. కె. బారువా, శ్రీ సిద్ధార్థ శంకరరే, శ్రీ వై. బి. చవాన్ శ్రీ స్వరణ్ తదితర కాంగ్రెసు అగ్ర నాయకులు సమీకృతమవటం పట్ల శ్రీ జాగిర్దార్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

[illegible] కార్యవర్గాలలోను, నాయకులలోను ఐక్యతను తీసుకు రావటంలో శ్రీ రెడ్డి విజయవంతం అయ్యారని ఆయనన్నారు. బహుశా యీ కారణంగా విద్వేషులతో వున్న కొంత మంది కాంగ్రెసు వాదులు వ్యతిరేకమై వుండవచ్చును. నిరంతరం శ్రీమతి ఇందిరాగాంధీ పేరును ఉచ్చరిస్తూ అగ్రభాగాన వుండాలని వీరు భావిస్తుంటారు అని ఆయన అన్నారు.

ఎమర్జెన్సీ తర్వాత కర్నాటక ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ్ అర్స్ ఒక చిన్న నియంత అయ్యారని పేర్కొంటూ రాష్ట్రంలో పార్టీపై ఆధిపత్యం కలిగి వుండేందుకు తన మాటవినే శ్రీమతి గాంధీని పార్టీ అధ్యక్షురాలుగా చేయాలని శ్రీ అర్స్ భావిస్తున్నారని శ్రీ జాగిర్దార్ పేర్కొన్నారు.

భారత్‌లో కార్టర్‌కు ఘన స్వాగతం

న్యూయార్క్, అక్టోబరు 27

మానవ హక్కులకు కట్టుబడివున్న ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్, త్వరలో అధ్యక్షుడు జిమ్మీ కార్టర్‌తో జరపనున్న సమావేశాన్ని “ఒక వాస్తవ చారిత్రక ఘటన”గా చేస్తారని భారత రాయబారి నాని పాల్కీవాలా అన్నారు.

నవంబరులో అధ్యక్షుడు కార్టర్ భారత పర్యటన సందర్భంగా ఘన స్వాగతం యిస్తారని గత మంగళవారం క్లీవ్‌లాండులో జరిగిన సమావేశంలో పాల్కీవాలా చెప్పారు.

ప్రస్తుత ఖరీఫ్‌లో మిల్లర్ల లెవీగా మూడు లక్షల టన్నుల బియ్యం సేకరణ

జిల్లా కలెక్టర్లస సమావేశం నిర్ణయం: గత ఏడాదికన్నా లక్షన్నర టన్నుల తగ్గింపు

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, అక్టోబరు 27

ప్రస్తుత ఖరీఫ్ సీజనులో రైసుమిల్లర్లు మూడు లక్షల టన్నుల బియ్యం లెవీని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయ వలసి వుంటుంది.

నేడిక్కడ జరిగిన డెల్టా జిల్లాల కలెక్టర్ల, రైసుమిల్లర్ల సమావేశంలో అధికారులు లెవీ లక్ష్యాన్ని ప్రకటించారు. అధికారుల నిర్ణయం ప్రకారం మిల్లర్లు రెండు లక్షల టన్నుల మామూలు బియ్యాన్ని లక్ష టన్నుల ఉప్పుడు బియ్యాన్ని లెవీగా అందజేయ వలసి వుంటుంది.

గత సంవత్సర ఖరీఫ్ కాలంలో రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లనుండి 4½లక్షల టన్నుల లెవీ ధాన్యాన్ని స్వీకరించింది. ఇదిగాక, ఉత్పత్తిదారుల నుండి కూడా లెవీని వసూలు చేసింది. ఈ ఏడాది మిల్లర్ల లెవీని లక్షన్నర టన్నుల తగ్గించింది. ఉత్పత్తిదారులు ఏ మాత్రం లెవీని చెల్లించవలసిన అవసరం లేదు.

తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నల్గొండ జిల్లాల కలెక్టర్ల సమావేశం నేడు జరిగింది. రైసుమిల్లర్ల అసోసియేషన్ల ప్రతినిధులు నేటి సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర పౌర సరఫరా కమిషనర్ శ్రీ కె సుబ్రహ్మణ్యం యీ సమావేశానికి హాజరయ్యారు.

లెవీ చెల్లింపు వరకు ఆంక్షలు

రైసుమిల్లర్లు తమ లెవీని పూర్తిగా అందచేసే వరకు రాష్ట్రంలోని, యితర రాష్ట్రాలతో జరిపే వ్యాపారంపై ఆంక్షలు వుంటాయి. లెవీని అందచేసిన తర్వాత ఎన్ని టన్నుల లెవీ చెల్లించారో అన్ని టన్నుల బియ్యాన్ని యితర రాష్ట్రాలకు ఎగుమతి చేసుకొనవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని జిల్లాలలో స్వేచ్ఛగా వ్యాపారం చేసు కొనవచ్చు.

రైసు మిల్లర్లు గాక యితర రాష్ట్రాలకు ఎగుమతిచేసే బియ్యం డీలర్లు కూడా లెవీని చెల్లించవలసి వుంటుందని అధికారులు వెల్లడించారు ఇతర రాష్ట్రాలకు ఎన్ని వాగన్లు ఎగుమతి చేయదలిచారో అన్ని వాగన్లను రాష్ట్రప్రభుత్వానికి లెవీ గా అందచేయవలసి వుంటుంది

మామూలు రకం బియ్యం లెవీలో ప్రధానంగా అక్కుళ్లు, మసూరి రకాల బియ్యం యివ్వాలని అధికారులు కోరారు.

కృష్ణా జిల్లాలో 40 వేల టన్నులు

కృష్ణాజిల్లాలో దాదాపు 40 వేలటన్నుల లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలుస్తున్నది

గత సంవత్సరం పెద్ద మిల్లులు 40 టన్నులను, చిన్న మిల్లులు 20 టన్నుల బియ్యాన్ని లెవీగా అందచేశాయి. ఈ సంవత్సరం పెద్ద మిల్లులు 30 టన్నులు చిన్న మిల్లులు 15 టన్నులు అందజేయవలసి వుంటుందని భావిస్తున్నారు.

కాంగ్రెస్‌పై పెత్తనానికి ఇందిర, కాకస్‌ల కుట్ర

బీహార్ మాజీ ముఖ్యమంత్రి అబ్దుల్‌గఫూర్ విమర్శ

పాట్నా, అక్టోబరు 28

శ్రీమతి గాంధీకి తిరిగి ప్రముఖ స్థానాన్ని కట్టబెట్టేందుకు ఆమె మద్దతుదారులు చేస్తున్న ప్రయత్నాలను బీహార్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ అబ్దుల్ గఫూర్ నిన్న తీవ్రంగా విమర్శించారు.

కాంగ్రెసుపార్టీకి ఓట్లు సంపాదించగల ఏకైక వ్యక్తి శ్రీమతి గాంధీ ఒక్కరేనని ఆమె మద్దతుదార్లు చేస్తున్న వాదనకు ఎలాంటి విలువ లేదని అన్నారు.

కాంగ్రెసే తాను, తానే కాంగ్రెస్ అని, దేశమంటే తానేనని పోల్చుకున్న శ్రీమతి గాంధీ దేశంలో వ్యక్తిగత నియంతృత్వాన్ని స్థాపించేందుకు ప్రయత్నించారని, ఈ విషయంలో ప్రజాస్వామ్యం బూసి చేయబడిందని శ్రీ గఫూర్ ఒక ప్రకటనలో విమర్శించారు.

శ్రీ స్వరణ్‌సింగ్ అధ్యక్షులుగా కొనసాగటానికి శ్రీమతి గాంధీ అనుకూలించలేదని. ఆయన స్థానంలో శ్రీ బ్రహ్మానందరెడ్డిని ఎంపిక చేశారని చెప్పారు. ఇప్పుడు శ్రీ రెడ్డిని అధ్యక్ష పదవినుండి తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

తన చీరలలాగా ముఖ్యమంత్రులను మార్చిన ఇందిర

అధికారంలో వుండగా శ్రీమతి గాంధీ తాను చీరలు మార్చుకున్న విధంగా ముఖ్యమంత్రులను మార్చిన విషయాన్ని మరిచిపోరాదని ఆయన అన్నారు.

శ్రీమతి గాంధీ విశ్వాస యోగ్యతను కోల్పోయిందని చెప్పారు. ఒకవైపు అధికారం పట్ల వ్యామోహం లేదని చెపుతూ మరోప్రక్క కాంగ్రెసును చేజిక్కించుకునేందుకు ఆమె, ఆమెతో గల కాకస్‌లు నిరంతరం కుట్రలు పన్నుతూనే వున్నారని చెప్పారు. శ్రీమతి గాంధీ ఇంటిలోనే ఈ కుట్రలన్నీ జరుగుతున్నాయని చెప్పారు.

అసెంబ్లీ ఎన్నికలను ప్రస్తావిస్తూ ఎన్నికల ప్రచారం సందర్భంగా శ్రీమతి గాంధీ తలుపులు మూసుకొని ఇంట్లో కూర్చున్నా కాంగ్రెసుపార్టీ మంచి ఫలితాలను సాధించిందని అన్నారు.

చీలికకు అవకాశం లేదని కేదార్‌పాండే

మార్పును కోరేవారు, వ్యతిరేకించేవారు విభేదాలను తేల్చుకోవాలనుకుంటున్నప్పటికి కాంగ్రెసుపార్టీలో చీలికకు అవకాశంలేదని బీహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కేదార్ పాండే తెలిపారు.

ఢిల్లీనుండి తిరిగి వచ్చిన అనంతరం విలేకరులతో శ్రీ పాండే మాట్లాడుతూ నాయ ~~[illegible]~~ గాని పార్టీలో చీలికను వాంఛించటం లేదని అన్నారు.

ఢిల్లీలో శ్రీమతి గాంధీని, కమలాపతి త్రిపాఠిని, ఇతర నాయకులను కలుసుకున్నానని అన్నారు. రిక్విజిషన్ యత్నాన్ని ప్రస్తావిస్తూ కొన్ని బాధాకర వాదనలను ఈ యత్నం ద్వారా వ్యక్తం చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం అన్ని సమస్యలు సామరస్య పూర్వకంగా పరిష్కరించ వీలవుతుందని అందరూ భావిస్తున్నారని అన్నారు.

పార్టీలో ఐక్యతను కాపాడాలని నాయకులంతా భావిస్తున్నారని, అందుచేతనే రిక్విజిషన్ నోటీసును కాంగ్రెసు అధ్యక్షునికి అందచేయలేదని అన్నారు.

రిక్విజిషన్ ప్రయత్నాన్ని సమర్థిస్తూ కాంగ్రెసులో అంతరంగిక ప్రజాస్వామ్యం వుండాలని, ప్రజాతంత్ర క్రమంలో భాగంగానే ఈ ప్రయత్నం జరిగిందని అన్నారు.

బీహార్ ఉపఎన్నికలలో కమ్యూనిస్టుపార్టీతో సర్దుబాట్లు

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుని వెల్లడి

పాట్నా, అక్టోబరు 28

బీహార్ శాసనసభకు మూడు నియోజక వర్గాలనుండి జరుగనున్న ఉపఎన్నికలలో కాంగ్రెసుపార్టీ, కమ్యూనిస్టుపార్టీతో ఎన్నికల సర్దుబాట్లు చేసుకుంటుందని రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కేదారపాండే తెలియజేశారు. వచ్చే డిసెంబరులో ఉపఎన్నికలు జరుగనున్నవని తెలుస్తున్నది.

ధన్‌బాద్ జిల్లాలోని నిర్సా, మధుబని జిల్లాలోని ఫుల్‌పరాస్, భోజ్‌పూర్ జిల్లాలోని బర్హారా నియోజక వర్గాలనుండి వున ఎన్నికలు జరుగనున్నాయి.

వున ఎన్నికలలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కర్పూరీఠాకూర్‌పై పోటీ పెడతారా అని పత్రికా విలేకరుల సమావేశంలో శ్రీపాండేను విలేకరులు ప్రశ్నించగా తప్పకుండా పోటీ పెడతామని అన్నారు. ఆయనకు గట్టి పోటీ ఇస్తామని చెప్పారు.

ప్రస్తుతం లోక్‌సభ సభ్యులైన ముఖ్యమంత్రి శ్రీ ఠాకూర్ ఫుల్‌పరాస్ నియోజకవర్గంనుండి పోటీ చేయవచ్చునని తెలుస్తున్నది.

తమ పార్టీ గతంలో కూడా కమ్యూనిస్టులతో ఎన్నికల సర్దుబాట్లు చేసుకున్నదని, భవిష్యత్‌లో కూడా ఈ సర్దుబాటు కొనసాగుతుందని శ్రీ పాండే తెలియజేశారు.

శ్రీ కాళహస్తి అక్టోబరు 28

ఇక్కడి బి యస్ టి ఆవరణలో నిర్మాణంలో వున్న పాలిటెక్నిక్ కేంద్రం గోడ కూలి ఇద్దరు కార్మికులు మరణించారు.

బ్రిటన్‌లో భారత జాతీయులతో ఎన్. జి. గోరే భేటీ

లండన్, అక్టోబరు 28

బ్రిటన్‌లో భారత్ హై కమిషనర్‌గా నియమితులైన శ్రీ ఎన్. జి. గోరే మొన్నరాత్రి ఇక్కడ భారతీయులను కలుసుకున్నారు.

'ఇండియా హౌస్‌ను మీ ఇల్లే అనుకొండి' అని వారికి చెప్పారు.

బ్రిటన్‌లో దాదాపు 5 లక్షల మంది భారతీయులుంటారు. ఇక్కడ వందల కొలది భారతీయుల సంఘాలున్నాయి.

దాదాపు వంద సంఘాల ప్రతినిధులు హాజరైన సభలో భారత్ హై కమిషన్ ప్రజాసంబంధాలకన్న ఏర్పాటులే ఎక్కువ వున్నాయి ఇక్కడి భారతీయుల గోడును హై కమిషన్ అధికార్లు పట్టించుకోరని వారు విమర్శించారు.

ఎలాంటి సమస్యలున్నా సరే ఇండియా హౌస్‌కు వచ్చి చెప్పాలనీ, భారతీయ సంఘాల సభలన్నిటికి హాజరవుతాననీ శ్రీ గోరే హామీ ఇచ్చారు. గతంలోని హై కమిషనర్ శ్రీ బి కె నెహ్రూపై విమర్శలు రాగా "గతాన్ని మర్చిపోండి" అని చెప్పారు.

పాక్‌లో ఏకాకి అవుతున్న సైనిక ప్రభుత్వం

న్యూఢిల్లీ, అక్టోబరు 28

పాకిస్తాన్‌లోని ప్రస్తుత ఉద్రిక్తత రాజకీయ విభజనకు దారితీసే సూచనలున్నాయి. ఒకవైపు సైనిక ప్రభుత్వం, ప్రత్యేకంగా జనరల్ జియా ఏకాకి అవుతున్నారు మరోవైపు రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి.

ఈ పరిస్థితులవల్ల పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పి.పి.పి.) దూరదృష్టిగల వారి హస్తగతమైనట్లు చెప్పబడుతున్నది. పి.పి.పి.ని దెబ్బతీయాలని సైనిక ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఎదురు తిరిగింది.

రాజకీయ వాతావరణంలో ఏర్పడ్డ తిరుగుబాటు ధోరణి, పి.పి.పి. కార్యకర్తలకు ఉత్తేజాన్నిచ్చింది. ఇందులో ఎక్కువ సంఖ్యలో యువకులు చేరుతున్నారు. మరోవైపు పాకిస్తాన్ ప్రతిపక్ష సంఘటన బలం సన్నగిల్లిపోతున్నది ఇది పరస్పర విభేదాలై ఆరుగురి కలహాల గందరగోళ ప్రదర్శనలోకి వచ్చింది. ఇందులో చీలిక శక్తులు పైచేయిని సంపాదించాయి. సైనిక ప్రభుత్వానికి తొత్తుగా పరిగణించబడుతున్న దీనికి సంకట పరిస్థితి ఏర్పడింది.

రానున్న పక్షం రోజుల్లో దేశంలో నూతన రాజకీయ పరిస్థితితోపాటు ఆర్థిక సంక్షోభం ప్రారంభమౌతుందని లాహోర్ వారపత్రిక "మెయ్యార్" తెలిపింది. అది యింకా యిలా తెలియజేస్తున్నది:

"మరో సంవత్సరంపాటు ఎన్నికలు జరిగే సూచనలు లేవు. ఎందుచేత నంటే అటువంటి పరిస్థితి ఏర్పడటానికి కనీసం ఒక సంవత్సరం అవసరం. రాజకీయ కార్యకలాపాలపై విధించిన నిషేధంవల్ల ఏర్పడ్డ శూన్యపరిస్థితిని కఠినమైన సైనిక చర్యలు పూరించలేవు. సైనిక చర్యలవల్ల శాంతి భద్రతలు కొనసాగించవు. కల్లోలాలను అణచివేయటం మాత్రం సాధ్యమౌతుంది.

జనరల్ జియా ప్రతిష్ఠ ఎంతో పడిపోయిందని విదేశీ పత్రికలతోపాటు జాతీయ పత్రికల్లో కూడా వార్తలు వెలువడ్డాయి. ఆయనకు కూడా గూఢచారి శాఖనుండి అటువంటి నివేదికలే వస్తూవుండవచ్చు. ప్రజలు తమకు ఉచితమైన ప్రభుత్వాన్ని ఎన్నుకొనడానికి అవకాశం యివ్వడమే ప్రస్తుత సంక్షోభ పరిష్కారానికి ఏకైక మార్గం...

"కొందరు పాత్రికేయులు, లాయర్లు, పెట్టుబడిదారీ వర్గానికి చెందిన రాజకీయవేత్తలతో సహా సాంప్రదాయ వదరుబోతులు సైనిక ప్రభుత్వానికి సలహా లిచ్చే పాత్ర ఎత్తుగడలను ప్రారంభించారు తాత్కాలిక ప్రభుత్వంనుండి అందిన మేరకు ప్రయోజనాలు పొందటమే వీరి లక్ష్యం. సాధారణ పరిస్థితి ఏర్పడకుండా వుండాలని వీరు కోరుకుంటారు, అందుకు పి.పి.పి. తరువాత యిప్పుడు జమైతుల్ ఉలేమా ఇస్లాం బూచి చూపించటానికి కూడా వెనుదీయరు అందువల్లనే కావచ్చు మౌలానా ముఫ్తీ మొహమ్మద్ ఎన్నికలు ఏ మాత్రం వాయిదా వేయకూడదని గట్టి వైఖరి తీసుకున్నారు...

"ఈనెల చివరిరెండు వారాలు పాకిస్తాన్‌లోని రాజకీయ, ఆర్థిక పరిణామాలలో కీలక ఘట్టంగా వుండగలవు ... పరిస్థితి మెరుగుదలకు తగిన చర్యలు తీసుకోనిచో సంక్షోభం యింకా తీవ్రతరమవుతుంది.

(ఐ. పి. ఎ.)

కారు-జీపు ఢీకొని డ్రైవర్ల మృతి

తిరుపతి, అక్టోబరు 27

తిరుపతికినాలుగుమైళ్ళలో రేణిగుంట-తిరుపతి రోడ్డుమీద ఆరుగురు ప్రయాణీకులతో గుంటూరునుండి వస్తున్న ఒక కారు, ఎదురుగా వస్తున్న జీపు ఢీ కొనడంతో కారు డ్రైవర్ శ్రీ జనార్ధనరావు అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన జీపు డ్రైవరు ఆస్పత్రిలో మరణించాడు.

ఆంజనేయపురంలో తాడు తయారు చేయు శిక్షణాశిబిరం

ఇల్లెందు అక్టోబరు 28

ఖమ్మంజిల్లా ఇల్లెందు తాలూకా నల్లసముద్రం శివారు ఆంజనేయపురం గ్రామంలో ఈనెల 26 న ఖమ్మం యూత్ ఫోరం వారి ఆధ్వర్యాన వృత్తి శిక్షణా పథకంలో భాగంగా గిరిజన, గిరిజనేతర యువకులకు యంత్రం ద్వారా తాళ్ళు పేయుటలో శిక్షణ ఇచ్చే కేంద్రమునకు జిల్లా సమీకృత గిరిజనాభివృద్ధి అధికారి శ్రీ ఆర్. రామచంద్ర ప్రారంభోత్సవం చేశారు. 6 వేల రూపాయల విలువగల యీ యంత్రముపై నెల రోజులు శిక్షణ పొందిన పిమ్మట అడవి ప్రాంతములో దొరుకు గడ్డి, ఏకునార, సాగనార, గోగునారలతో సులభంగా యంత్రంతో మంచి తయారు చేసి అమ్ముకొనవచ్చును ఖాదీ గ్రామోద్యోగ కమిషన్, ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డుకు చెందిన శ్రీయుతులు నాగప్పనాయరి యస్. ఈశ్వరయ్యలను శిక్షణ యివ్వడానికి నియమించారు. ఈ సందర్భముగా జరిగిన సభకు జిల్లా గిరిజనాభ్యుదయ అధికారి శ్రీ డి కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. యూత్ కో-ఆర్డినేటర్ శ్రీనారాయణస్వామి యువకులకు స్వాగతం చెబుతూ యిట్టి శిక్షణా కేంద్రం ఖమ్మంజిల్లాలోనే ప్రథమంగా ప్రారంభించినట్లు చెప్పి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనమని తెలిపారు. పి. డి. ఓ., శ్రీ వి. మోహన్‌రెడ్డి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

గిరిజన సహకార వ్యవసాయ లిఫ్టుఇరిగేషన్ సంఘం

ఖమ్మం జిల్లా ఇల్లెందు తాలూకా పునిరికాయలపల్లి శివారు బోయిలపల్లి గ్రామంలో 60 మంది గిరిజనులతో 'కోటిలింగాల గిరిజన సహకార వ్యవసాయ లిఫ్టు ఇరిగేషన్ సంఘాన్ని' ఏర్పాటు చేసుకొని రిజిస్టరు చేయించు కున్నారు. పై గిరిజన సభ్యులకు సభ్యత్వ బాధ్యతలను సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థవారు యివ్వడంతో పాటు రాష్ట్ర భూగర్భ జలశాఖవారు నిర్మించిన 5 గొట్టపు బావులతో ఏడుకోడి 270 ఎకరములను సాగులోనికి తీసుకువచ్చే పథకమునకు కావలసిన 3 లక్షల రూపాయల ఋణమును కూడా యిచ్చుటకు అంగీకారము తెలిపినట్లు, పి. డి. ఓ. శ్రీ వి. మోహన్‌రెడ్డి తెలియజేశారు.

దివి తాలూకాలో పశుగర్భకోశవ్యాధుల చికిత్స ఉద్యమం

అవనిగడ్డ, అక్టోబరు 28

కృష్ణాజిల్లా దివి తాలూకాలో కోసూరు, పంటపాలెం, మేకావారిపాలెం గ్రామాలలో యీ నెల 24, 25, 26 తేదీలలో పశుసంవర్ధకశాఖవారి ఆధ్వర్యాన సుమారు వెయ్యి పశువులకు గర్భకోశవ్యాధుల చికిత్స జరిగింది. ఈ కార్యక్రమం మొత్తం అసిస్టెంటు డైరెక్టరు శ్రీ యం. వి. కృష్ణారావు పర్యవేక్షణలో జరిగింది. ఈ సామూహిక ఉద్యమం గ్రామాల్లో రైతులకు ఎంతో ప్రోత్సాహాన్ని రేకెత్తించింది. పశుసంవర్ధకశాఖ నిర్వహించుచున్న యీ విస్తృత కార్యక్రమంవల్ల రైతుల హర్షాన్ని తెలియజేశారు.

తాలూకాలో సుమారు 25 పశువైద్యశాలల ద్వారా వసతిసదుపాయములు జరుగుచున్నప్పటికి యీ ఉద్యమం వల్ల వివిధ రకములయిన గర్భకోశ వ్యాధులను కనుగొనడానికి అవకాశాలు కలిగినవి రక్తము, మూత్రము పరీక్షద్వారా అక్కడికక్కడే వ్యాధి నిర్ణయం జరుగుతున్నందున మందులివ్వడం కూడా వెంటనే జరిగే అవకాశం ప్రభుత్వం కల్పించిందనీ అధికారులు తెలియజేసిన తక్షణమే గ్రామ రైతులు సంతోషంతో ముందుకు వచ్చారు. ముగింపు రోజు కార్యక్రమం మేకావారి పాలెం గ్రామంలో ఏర్పాటుచేశారు. పశుగణాభివృద్ధి అధికారి శ్రీ శ్రీనివాసులురెడ్డి డెప్యూటీ విస్తరణ అధికారి శ్రీ షేక్ అహమ్మద్ మరో 30మంది యీ శాఖ సిబ్బందితో యీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామరైతులు శ్రీయుతులు మేకా బాల వెంకయ్య మేకా గోపాలరావు, మేకా నాగేశ్వరరావు, సర్పంచ్ శ్రీకంఠం వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ సంవత్సరమునకొకసారి యిటువంటి ఉద్యమాన్ని నిర్వహిస్తే రైతులకు మేలు కలుగుతుందని అన్నారు అవనిగడ్డ బి డి ఓ శ్రీ యం వి. అప్పారావు తాలూకా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు శ్రీ బి. ఆర్థర్‌పాల్ యీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పై మూడు గ్రామాలలో పశు సంవర్ధక శాఖ వారి ప్రచార విభాగం వారి ద్వారాను, అవనిగడ్డ సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలోను సినిమా ప్రదర్శనలు ఏర్పాటు చేయబడ్డాయి.

పోలీసు సబ్-ఇన్‌స్పెక్టర్ల వేతనాల పెంపు: ముఖ్యమంత్రి ప్రకటన

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాదు, అక్టోబరు 28

పోలీసు శాఖ ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు నేడిక్కడ తెలియజేశారు.

యూసఫ్‌గూడలో నేటి ఉదయం రిజర్వ్ పోలీసుల సైనిక వందనాన్ని ముఖ్యమంత్రి స్వీకరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ దుర్వ్యసనాలకు గురికాకుండా రాష్ట్ర పోలీసు శాఖకు మంచి పేరు ప్రతిష్ఠలు ఆర్జించటానికి పోలీసు అధికార్లు కృషి చేయాలని అన్నారు.

ఈ శాఖ ప్రమాణాలను పెంచేందుకై పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ల నియామకాలలో సిఫారసులకు తావివ్వడంలేదని, వారి బాధ్యతలు పెరిగిన దృష్ట్యా వారి స్కేళ్ళను డిప్యూటీ తాసిల్దార్ల స్కేళ్ళకు పెంచనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

దేశంలో అరాచకాన్ని సృష్టించడానికి, పోలీసు శాఖపై "దెబ్బ" కొట్టటానికి ప్రయత్నిస్తున్న "శక్తుల" ఆటకట్టించేటందుకు పోలీసు శాఖకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అండగా" నిలుస్తాయని ఆయన అన్నారు.

తొలుత రాష్ట్ర పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ కె. రామచంద్రారెడ్డి స్వాగతం పలుకుతూ మారిన పరిస్థితుల దృష్ట్యా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సందర్భంలో భయోత్పాతాన్ని సృష్టించే పాత పద్ధతులను విడనాడి మర్యాదగా వ్యవహరించాలని పోలీసులను కోరారు.

విజయవాడలో యువజన-విద్యార్థుల ప్రదర్శన దృశ్యం.

హైదరాబాద్‌లో అరెస్టులు

(1 వ పేజీ తరువాయి)

ఆలో కూర్చోబెట్టడం ప్రారంభించారు

మరికొంతమందిని, పోలీసు వ్యాన్ రావడంలో ఆలస్యం జరిగినందున పెట్రోలింగ్ కార్లలో బలవంతంగా కూర్చోబెట్టి తీసుకు పోవడానికి చేసిన ప్రయత్నం యువ మహిళలు అడ్డుకుని కొద్దిసేపు నిరోధించారు.

దాదాపు 20 నిమిషాల సేపు సెక్రటేరియట్ రోడ్డు రవాణా పూర్తిగా స్తంభించి పోయింది. వందలాది మంది అక్కడ గుమిగూడారు.

గుంటూరులో ఘెరావ్

గుంటూరు, అక్టోబరు 28

మంగళగిరి టైల్స్ ఫ్యాక్టరీ, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీల సత్వర నిర్మాణానికై డిమాండ్ చేస్తూ గుంటూరు తాలూకా ఆఫీసు వద్ద నేడు 250 మంది విద్యార్థులు, యువజనులు దాదాపు 5 గంటలసేపు పికెటింగ్, ఘెరావ్ జరిపారు.

నిరుద్యోగం, అధికధరలకు నిరసనగా ఆందోళనకై రాష్ట్రయువజన విద్యార్థి సమాఖ్యల పిలుపు నందుకుని జిల్లా విద్యార్థి యువజన సమాఖ్యల ఆధ్వర్యాన ఉదయం 9 30 గంటలకు ప్రదర్శకులు తాలూకా ఆఫీసుకు చేరి పికెటింగు జరిపారు. గుంటూరులోని వివిధ కళాశాలల విద్యార్థులు, రేపల్లె తెనాలి గుంటూరు తాలూకా నుండి వచ్చిన యువకులు పతాకాలు చేబూని ఉత్సాహంగా నినాదాలిస్తూ ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షించారు

11.30 గంటల వరకు ఆఫీసు గేటువద్ద పికెటింగు సాగింది. అనంతరం ప్రదర్శకులు తహసీల్దారు డిప్యూటీ తహసీల్దారు తదితరుల ఆఫీసుల ముందు ఘెరావ్ జరిపారు.

ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య అధ్యక్షులు శ్రీ బి స్టాలిన్‌బాబు నేతృత్వంలో జరిగిన ఆ కార్యక్రమానికి యింకా జిల్లా విద్యార్థి సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు శ్రీ యన్. సాంబశివరావు, శ్రీ ఎ. వెంకటరావు, జిల్లా యువజన సమాఖ్య కార్యదర్శులు శ్రీ యం. రవి, శ్రీ యన్. నాగేశ్వరరావు, పట్టణ యువజన సమాఖ్య అధ్యక్షులు శ్రీ యం. మోహనరావు పట్టణ విద్యార్థి సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు శ్రీ వి శివరామిరెడ్డి, శ్రీయన్.వి. ప్రసాద్, గుంటూరు ఏరియా యువజన నాయకులు శ్రీ వెంకట్రావు, తెనాలి పట్టణ విద్యార్థి సమాఖ్య నాయకులు శ్రీ యల్. భాస్కరరావు నాయకత్వం వహించారు.

సత్రము వసతి, స్కాలర్‌షిప్‌లకు హామీ

అనంతరం తహసీల్దారు శ్రీ యస్. రామమూర్తి యువజన విద్యార్థి కోర్కెల పత్రాన్ని స్వీకరించారు హాస్టళ్ళ విద్యార్థులకు సత్రము వసతి కల్పించగలమని, స్కాలర్‌షిప్‌లు అందే విధంగా చేయగలమనీ హామీ ఇచ్చారు మిగతా డిమాండ్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించ గలదన్నారు

అనంతరం ప్రదర్శకులు జరిపిన సభలో శ్రీయుతులు స్టాలిన్‌బాబు వెంకట్రావు యన్ వి. ప్రసాద్ ప్రసంగించారు.

కొత్తగూడెం

50 మంది విద్యార్థి, యువజనులు కొత్తగూడెంలో ప్రదర్శనగా సబ్ కలెక్టర్ కార్యాలయంవద్దకు వెళ్ళారు. సబ్ కలెక్టరు లేనందున హెడ్‌క్లర్కుకు మెమోరాండం అందచేశారు తమ డిమాండ్‌లను వినిపిస్తూ ప్రదర్శకులు ప్రధాన వీధులగుండా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్ళారు రాష్ట్ర యువజన నాయకులు శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణారావు పట్టణ యువజన సమాఖ్య అధ్యక్ష ఉపాధ్యక్ష, కార్యదర్శులు శ్రీ షేక్ ఇమామ్ శ్రీ పిండిగ మణిక్‌బాబు, శ్రీ మిర్యాల రంగయ్య శ్రీ బందెల నర్సయ్యలు మెమోరాండం సమర్పించారు. పై అధికార్లకు అందజెయ్యగలనని ఆయన చెప్పారు.

ఇల్లెందు యువకుల సైకిల్ ర్యాలీ

~~[illegible]~~ ఇల్లెందుకు చెందిన యువకులు ఇల్లెందునుండి కొత్తగూడెం వరకు 84 కిలో మీటర్ల దూరం సైకిళ్ళపై వచ్చి పట్టణంలో ప్రదర్శననిర్వహించారు అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్ళి సబ్ కలెక్టర్ లేనందున హెడ్‌క్లర్కుకు మెమోరాండం అందజేశారు. శ్రీయుతులు అల్లం రమేష్, రుద్రాపు రామచందర్, వడికె రాయమల్లు, కసం పర్శరాం నాయకత్వం వహించారు. అనంతరం ఎంప్లాయిమెంట్ ఎక్సేంజి వద్దకు వెళ్ళి ఎంప్లాయిమెంటు అధికారికి మెమోరాండం అందజేశారు.

గమనిక

నిన్నటి విశాలాంధ్ర పత్రికలో వరంగల్‌లో 40 మంది అరెస్టు అని ప్రచురించబడింది. 17 మందే అరెస్టు చేయబడినట్లు మా విలేకరి ఈ రోజు తెలిపారు. పొరపాటుకు చింతిస్తున్నాం-సం॥

మధిర తాలూకా గ్రామాధికార్ల సంఘం

మధిర, అక్టోబరు 28

మధిరతాలూకా గ్రామాధికార్లసంఘ సమావేశం ఈ నెల 22 న జరిగింది.

తాలూకా సంఘ అధ్యక్షులుగా శ్రీ బి. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా శ్రీ జి. రంగారెడ్డి, 'కార్యదర్శిగా శ్రీ వి.ఆర్.కృష్ణారావు, సహాయ కార్యదర్శిగా శ్రీ కె. లక్ష్మిరావు, కోశాధికారిగా శ్రీ జి. వి. అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఇల్లెందు తాలూకా గ్రామాధికార్ల సంఘ అధ్యక్షులు శ్రీ యం. శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి.

మధ్యప్రదేశ్ మంత్రి రాజీనామా ఉపసంహరణ

భోపాల్, అక్టోబరు 28

ముఖ్యమంత్రి శ్రీ కైలాస్ జోషితో చర్చలు జరిపిన అనంతరం మధ్యప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ స్టేట్ మంత్రి శ్రీ పవన్ దివాన్ తన రాజీనామాను ఉపసంహరించుకొన్నారు.

ఆతరువాత శ్రీదివాన్ పత్రికావిలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ప్రయోజనాలను కాపాడటానికి సక్రమ నిర్వహణకు సరైన వాతావరణం కలుగ చేయడానికి 'మన మంత్రి' చర్యలు తీసుకోవాల్సి వుందని అన్నారు అంతకు ముందు ఈ వాతావరణం [illegible]

వెంకటాపురంకు రక్షిత నీటి సరఫరా పథకం

నూగూరు, అక్టోబరు 28

నూగూరుతాలూకా వెంకటాపురం గ్రామ రక్షిత నీటి సరఫరా పథకానికి ప్రభుత్వం రు. 60 వేలు మంజూరు చేసింది.

ఇందులో సగభాగం మొత్తాన్ని గ్రామ పంచాయితి విరాళంగా మంజూరు చేసింది.

గ్రామ పంచాయితి అత్యవసర సమావేశంలో ఈ మొత్తాన్ని మంజూరు చేసినట్లు పంచాయితి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ క్రిస్టోఫర్ తెలియజేశారు.

గ్రామ పట్టు పరిశ్రమ అభివృద్ధికి రు. 25 వేలు

వెంకటాపురం గ్రామంలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం 25 వేలు సబ్సిడీగా మంజూరు చేసింది

రైతులకు మల్బరీ కటింగ్స్‌ను సబ్సిడీ మీద సరఫరా చేయుటకు రు 12½ వేలు, పట్టు పరిశ్రమ సామాగ్రి కొనుగోలుకు రు. 12½ వేలు సబ్సిడీగా ప్రభుత్వం కేటాయించింది.

బాబీ : శుక్లా

(1వ పేజీ తరువాయి)

విజన్‌లో ప్రసారం చేయడం జరిగిందని. ప్రతిపక్షాల బహిరంగసభకు దెబ్బతీయటానికి ఆ విధంగా చేయడం జరిగిందన్న ఆరోపణపై షా కమిషన్ ముందు సాక్ష్యం ఇస్తూ శ్రీ శుక్లా పైవిధంగా అంగీకరించారు

దాదాపు మూడు గంటలపాటు విచారణ జరిగింది.

చిత్రాన్ని మార్చాలని ఆదేశాలు యిచ్చిన మాట నిజమేనని అయితే నిర్ణీత సమయం కంటే ముందుగా అనగా సాయంత్రం 5 గంటలకు 'బాబీ'ని ప్రదర్శించాలని తాను ఆదేశాలు యివ్వలేదని చెప్పారు

మార్పు ఎందుకు చేశారని ప్రశ్నించగా "వక్త్" చిత్రాన్ని టెలివిజన్‌లో ప్రదర్శించటానికి ఒకరోజు ముందు పంపవలసి వుండగా కుటుంబ సహా కొంతమంది తనవద్దకు వచ్చి ఆ చిత్రం ప్రదర్శనకు అభ్యంతరం తెలిపారని అన్నారు ప్రదర్శనకు "వక్త్" చిత్రం అర్హమైనది కాదని, ఢిల్లీ కేంద్రం నుండే కాక ఇతర దూరదర్శన్ కేంద్రాల నుండి కూడా ఆ చిత్రాన్ని ప్రదర్శించరాదని వారు తెలిపారని అన్నారు.

టెలివిజన్ కేంద్రాలన్నింటికి ఈ నిర్ణయాన్ని తెలియజేయాలని తన ప్రత్యేక అసిస్టెంట్ శ్రీ వి. ఎస్ త్రిపాఠీని ఆదేశించానని ఫలితంగా "వక్త్" ఉపసంహరించబడిందని చెప్పారు.

ఢిల్లీలో "బాబీ" తప్ప చిత్రం ప్రింట్ లభ్యంకాలేదని, చివరకు అధికారులు వెతికి వెతికి చెడిపోయిన ప్రింటును సంపాదించవలసి వచ్చిందని, అటువంటప్పుడు "బాబీ"ని మాత్రమే ఎన్నికచేయాలని ఎందుకు ఉత్తర్వులు యిచ్చారని కమిషన్ శ్రీ శుక్లాను ప్రశ్నించింది.

అనుమతి పొందిన జాబితాలో "బాబీ" చిత్రం వుంది. అంతేకాక చాలాకాలంనుండి "బాబీ"ని ప్రదర్శించాలని ప్రేక్షకులు డిమాండ్ చేస్తున్నారు. అందుచేత ఈ చిత్రాన్ని ప్రదర్శించ వచ్చునని తాను భావించాను. ప్రింట్ లభించక పోయివుంటే మరో చిత్రాన్ని ప్రదర్శించి వుండేవారం అని శ్రీ శుక్లా చెప్పారు

"బాబీ"చిత్రాన్ని ప్రదర్శించడం జరుగుతుందని ఫిబ్రవరి 5వ తేదీ రాత్రి 10 గంటలకు ప్రకటించారు. ఆ ప్రకటన మీ ఉత్తర్వుల మేరకే జరిగిందా అని కమిషన్ ప్రశ్నించింది

అలాంటి ఉత్తర్వు తాను యివ్వలేదని, ప్రింట్ లభ్యం కాకముందే అలాంటి ప్రకటన చేయడం తనకు ఆశ్చర్యాన్ని కలుగజేసిందని చెప్పారు. అలాంటి ప్రకటన చేసివుంటే అది పొరపాటేనని అన్నారు.

"బాబీ"ని ప్రదర్శించాలన్న ఉత్తర్వు ఇవ్వటం మినహా ఈ విషయంలో తాను జోక్యం చేసుకోలేదని అన్నారు.

ప్రభుత్వరంగ ఉక్కు పరిశ్రమ పునర్వ్యవస్థీకరణ: కేంద్ర మంత్రివర్గ ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబరు 28

ప్రభుత్వరంగ ఉక్కు పరిశ్రమ పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనను కేంద్రమంత్రివర్గం నిన్న ఆమోదించింది. కేంద్ర ఉక్కు గనుల శాఖ ఈ ప్రతిపాదన చేసింది.

ఫలితంగా భారతఉక్కుసంస్థను డివిజనల్ యాజమాన్యం రూపంలో సమగ్ర కంపెనీగా పునర్ వ్యవస్థీకరిస్తారు. ఉక్కు కర్మాగారాలు స్వయం ప్రతిపత్తిగల డివిజన్లుగా ఈ కంపెనీకింద పనిచేస్తాయి.

ఈ నూతన పద్ధతి క్రింద విధానాలకు సంబంధించిన నిర్ణయాలు చేసే అధికారం కంపెనీకి వుంటుంది. అయితే ప్రతియూనిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌కు కర్మాగారం దైనందిన పని విషయంలో, వనరులను నిర్దిష్టస్థాయిలో వినియోగించుకునే విషయంలో పూర్తి అధికారాలు, స్వేచ్ఛ వుంటాయి.

ప్రస్తుతం భారత ఉక్కుసంస్థ అనుబంధ సంస్థలుగా వున్న మెటలర్జికల్, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్స్ కంపెనీ, హిందూస్థాన్ స్టీల్ వర్క్స్ కనస్ట్రక్షన్ కంపెనీ, భారత రిఫ్రాక్టరీస్ కంపెనీలు ఇకముందు కేంద్ర ఉక్కుగనుల శాఖక్రింద పని చేస్తాయి.

సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

కేసులను సత్వరం పరిష్కరించే నిమిత్తం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 13 నుండి (ప్రధాన న్యాయమూర్తితోసహా) 17 కు పెంచాలని కేంద్ర మంత్రి వర్గం నిర్ణయించింది. న్యాయ శాఖ చేసిన ఈ ప్రతిపాదనను మంత్రివర్గం నిన్న ఆమోదించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యకు సంబంధించిన 1956 చట్టాన్ని సవరించాలని న్యాయశాఖ ప్రతిపాదించింది. ఇందుకు అవసరమైన బిలును పార్లమెంటు వచ్చే సమావేశంలో ప్రతిపాదిస్తారు.

అయితే ప్రస్తుతానికి అదనంగా ఇద్దరు న్యాయమూర్తులను మాత్రమే నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తున్నది మిగతా నియామకాలను తరువాత చేస్తారు.

మంత్రివర్గ ఉపసంఘం

1976 పట్టణ ప్రాంతాల భూకమతాల గరిష్ఠ పరిమితి చట్టాన్ని పరిశీలించి, నిర్మాణ కార్యక్రమాల పునరుద్ధరణకు అవసరమైన సూచనలు చేయటానికిగాను హోంమంత్రి శ్రీ చరణ్ సింగ్ నాయకత్వాన ఉపసంఘాన్ని కేంద్ర మంత్రివర్గం ఏర్పాటు చేసింది.

కమిటీలో మంత్రులు శ్రీయుతులు శాంతి భూషణ్ సికిందర్ భక్త్ పి. ఎస్ బర్నాలా, బ్రిజ్ లాల్‌వర్మలు వున్నారు.

మంత్రివర్గ సమావేశానికి ముందు మంత్రులంతా ఆరోగ్య శాఖమంత్రి శ్రీ రాజ్‌నారాయణ్ ఇంటిలో అల్పాహార సమావేశం జరిపారు. ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్, విదేశాంగ మంత్రి శ్రీ వాజ్‌పాయిలు తమ సోవియట్ పర్యటనను గురించి సమావేశంలో వివరించారు.

పాఠశాల అభివృద్ధికి రు. 10 వేల విరాళం

ఖమ్మం, అక్టోబరు 28

ఖమ్మం పట్టణంలో వున్న సెయింట్ జోసెఫ్ హైస్కూలును జూనియర్ కళాశాలగా అభివృద్ధి పరిచేందుకు ఖమ్మంజిల్లా బూర్గంపహాడ్ తాలూకా, వేలేరుపాడు గ్రామస్తురాలు శ్రీమతి పువ్వాడ వెంకటనర్సమ్మ తన భర్త కీ॥ శే॥ శ్రీ పువ్వాడ సుబ్బారావు పేరుతో పాఠశాలలో ఒక గదిని నిర్మించేందుకు రు. 10 వేల రూపాయలు విరాళంగా యిచ్చారు.

పాఠశాల పేరెంట్సు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు డా॥ జె మల్లికార్జునస్వామి, డా॥ యన్. అప్పారావు, విరాళం వసూళ్ళ కోసం ఏర్పడిన కమిటీ అధ్యక్షులు డా॥ జయచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు డా॥ పి గోర్కి, శ్రీ పువ్వాడ నాగేశ్వరరావులు యీ నెల 23 తేదీనాడు వెళ్ళి అడిగినదే తడవుగా యీ విరాళాన్ని యిచ్చారు.

శ్రీ పువ్వాడ సుబ్బారావు గత సంవత్సరమే క్యాన్సర్ వ్యాధితో మరణించారు. వీరు బ్రతికుండగా వారి స్వగ్రామంలో పాఠశాల నిర్మాణానికి 3 యకరాల భూమిని, 5 వేల రూపాయలను విరాళంగా యిచ్చారు.

(వి. వి.)

రు. 23½ లక్షల రుణాలు

కసుమంచి బ్రాంచ్‌చే

ఖమ్మం, అక్టోబరు 28

ఖమ్మం జిల్లా కసుమంచిలో 1976 సెప్టెంబరులో నెలకొల్పబడిన నాగార్జున గ్రామీణ బ్యాంకి బ్రాంచ్ ఇప్పటివరకు 23½ లక్షల మేరకు బలహీన వర్గాలకు చెందిన 2000 మందికి ఋణాలను అందజేసింది.

ఈ బ్రాంచ్ 1800 మంది నుండి రు. 6 35 లక్షల డిపాజిట్లను సేకరించిందని బ్రాంచ్ మేనేజరు శ్రీ ఎ. మహేంద్ర[illegible] తెలియజేశారు.

భూసంస్కరణల ఊసే ఎత్తని జనతా ప్రభుత్వం

—ఐ. ఎస్. టి. యు. సి అధ్యక్షుని విమర్శ

పాట్నా, అక్టోబరు 28

జనతా ప్రభుత్వం భూసంస్కరణలపై తన విధానాన్ని ప్రకటించక పోవడమే బీహారులోను, ఇతరచోట్ల హరిజనులపై అత్యాచారాలు పెరిగిపోవడానికి కారణమని జాతీయ గ్రామీణ కార్మికుల సమాఖ్య అధ్యక్షులు శ్రీ బి భగవతి నేడు యిక్కడ అన్నారు

ఐ యన్. టి యు సి.కి కూడా అధ్యక్షులు అయిన శ్రీ భగవతి నేడిక్కడ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ఆ ప్రకటన జారీ చేయకపోవడాన్ని స్వార్థపర వర్గాలు అవకాశంగా తీసుకొంటున్నాయని తెలిపారు

జనతాపార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆ ప్రభుత్వానికి భూసంస్కరణలపై ఆసక్తి లేదనే అభిప్రాయం కలగటంచేతనే పేదలకు పంచిన భూములను భూస్వాములు తిరిగి ఆక్రమించుకొంటున్నారని ఆయన అన్నారు.

కనుక కేంద్రంలోను, రాష్ట్రాలలోను వున్న జనతాపార్టీ ప్రభుత్వాలు వెంటనే భూసంస్కరణలపై తమ విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని ఆయన కోరారు.

అక్టోబరు 20 న నలుగురు హరిజనులు దహనబడిన భోజపూర్ జిల్లా ధరంపుర గ్రామాన్ని నిన్న సందర్శించిన శ్రీ భగవతి "ఈ దహన ప్రహసనంగా భూ సమస్యకు" సంబంధించిందని తెలిపారు.

ఇది ప్రధాన మైన ఆర్థిక సమస్యఅని, దీనిని పరిష్కరించకపోతే భూస్వాములు, హరిజనులు, పెద్దకులాల మధ్య ఘర్షణలను నివారించడం సాధ్యపడదని శ్రీ భగవతి అన్నారు.

జర్నలిస్టులు : శుక్లా

(1 వ పేజీ తరువాయి)

వుందా?

శుక్లా: నాకు తెలీదు.

నియమావళి, 'మీసా' చట్టాల ఉల్లంఘనను మాత్రమే చేపట్టాలంటూ నిర్దిష్టమైన ఆదేశాలేమీ అధికారులకివ్వలేదని శుక్లా అన్నారు.

ఈ ఆదేశాల అమలులో వక్రీకరణలకు తావులేదా జర్నలిస్టులను వేధించటానికి వీటి సాధనాలు అయ్యే ప్రమాదం లేదా అని షా ప్రశ్నించగా, "ఇది సరికాదు"ని శుక్లా సమాధానమిచ్చారు. భారత రక్షణచట్టం, అంతరంగిక భద్రతాచట్టం, మీసాలను ఉల్లంఘించే "హెచ్చరికలు" చేయాలన్న ఉద్దేశం లేదన్నారు.

షా: దాన్ని [illegible] చేశారా?

శుక్లా: దాన్ని అధికార్లూ, జర్నలిస్టులూ బాగా అర్థం చేసుకున్నారు.

ప్రధాన మంత్రి లేఖ

సెన్సార్‌షిప్ సడలింపు సందర్భంగా జనవరి 20 న ప్రధానమంత్రి శుక్లాకు రాసిన లేఖను షా ప్రస్తావించారు. ఈ వర్తమానం వల్ల హెచ్చరికలు చేసేవిధానం వచ్చిందా అని అడిగారు.

శుక్లా: మాజీ ప్రధానితో ఈ విషయం చర్చించిన తర్వాత ఆమెనుండి ఈ వర్తమానం అందింది.

మంత్రిత్వ శాఖలో నిర్ణయం జరిగే సమావేశాలకు సమాచార్ జనరల్ మానేజరును, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిని ఎందుకు ఆహ్వానించారని ప్రశ్నించగా "ప్రభుత్వ ఆలోచనా ధోరణి, దేశమంతటాగల పత్రికలలో ధోరణులనూ వారు అర్థం చేసుకుని నియమావళి 'మీసా' చట్టానికి కట్టుబడి ఉండటంలో మిగతా పత్రికలకు ఆదర్శ ప్రాయంగా ఉండగలరనే ఉద్దేశ్యంతో అలా పిలిచామన్నారు,

షా: సమాచార్ అనేది ప్రభుత్వ ప్రమేయం లేని స్వతంత్ర సంస్థ అయినప్పటికి మీరు జనరల్ మేనేజర్‌ను పిలిపించి మాట్లాడారు. సంస్థలో [illegible] వారిని సమాచార్‌లో కొనసాగనీయరాదని ఆదేశించారు. నిజమేనా?

విశ్వాస పాత్రంగా ఉండరనే వారికి నిషేధించిన సంస్థకు చెందినవారు [illegible] అని శుక్లా తెలిపారు.

షా: విశ్వాసమంటే నిషిద్ధ సంస్థలకు సంబంధించిన సమస్య అని జనరల్‌కు స్పష్టంగా చెప్పారా?

శుక్లా: జనరల్‌కి విషయం బాగా అర్థమయిందనుకుంటాను.

విద్యాసంస్థ వద్ద విలాపం?

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, అక్టోబరు 28

స్థానిక ప్రభుత్వ కళాశాల సమీపాన ఒక ఎమ్యూజ్‌మెంటు (విలాసం) పార్కును ప్రారంభించటానికి అధికారులు అనుమతించినట్లు తెలియవచ్చింది.

ఈ పార్కు విద్యార్థులకు హానికరం కాగలదని, దీనిని అనుమతించకూడదని పట్టణ, విద్యార్థి యువజన నాయకులు నేడు డిమాండ్ చేశారు సబ్‌కలెక్టరు కార్యాలయంలో ఒక మెమోరాండాన్ని సమర్పించారు.

మార్కెట్ ధరలు

విజయవాడ, అక్టోబరు 28

విజయవాడ అసిస్టెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ నేడు అందజేసిన 27-10-77 నాటి టోకు ధరలు (క్వింటాల్‌కు [illegible] రూపాయలు, పైసలు మినహా)

ధాన్యం		
	మసూరి	అక్కుళ్ళు
విజయవాడ	114.00	93 33
బియ్యం		
విజయవాడ	195.00	160.00
అపరాలు		
	కందులు	మినుములు
విజయవాడ	300.00	250.00
గుంటూరు	—	—
	పెసలు	శనగలు
విజయవాడ	215.00	210.00
గుంటూరు	—	—
వేరుశనగ		
	పప్పు	నూనె
విజయవాడ	—	710.00
మిర్చి		
	1వ రకం	2వ రకం
విజయవాడ	700 00	650 00
గుంటూరు	—	—
బెల్లం		
	1వ రకం	2 వ రకం
అనకాపల్లి	157.00	140 00
తాడేపల్లిగూడెం	—	—
ధనియాలు		
గుంటూరు		—
విజయవాడ		710 00
కొబ్బరికాయలు		
(1000)	కొత్తవి	పాతవి
విజయవాడ	1000.00	1100.00
రాజోలు	750 00	1000.00
బంగారం-వెండి		
	తులం	కిలో
	బంగారం 655 00	వెండి 1272-00

సూర్యాపేట పి డబ్ల్యు. డి. వర్కర్సు యూనియన్ జనరల్ బాడీ

సూర్యాపేట, అక్టోబరు 28

నల్గొండజిల్లా సూర్యాపేట సబ్ డివిజన్ పి డబ్ల్యు. డి (బి, ఆర్) వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఇటీవల శ్రీ యస్. యల్. వి రమణమూర్తి అధ్యక్షతన జరిగింది

జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ అబ్దుల్ ఖాదర్ సమావేశంలో ప్రసంగిస్తూ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం పై తీవ్రంగా విమర్శించారు

అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా వున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మెకు పూనుకోవాలని సమావేశం నిర్ణయించింది సమ్మెకు పూనుకునే ముందు నవంబరు 13న ప్రదర్శన జరపాలని నిర్ణయించింది.

డిపార్టుమెంటులో పని చేస్తూ మరణించిన గ్యాంగ్ కూలీలు ఇతర కార్మికులకు తక్షణమే గ్రాట్యుటీ చెల్లించాలని సమావేశం నిర్ణయించింది.



ఏ విషయము
హెచ్‌ఎమ్‌టి-జీటర్ 2511ను
భారత దేశములో అతి ఎక్కువగా అమ్ముడుపోయే
ట్రాక్టరు మోడల్ గా చేస్తోంది?

ఒకే ఒక్క చిన్న విషయము, అది
ఏమిటంటే రైతు ఒక ట్రాక్టర్‌లో
కావాలనుకునే ప్రతిదీ కూడా
హెచ్‌ఎమ్‌టి-జీటర్ మాత్రమే ఇస్తుంది

అతి తక్కువ ధర
హెచ్‌ఎమ్‌టి-జీటర్ 2511, సీటెఓ చల్లబరచగలిగే సెల్ఫ్ స్టార్టింగ్ ఇంజన్‌తో, అన్నిటికంటే తక్కువ ధరగల ట్రాక్టర్

అత్యధిక పొదుపు
25 హార్స్ పవర్, 2 సిలిండర్ ఇంజన్‌తో, హెచ్‌ఎమ్‌టి-జీటర్ 2511 ట్రాక్టర్ నడుపుటకు తక్కువ ఖర్చు అవుతుంది మరియు సంరక్షణ కూడా లాభదాయకం చేస్తుంది

అధిక సంఖ్యలో ఉపసాధనములు
మూలధనం లోపించే, అదనముగా కట్టకుండా, హెచ్‌ఎమ్‌టి-జీటర్ 2511 తోపాటు అతి ఎక్కువ సంఖ్యలో ఉపసాధనములు ఉచితముగా దొరుకుతాయి అవి స్ప్రింగింగ్ డ్రాబార్, ఇంజన్ హవర్ మీటర్, ఫుట్ యాక్సిలేటర్, డ్యూయల్ క్లచ్, డిఫరెన్షియల్ లాక్, ట్రైలర్ హుక్, ఫ్రంట్ టోహుక్ మొదలవి

అతి ఆధునికమైన ఆటోమేటిక్ హైడ్రాలిక్ లిఫ్ట్ సిస్టమ్
దీనిలో ఉత్తమమైన "జీటర్ మేటిక్" హైడ్రాలిక్ లిఫ్ట్ సిస్టమ్ అమర్చబడింది దీనివలన ఆటోమేటిక్ "డ్రాఫ్ట్ కంట్రోల్", "పొజిషన్ కంట్రోల్" మరియు సాటిలేని "మిక్స్‌డ్ కంట్రోల్" సదుపాయములు లభిస్తాయి ఇంకా దీనిలో ఇంకా ప్రత్యేకతలు ఉన్నవి అవి బహుముఖమైన సదుపాయములు గల 10 ఫార్వర్డ్ మరియు 2 రివర్స్ స్పీడ్స్, హైడ్రాలిక్ బ్రేక్స్ మరియు పెద్ద సైజు టైర్లు ఉండుట, వీటివలన హెచ్‌ఎమ్‌టి-జీటర్ 2511 దేశమంతా జాగరూకతగల రైతులలో ఎందుకు ఇంతలో ప్రియమైనదోనని వేరే ఆశ్చర్యపడవలసిన పనిలేదు



hmt

దయచేసి మీ పరిసర ప్రాంతములో, మా అనుమతింపబడిన విక్రయదారుని సంప్రదించండి: లేదా
మార్కెటింగ్ డివిజన్ (ట్రాక్టర్స్)
హెచ్‌ఎమ్‌టి లిమిటెడ్, భారత్ యువక్ భవన్, 1 జై సింగ్ రోడ్, న్యూ ఢిల్లీ 110 001 లేదా
48/1 కన్నింగ్‌హామ్ రోడ్, బెంగుళూర్-560 052
మరియు చండీఘర్, లక్నో, పాట్నా
హైదరాబాద్‌లలోనున్న హెచ్‌ఎమ్‌టి యొక్క ప్రధాన కార్యాలయములను సంప్రదించండి

hmt Zetor

భారత దేశములో అతి ఎక్కువగా అమ్ముడు పోయే ట్రాక్టరు మోడల్!

లేదా
ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ ఆటో ఎంటర్‌ప్రైసెస్, బాక్స్ నం.పో 70: లబ్బీపేట, బందర్ రోడ్, విజయవాడ 520 010, నవోదయ ఎంటర్‌ప్రైసెస్, లింగంపల్లి, డి-నం. 3-4-267/1, కాచిగూడ స్టేషన్ రోడ్, హైదరాబాద్ 500 027; పద్మజ కమర్షియల్ కార్పొరేషన్, కాంతాపేట, ఒంగోలు (A•

UPSC Advt No. 44

APPLICATIONS ARE INVITED FOR THE FOLLOWING POSTS :

1 **One Dy Dir D'te of Non-Formal (Adult) Education Education & S W Min** *(Post pmt apptt on temp basis)* Pay Rs 1100-50-1600 Age Not exceeding 40 yrs EQ (i) 2nd Cl Master s Deg or eqv (ii) About 7 yrs exp in the field of Adult Education or related fields conducting Social Surveys teaching & res in Adult Education at Univ level

2 **One Dir Design & Development Centre, Goa Industries & Power Deptt, Govt of Goa Daman & Diu** *(Post temp likely to continue indef)* Pay Rs 1100-50-1600 Age Not exceeding 40 yrs EQ (i) Deg or Dip in Art of recog Univ/Instn of Art & Crafts (ii) About 5 yrs exp of creative design work in any media

3 **One SSO-II, Def Electronics Res Lab, Hyderabad Def Min** *(Post temp likely to continue indef) (Resvd for SC failing unresvd)* Pay Rs 700-40-900-EB-40-1100-50-1300 Age Pref below 30 yrs EQ (i) 2nd Cl Master s Deg in Physics with Electronics/Solid State Physics as special subject or eqv (ii) About 2 yrs exp in Res/Design & Dev of Hybrid Electronics Circuits

4 **One Lecturer in Civil Engg Delhi College of Engg, Delhi Admn** *(Post pmt apptt initially on temp basis)* Pay Rs 700-40-1100-50-1600 Age Not exceeding 35 yrs EQ 2nd Cl Deg in Civil Engg or eqv with 3 yrs teaching/res/professional exp *Or* 2nd Cl Master s Deg in Civil Engg or eqv

5 **One Research Offcr (Elect Engg), Planning Commission** *(Post temp likely to continue) (Resvd for SC failing unresvd)* Pay Rs 700-40-900-EB-40-1100-50-1300 Age Not exceeding 30 yrs EQ (i) Deg in Elect Engg or eqv (ii) About 3 yrs exp in handling problems relating to planning and/or design of power systems power generation transmission & distribution

6 **Two Asstt Dirs of Census operations (Technical) Office of the Registrar Genl India, Home Min** *(Posts temp likely to continue indef) (1 post resvd for SC)* Pay Rs 700-40-900-EB-40-1100-50-1300 Age Not exceeding 35 yrs EQ (i) Master s deg in Statistics/Maths/Economics/Commerce/Sociology/Anthropology/Geography/Linguistics or eqv *Or* Deg with Statistics/Maths/Economics/Commerce/Sociology/Anthropology/Geography as a subject plus a recog dip in Statistics obtained after 2 yrs post grad trg (ii) 3 yrs exp in collection tabulation & analysis of statistical data

7 **Five (4 Existing & 1 Anticipated) Jr Mining Geologists Indian Bureau of Mines Steel & Mines Min** *(Posts temp likely to continue indef) (Of the 4 existing posts 1 post exclusively resvd for SC & 1 post resvd for SC failing for ST & failing both unresvd) (1 post resvd for ST failing for SC failing both unresvd) (The anticipated post exclusively resvd for ST)* Pay Rs 700-40-900-EB-40-1100-50-1300 Age Not exceeding 35 yrs EQ (i) Dip of the Indian School of Mines & Applied Geology Dhanbad or Master s deg in Geology or Applied Geology or eqv (ii) Trg in different aspects of prospecting for Minerals & Utilisation of Minerals (iii) About 3 yrs exp in detailed prospecting & proving of Minerals specially lead Zinc Copper Coal Iron & Sulphur

8 **One Asstt Traffic Offcr, Regional Office of the Inland Water Transport D te, Patna Shipping & Transport Min** *(Post pmt)* Pay Rs 650-30-740-35-810-EB-35-880-40-1000 EB-40-1200 Age Not exceeding 35 yrs EQ (i) Deg pref with Economics/Statistics/Commerce as a subject or eqv (ii) 4 yrs exp relating to traffic & Commercial Transportation in a Govt Deptt/Autonomous Body Public Sector Undertaking or Private concern of repute

9 **Fourteen Sr Soil Surveyors All India Soil & Land Use Survey, Agri & Irrig Min** *(Posts temp likely to continue indef) (2 posts & 1 post exclusively resvd for SC & ST respectively)* Pay Rs 550-25-750-EB-30-900 Age Not exceeding 30 yrs EQ M Sc Deg in Soil Sc Agril Chemistry or Agri with specialisation in Soil Sc or eqv

10 **One Research Offcr (Animal Husbandry Statistics) Agri & Irrig Min** *(Post temp likely to continue indef)* Pay Rs 700-40-900-EB-40-1100-50-1300 Age Not exceeding 35 yrs EQ (i) Master s deg in Statistics or in Maths/Economics/Commerce (with Statistics) or eqv *Or* Deg with Maths/Statistics/Economics as a subject and a recog dip obtained after 2 yrs post-grad trg in Statistics (ii) About 3 yrs exp in collection, compilation & interpretation of Statistical data pref in Agril Economics/Animal Husbandry

11 **One SSO (Ballistics), Central Forensic Sc Lab C B I, New Delhi.** *(Post temp likely to continue indef & resvd for SC)* Pay Rs 700-40-900-EB-40-1100-50-1300 Age Not exceeding 40 yrs EQ (i) Master s deg in physics or Maths or Chemistry or eqv (ii) 5 yrs Res exp in Physical analysis/applied maths

12 **One Dy Manager (Designs) India Security Press, Nasik Rd. Finance Min** *(Post pmt apptt initially on temp basis)* Pay Rs 1100-50-1600 Age Not exceeding 40 yrs EQ (i) Matric or eqv (ii) Deg or eqv Dip in Commercial Art (iii) 7 yrs exp as a Commercial Artist

13 **One Dy Asstt Dir National Fire Service College Nagpur, Home Min** *(Post pmt apptt initially on temp basis)* pay Rs 650-30-740-35-880-EB-40-960 Age Not exceeding 40 yrs EQ (i) Matric or eqv (ii) Graduate of the Instn of Fire Engrs (India) or eqv (iii) 10 yrs exp in a full time Fire Brigade Service of which 4 yrs shd be in the rank not below Station Offcr

14 **One Inspector (Sugar) D te of Sugar Agri & Irrig Min** *(Post pmt, apptt on temp basis) (Resvd for ST)* Pay Rs 650-30-740-35-810-EB-35-880-40-1000-EB-40-1200 Age Not exceeding 40 yrs *Not relaxable for Govt servants* EQ (i) Deg in Arts/Commerce/Sc or eqv (ii) About 3 yrs exp of work connected with the sugar industry or Trade in a Govt Orgn dealing with Sugar or Food Controls

15 **One Publicity Offcr (Small Pox Eradication) DGHS** *(Post pmt, apptt on temp basis)* Pay Rs 550-25-750-EB-30-900 Age Not exceeding 35 yrs EQ Deg of recog Univ About 3 yrs journalistic exp in a Newspaper News Agency or a Publicity Orgn of standing

CLOSING DATE FOR RECEIPT OF APPLICATIONS FOR THE ABOVE POSTS IN UPSC OFFICE 28 11 1977
(12 12 1977 for candidates abroad Andaman & Nicobar Islands & Lakshadweep)

- ★ *For application forms* write Secretary Union Public Service Commission New Delhi-110011 with unstamped self-addressed envelope (23X10cm) giving name of post item & Advt No Application forms can also be obtained across the counter from (a) University Employment Bureaux (b) Secretaries State Public Service Commissions, (c) Officers of Union Territories of Andaman & Nicobar Islands, Port Blair Govt of Mizoram Aizawl Govt of Pondicherry, Pondicherry Govt of Goa Daman & Diu, Panaji Asstt Employment Officer Lakshadweep Kavaratti Arunachal Pradesh Administration Itanagar and (d) Station Directors All India Radio Simla Leh Port Blair Kohima Imphal Agartala Aizawl Passighat Tezu, Tawang Silchar Jeypore Panaji Gauhati & Calicut These are also available at the Reception Counter of the U P S C
- ★ Candidates belonging to Scheduled Castes/Scheduled Tribes communities may also ask for form of Caste Certificate along with their request for application forms
- ★ Age on 28 11 1977 (age concession for displaced persons SC ST & Govt servants unless stated otherwise)
- ★ Qualifications relaxable for the above posts at Commission s discretion
- ★ Higher initial pay may be given according to qualifications
- ★ Fee in Indian Postal Orders for Rs 8 (Rs 2 for SC & ST) to be enclosed with application duly filled in Candidates abroad pay fee to Indian Embassy and forward the receipt issued by the Embassy along with the application The fee should in no case be enclosed with request for application forms

ABBREVIATIONS SC—Scheduled Castes ST—Scheduled Tribes RESVD—Reserved, EQ—Essential Qualifications

COMBINED EXAMINATION (1978) FOR RECRUITMENT TO MEDICAL POSTS IN THE RAILWAYS AND ORDNANCE FACTORIES HEALTH SERVICE

TO BE HELD ON 14TH MARCH, 1978

Only candidates below 40 years as on 1st January 1978 are eligible Age relaxable for Scheduled Castes/Scheduled Tribes and certain other categories *Qualifications* Candidates should have passed the written and practical parts *of the final M B B S Examination on or before 19th* December 1977 Details and printed application forms obtainable from Secretary on payment of Rs 2 00 either by Money Order or by Crossed Indian Postal Orders payable to Secretary UPSC at New Delhi General Post Office or on cash payment at UPSC counter Requests for supply of application form and full particulars of the examination *by post* must reach the office of the Commission before 12 12 1977 However the forms may be had personally from the counter in the office of the Commission upto 19 12 1977 Applications on printed form only will be entertained

Closing date 19th December, 1977 (2nd January, 1978 for candidates abroad)

davp 560 (33)/77

కొత్తగూడెంలో జనతాపార్టీ గూండాల ఆగడాలు

సి. బి. ఐ. చే విచారణ జరిపించాలని డి. యస్. పి.కి శ్రీ కొమరయ్య మెమోరాండం

కొత్తగూడెం అక్టోబరు 28

కొత్తగూడెంలో ఈ నెల 22న జనతా పార్టీ గూండాలు జరిపిన ఆగడాలపై సి.బి.ఐ చే బహిరంగ విచారణ జరిపించాలని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కొమరయ్య డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంటుకు ఒక మెమోరాండం సమర్పించారు.

ఆ మెమోరాండంలో ఇంకా ఈ క్రింది విధంగా పేర్కొన్నారు:

జనతాపార్టీ గూండాలు దాదాపు 70మంది లాఠీలు ఆయుధాలతో శ్రీ ఎ. వి. మల్లయ్య ఇంటిపై దాడి చేశారు.

శ్రీ మల్లయ్య కోసం ఇల్లంతా గాలించారు "ఈ రోజుతో మల్లయ్యకు రోజులు నిండాయని ఎక్కడ కనిపించినా అతనిని చంపివేస్తామని" కేకలు వేశారు. మల్లయ్య కనిపించక పోవటంతో విద్యార్థి నాయకుడు శ్రీ డి నాగేశ్వరరావు వుంటున్న శ్రీనివాసా టాకీస్ ప్రాంతానికి వెళ్ళి అతని ఇంటిపై దాడి చేశారు నాగేశ్వరరావు ఇంట్లో లేక పోవటంతో శ్రీనివాసాటాకీసు లోపలకు వెళ్ళి గాలించారు నాగేశ్వరరావు దొరకలేదు.

తరువాత వారు అసభ్యకరమయిన నినాదాలు యిస్తూ 4వ నంబరు బస్‌స్టాప్ వద్దకు వచ్చి బస్సులను బలవంతంగా నిలుపు చేసి మల్లయ్య, నాగేశ్వరరావు, రాజారామ్ కోసం బస్సులలో గాలించారు,

సింగరేణి కాలరీస్‌కు చెందిన బొగ్గు రవాణా చేసే లారీలను ఆపి లారీల క్యాబిన్లను ఈ ముగ్గురి కోసం సోదా చేశారు.

తరువాత ఈ గూండాలు రెండవ టౌన్ పోలీసు సబ్ఇన్‌స్పెక్టరు నివాసానికి ఎదురుగా వున్న ఇంటిపై దాడిచేసి ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థి శ్రీ సూరి రాజేశ్వరరావును విపరీతంగా కొట్టారు స్పృహ కోల్పోయిన అనంతరం మాత్రమే శ్రీ రాజేశ్వరరావును గూండాలు వదిలి వేశారు

ఈ గూండాలు దాదాపు 2 గంటలపాటు ఈ ప్రాంతాలలోని ప్రజలను భయకంపితులను చేశారు

శ్రీ డి నాగేశ్వరరావు తండ్రి అయిన శ్రీ దాట్ల తండ్రి ముందుగా పోలీసుస్టేషన్‌లో గూండాల స్వైర విహారం గురించి రిపోర్టు ఇచ్చాడు అయితే పోలీసులు వెంటనే ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. ముందుగానే జనతాపార్టీ నాయకులు పోలీసు స్టేషన్‌కు వెళ్ళి పోలీసులను తప్పుదారి పట్టించారు.

సి. ఐ. డి కానిస్టేబులు శ్రీ చల్లయ్య కూడా అక్కడ వున్నారు ఈ గూండాల వారి నాయకులు అందరూ ఈయనకు బాగా తెలుసు

గూండాల స్వైర విహారం జరిగిన రెండు గంటల తరువాత మాత్రమే పోలీసులు చర్యలు తీసుకున్నారు ప్రముఖ గూండాలను వదలివేసి రామవరంకు చెందిన కొందరు వ్యక్తులను అరెస్టు చేశారు. గూండాల దాడికి భయపడి రామవరంలో తలదాచుకున్న శ్రీ డి నాగేశ్వరరావును, మరికొందరిని కూడా పోలీసులు అరెస్టు చేశారు.

1973 సెప్టెంబరు 28న యూనియన్, యువజన సమాఖ్యల నాయకులను హత్య చేసేందుకు కుట్ర జరగటం, పోలీసులు సకాలంలో చర్యలు తీసుకొని ఈ కుట్రను విఫలం చేయటం ఈ కుట్రకు వ్యతిరేకంగా 1973 అక్టోబరు 10న కొత్తగూడెం కార్మికులందరు సమ్మె జరపటం తదితరాలను ఆ మెమోరాండంలో ప్రస్తావించారు.

ఈ నెల 22వ తేదీ ఘటనలపై సిబిఐచే బహిరంగ విచారణ జరిపించాలి. ప్రజల ఆస్తుల, ప్రాణాల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ మెమోరాండంలో కోరారు.

ఆది ఆంధ్ర, అరుంధతీయ, హరిజన, క్రైస్తవ సమావేశం

నిడదవోలు, అక్టోబరు 28

నిడదవోలు పరిసర ప్రాంతాల ఆది ఆంధ్ర అరుంధతీయ హరిజన, క్రైస్తవ సమావేశం స్థానిక డి. యస్. ఓ. హైస్కూలులో యీ నెల 23న జరిగింది.

కన్వీనర్ శ్రీ పి హెచ్. విలియంరాజు సమావేశ ఉద్దేశం వివరించారు, శ్రీ టి. రాజేశ్వరరావు అధ్యక్షత వహిస్తూ హరిజనులపై జరుగుతున్న అత్యాచారాలను వివరించి, వాటిని ఎదుర్కొనేందుకై అంతా సంఘటితం కావాలన్నారు.

శ్రీయుతులు టి జి. ఎక్టర్, వేమనదాని ప్రకాశం, టి. నాగేశ్వరరావు, బి నరసింహమూర్తి, ఎం మహాలక్ష్మి. వై సూర్యనారాయణ ఎ అమృతరావు ఇ. పి కాశి డి మాణిక్యం సంఘ ఆవశ్యకత గూర్చి వివరించారు. మొత్తం 100 మంది సమావేశంలో పాల్గొన్నారు

సంఘ నిర్మాణానికి వీలుగా విస్తృత సమావేశం ఏర్పాటు చేసేందుకై శ్రీ పి హెచ్ విలియంరాజు అధ్యక్షునిగా 8మందితో ఒక అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేశారు,

రేడియో

ఆదివారం ◆ అక్టోబరు 30
శక 1899 ◆ కార్తీక 8

హైదరాబాదు-ఎ

ప్రసారము I

6.00 వందేమాతరం: 6 55 ఖమ్మం జిల్లా సమాచార లేఖ, 7 30 అమరవాణి, 8 30 తంపెర్ల సూర్యనారాయణ వయొలిన్. 9 45 చిత్రసీమ 10 00 ప్రసార సమాప్తి.

ప్రసారము II

11 45 చిత్రసీమ, 12.00 రాయప్రోలు జానకీదేవి వాద్యబృందంతో గానం, 1.00 చిత్రసీమ, 3 00 పురూరవ - నాటకం, 4.00 ప్రసార సమాప్తి.

ప్రసారము III

5.30 లలితసంగీతం, 7.45 విజ్ఞాన, సాంకేతికశాస్త్రాలు, పత్రికా కార్యక్రమం, 8 15 చిత్రసీమ, 8 45 జానపదగేయాలు, 9 30 కరెంటు ఎఫైర్స్, 10 00 ధ్యానగీత 10.30 ప్రసారసమాప్తి.

విజయవాడ

ప్రసారము I

5.55 వందేమాతరం, 6.55 జిల్లా సమాచార లేఖ, 7 15 జానపదగేయాలు, 8 45 చిత్రతరంగిణి, 10 00 ప్రసార సమాప్తి.

ప్రసారము II

12 00 ధర్మ సందేహాలు, 1.10 వెలుగుబాట, 3.00 పురూరవ - నాటకం, 4 00 ప్రసార సమాప్తి.

ప్రసారము III

5 30 భజనావళి, 6 25 యువవాణి, 7.45 విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలు పత్రికా కార్యక్రమము, 8.15 లలిత సంగీతం. 9.30 సుగ్రీవ విజయం సంగీత రూపకం 10.30 ప్రసార సమాప్తి

టెలివిజన్

హైదరాబాద్ కేంద్రం

1 వ బాండ్, నాలవ ఛానల్

[ప్రసారాలు ప్రతిరోజూ సాయంత్రం 7 గంటలనుండి 8 గంటలవరకు ఉంటాయి 7 గంటల 55 నిమిషాలకు ప్రతిరోజూ 5 నిమిషాలపాటు దూరదర్శన్ వార్తలు వెలువడతాయి ప్రతి ఆదివారం తెలుగు కథా చిత్రాల ప్రసారం వుంటుంది |

కార్యక్రమ విశేషాలు: బాబూ మూవీస్ వారి పూర్తినిడివి తెలుగు కథా చిత్రం మూగమనసులు.

ఆంధ్ర సారస్వత సమితి సాహిత్యసభ

మచిలీపట్నం అక్టోబరు 28

స్థానిక ఆంధ్ర సారస్వత సమితి 11వ జన్మ దినోత్సవ సందర్భంగా టౌన్ హాలులో ఈనెల 21న శ్రీ బాగవతుల కుటుంబరావు అధ్యక్షతన సాహిత్యసభ జరిగింది.

ప్రధాన వక్తలు డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం (ఉస్మానియా విశ్వవిద్యాలయం రీడరు) "తెలుగులో కావ్యశిల్పం". అనే అంశంపై ప్రసంగిస్తూ నన్నయ్య మొదలు నేటి శ్రీ శ్రీ వరకు వారి రచనలలో రస, వస్తు ధ్వని, శిల్పాలను సోదాహరణంగా వివరించారు.

డా॥ పి యశోదా రెడ్డి (ఉస్మానియా విశ్వవిద్యాలయం రీడరు) "ప్రాచీనాంధ్రకవయిత్రులు" అనే అంశంపై ప్రసంగిస్తూ సమస్య పరిష్కార మార్గాన్ని చూపిన ఆదర్శ రచయిత్రి మొల్లయని, ఆమె రచనలలోని విశేషతను వివరించారు.

శ్రీ బోయిన వెంకటేశ్వరరావు, ముఖ్య అతిథులను పరిచయం చేసారు సమితికార్యదర్శి శ్రీ జి. బాలస్వామి వార్షిక నివేదిక చదివారు.

తదనంతరం ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీ యు ఎన్. వి శేషేశ్వరరావు (విజయవాడ) "సితార్" కార్యక్రమం యిచ్చారు. (వి. వి.)

'ఏ గ్రూపునూ అంటిపెట్టుకోను'

—శ్రీ మాగంటి అంకినీడు

గుడివాడ, అక్టోబరు 28

ప్రస్తుత పరిస్థితిలో ఏ గ్రూపునూ అంటిపెట్టుకొనక స్వతంత్రంగా సంస్థకు సేవ చేయాలన్నది తన వ్యక్తిగతాభిప్రాయంగా కాంగ్రెస్ పార్లమెంటుసభ్యులు శ్రీ మాగంటి అంకినీడు తెలిపారు

స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమంటపంలో యీ నెల 22న జరిగిన పట్టణ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి అధ్యక్షత వహిస్తూ ఆయన పై విధంగా చెప్పారు

రాష్ట్ర దేవాదాయ మంత్రి అకలావు లక్ష్మణదాసు మాట్లాడుతూ, కాంగ్రెస్‌లో ప్రస్తుతం నెలకొని వున్న పరిస్థితుల దృష్ట్యా జిల్లా, గ్రామ స్థాయిల్లో సమావేశాలు జరిపి స్థిరమయిన నిర్ణయాలు తీసుకోవడం సముచిత మన్నారు

ఉపాధి కల్పనశాఖ మంత్రి శ్రీ పిల్లా వెంకటరావు అసలయిన కాంగ్రెసు వాదులను విస్మరించి, సంస్థను విమర్శించే వారికి పదవులు కట్టబెట్టడంలోనే యీ చిక్కులు వచ్చాయని, కార్యకర్తలకు తగుప్రాముఖ్యత యివ్వలేదని విమర్శించారు.

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీ కొమ్మూరు అప్పడు దొర, స్థానిక శాసన సభ్యులు శ్రీ కటారి సత్యనారాయణ కూడా మాట్లాడారు

'రవి షా మార్టు' ప్రారంభం,

ప్రభుత్వ ఆర్థిక పథకం క్రింద కృష్ణాజిల్లా షెడ్యూల్డు కులాల, తెగల సహకార సంఘం ఆర్థిక సహాయంతో గుడివాడలో నెలకొల్పబడిన 'రవి షా మార్టు' ను ఆ సంఘ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ జి సి హెచ్ రాధాకృష్ణ యీ నెల 16న ప్రారంభోత్సవం చేశారు,

అప్పు [illegible]

భవనములు, థియేటర్లు షాపులు మాములు, మిల్లులు, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు, పెద్ద ఇండస్ట్రీలు మొదలగు వాని తనఖాపై సహేతుకమైన షరతులపై వ్యాపారాభివృద్ధికి రు 10 000 అంతకు మించిన మొత్తానికి ఋణము లభించును ఇంగ్లీషులో వ్రాయండి.

Swastik Finance Corporation
292/302-Shanti Nivas
2nd Floor, V P. Road
Prarthana Samaj
BOMBAY—400004.
Phone : 381131.

విజ్ఞప్తి

మా సభ్యులు, ఏజెంట్లు, ప్రజలు మా టెలిఫోన్ నెంబరు 53706 కు బదులుగా 57406 గా మారినదని తెలుసుకొనగోరుచున్నాము ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాం.

గుజరాత్ సేవింగ్స్
5-1-751, బ్యాంకుస్ట్రీట్,
హైదరాబాదు-500 001.



4 వ వారం
గడుసు అమ్మాయి
దర్శకత్వం కె. ప్రత్యగాత్మ
పూర్ణ రిలీజ్
నిర్మాతలు పి. రాఘవేంద్రరావు పి. వెంకటేశ్వరరావు
NAVRANG

త్రిల్స్ సెక్స్ సస్పెన్స్!
నేడే విడుదల! ఉదయం ఆటతో
డ్రీమ్‌బాయ్ కమలహాసన్ స్వీట్‌గరల్ దీప జంటగానటించిన
శివనాగకుమారికంబైన్స్
అందాల రాజా
పార్ట్‌లీకలర్
దర్శకత్వం శ్రీనివాస్ సంగీతం JV రాఘవులు
నిర్మాత నాగమణి రామకృష్ణ
శ్రీవాణీరిలీజ్
RADHIKA
తూ.గోదావరి విజయలక్ష్మీపిక్చర్స్ రాజమండ్రి ప.గోదావరి ఉషాపిక్చర్స్ ఏలూరు

విశాలాంధ్ర విజ్ఞానసమితి తరపున ప్రింటర్ అండ్ పబ్లిషరు, టి. వెంకటేశ్వరరావు ఎడిటర్ సి. రాఘవాచారి, ముద్రణ: విశాలాంధ్ర ప్రెస్, విజయవాడ 520004 R. No. 3118/57.